

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 10-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 146 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: తదియ మ.3:38 తదుపరి చవితి, నక్షత్రం: రేవతి సా.4:03 తదుపరి అశ్విని, వర్జ్యం: శేషం ఉ. 6.32, దుర్ముహూర్తం: ఉ.11:47-12:36, అమృతఘడియలు: మ.1:51-3:19, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:06, సూర్యాస్తమయం: 6:18 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బంగారం భగ్గు



సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి ధర

- ఢిల్లీలో 10 గ్రాములు రూ.1,12,750కి చేరిక
- ఒక్కరోజే రూ.5,080 పెరుగుదల
- ఈ ఏడాదిలో రూ.33,800 అప్

న్యూఢిల్లీ: పసిడి చుక్కలనంటుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ దీని ధర సరికొత్త శిఖరాలకు దూసుకెళ్లింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మంగళవారం రూ.5,080 పెరిగి సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.1,12,750కి ఎగబాకింది. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ ప్రకారం.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు గోల్డ్ రేటు రూ.33,800 (దాదాపు 43 శాతం) పెరిగింది. గత ఏడాది డిసెంబరు 31న ఢిల్లీలో 10 గ్రాముల పసిడి రేటు రూ.78,950గా నమోదైంది. వెండిదీ గోల్డెన్ ట్రెండే.. కిలో రేటు రూ.2,800 పెరుగుదలతో రూ.1,28,800కు చేరింది. ఇంటర్నేషనల్ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ మరో 16.81 డాలర్లు ఎగబాకి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 3,659.27 డాలర్లకు పెరిగింది. సిల్వర్ 41.50 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. గత నెలలో అమెరికా కార్మిక శాఖ విడుదల చేసిన ఆగస్టు ఉద్యోగ నియామకాల గణాంకాలు బలహీనంగా ఉండటంతో పాటు గతంలో విడుదల చేసిన మే, జూన్ గణాంకాలను సైతం దిగువకు సవరించడంతో వచ్చేవారం ఫెడ్ రేట్లు మరింత తగ్గించవచ్చన్న అంచనాలు ఊపందుకున్నాయి. ఇది బులియన్ ర్యాలీకి ప్రధాన కారణం. తాజా ఉద్యోగ గణాంకాలు అమెరికా ఆర్థిక పరిస్థితిపైనా కొత్త సందేహాలు లేవనెత్తుతున్నాయి. ట్రంప్ టారి‌ఫ్‌లతో అంతర్జాతీయంగా వాణిజ్య అవరోధాలు కూడా పెరిగాయి. దాంతో ఇన్వెస్టర్లు ఆర్థిక అనిశ్చితుల్లో భద్రత కల్పించే బంగారంలోకి తమ పెట్టుబడులను మళ్లిస్తున్నారని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు.

ఏడాది చివరినాటికి 4,000 డాలర్లకు?

ఔన్స్ పసిడి ఈ వారంలోనే 3,700 డాలర్లకు ఎగబాకవచ్చన్న అంచనాలున్నాయి. మాంద్యం ముప్పును ఎదుర్కొంటున్న అమెరికా ఆర్థిక వ్యవస్థకు మద్దతిచ్చేందుకు అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను వేగంగా తగ్గించాల్సి వస్తే, ఈ ఏడాది చివరినాటికి ఔన్స్ బంగారం 4,000 డాలర్లు దాటే అవకాశాల్లేకపోలేవని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఏడాదికాలంలో వెండి రూ.1.50 లక్షలు

వచ్చే ఏడాది కాలంలో కిలో వెండి ధర రూ.1.50 లక్షలకు చేరుకోవచ్చని, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) సిల్వర్ 50 డాలర్లకు ఎగబాకనుందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ నివేదిక అంచనా వేసింది. పారిశ్రామిక రంగంలో వెండి వినియోగం గణనీయంగా పెరుగుతుండటం, బలహీనపడుతున్న డాలర్, మరింత తగ్గనున్న ఫెడ్ రేట్లు, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు అన్నీ వెరసి ఈ విలువ లోహం ధరలను ఎగదోయనున్నాయని రిపోర్టు పేర్కొంది. మోతీలాల్ ఓస్వాల్ భావిస్తోంది. మల్టీకమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సిల్వర్ ధర ఈ ఏడాదిలో ఇప్పటివరకు 37 శాతం పెరిగింది.

ఎన్ఎస్ఈ చైర్మన్‌గా ఇంజేటి శ్రీనివాస్



న్యూఢిల్లీ: ఒడిశా కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి, ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ (ఐఎఫ్ఎస్‌సీఏ) మాజీ వ్యవస్థాపక చైర్మన్ ఇంజేటి శ్రీనివాస్.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) చైర్మన్‌గా నియమితులయ్యారు. మంగళవారం నుంచే ఈ నియామకం అమల్లోకి వచ్చింది. గత రెండేళ్లుగా ఎన్ఎస్ఈకి సారథి లేరు. తొలి పబ్లిక్ ఇష్యూకి (ఐపీఓ) ఎక్స్ఛేంజీ సిద్ధం అవుతున్న సమయంలో తెలుగు మూలాలున్న శ్రీనివాస్ నియామకం జరిగింది. ఆయన ఇటీవల ఎన్ఎస్ఈలో పబ్లిక్ ఇంటరెస్ట్ డైరెక్టర్‌గా చేరారు. గతంలో ఆయన కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శిగా కూడా పని చేశారు. కార్పొరేట్, ఆర్థిక నియంత్రణలు, పారిశ్రామిక ప్రోత్సాహం, కార్పొరేట్, దివాలా చట్టం, కాంపిటీషన్ చట్టం, చార్టెడ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ వంటి భిన్న రంగాల్లో ఆయనకు నాలుగు దశాబ్దాలకు పైబడిన అనుభవం ఉంది. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ నుంచి బీఏ (హానర్స్) పూర్తి చేసిన శ్రీనివాస్ 1983లో ఒడిశా కేడర్ అధికారిగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు.

ఐఫోన్ 17 వచ్చేసిందోచ్..

- నాలుగు వేరియంట్లలో లభ్యం
- ప్రారంభ ధర రూ.82,900
- గరిష్ఠ రేటు రూ.1,49,900



కుపర్టినో(కాలిఫోర్నియా): అమెరిక్ టెక్నాలజీ దిగ్గజం యాపిల్ ఐఫోన్ 17 సిరీస్‌ను మంగళవారం ప్రపంచానికి పరిచయం చేసింది. కాలిఫోర్నియా, కుపర్టినోలోని యాపిల్ పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కంపెనీ సీఈఓ టిమ్ కుక్ ఈ ఫోన్లను ఆవిష్కరించారు. మొత్తం నాలుగు వేరియంట్లలో (17, 17 ఎయిర్, 17 ప్రో, 17 ప్రో మ్యాక్స్) లభ్యం కానున్నాయి. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చి, సుంకాల మోత మోగిస్తున్న తరుణంలో కంపెనీ ప్రపంచ మార్కెట్లోకి విడుదల చేస్తున్న కొత్త ఐఫోన్ సిరీస్ ఇదే. ఇందులో ఐఫోన్ 17, 17 ఎయిర్ బుకింగ్ ఈనెల 12 నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 19 నుంచి స్టోర్లలోకి అందుబాటులోకి వస్తాయి. 17 ప్రో, ప్రో మ్యాక్స్ మోడళ్లు కూడా 19 నుంచి స్టోర్లలో లభ్యమవుతాయని సంస్థ తెలిపింది. యాపిల్ కొత్త ఐఫోన్‌తోపాటు యాపిల్ వాచ్ 11 సిరీస్‌ను, ఎయిర్‌పాడ్స్ 5, ఎయిర్‌పాడ్ ప్రో 3ను సైతం లాంచ్ చేసింది. వీటిని తక్షణమే బుక్ చేసుకోవచ్చు. ఈనెల 19 నుంచి మార్కెట్లోకి అందుబాటులోకి వస్తాయి.

ఎయిర్‌పాడ్ ప్రో 3: ప్రపంచంలో అత్యుత్తమ నాయిస్ క్యాన్సిలేషన్ సాంకేతికతతోపాటు లైవ్ ట్రాన్స్‌లేషన్ ఫీచర్‌తో కూడిన ఎయిర్‌పాడ్ ప్రో 3 ధర 249 డాలర్లు.

యాపిల్ వాచ్ సిరీస్ 11: బిల్ట్ ఇన్ 5జీ కనెక్టివిటీ, హైపర్ టెన్షన్ అలర్ట్స్(రక్తపోటు హెచ్చరికలు), స్లీప్ స్కోర్ వంటి కొత్త ఫీచర్లతో కూడిన యాపిల్ వాచ్ 11 సిరీస్ ధర 399 డాలర్లు. 24 గంటల బ్యాటరీ లైఫ్‌ను అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. యాపిల్ వాచ్ ఎస్ఈ 3, అల్ట్రా 3 మోడళ్లను కూడా ప్రవేశపెట్టింది సంస్థ. ఎస్10 ప్రాసెసర్‌తో కూడిన ఎస్ఈ 3 వాచ్ నిరంత డిస్‌ప్లే, స్లీప్ స్కోర్, వర్కవుట్ బడ్డీ, టెంపరేచర్ సెన్సింగ్ వంటి ఫీచర్లను కలిగి ఉంది. దీని ధర 249 డాలర్లు. శాటిలైట్ కనెక్టివిటీతో కూడిన అల్ట్రా 3 ధర 799 డాలర్లుగా ఉంది.

	స్క్రీన్ సైజు అంగుళాలు	ప్రారంభ ధర డాలర్లు	రూ.
ఐఫోన్ 17	6.3	799	82,900
ఐఫోన్ 17 ఎయిర్	6.5	999	1,19,900
ఐఫోన్ 17 ప్రో	6.3	1,099	1,34,900
ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్	6.9	1,199	1,49,900

ఒరాకిల్ నుంచి 100 మందికి పైగా ఔట్!

న్యూఢిల్లీ: టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతోంది. ఉద్యోగులు ఎక్కువగా ఇష్టపడే ఒరాకిల్‌లోనూ ఈ కోతల పర్వం ప్రారంభమైంది. కంపెనీ భారత్‌లోని తన యూనిట్ల నుంచి వంద మందికి పైగా ఉద్యోగులను ఇంటికి పంపించినట్లు సమాచారం. ఏఐ ప్రభావంతో పాటు ఖర్చులు తగ్గించుకోవాలన్న వ్యూహం ఇందుకు ప్రధాన కారణమని ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్స్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తొలగించిన ఉద్యోగులకు వారు కంపెనీలో పని చేసిన ప్రతి సంవత్సరానికి 15 రోజుల జీతంతో పాటు ఏడాది పాటు ఇన్సూరెన్స్ కవరేజీ కల్పించినట్లు సమాచారం. ఒరాకిల్ ఇటీవలే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 3,000 మందిని ఇంటికి పంపించింది. భారత్‌లోని ఒరాకిల్ యూనిట్లలో దాదాపు 30,000 మంది పని చేస్తున్నారు.

మళ్లీ 81,000 పైకి సెన్సెక్స్

ముంబై: అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించనుందన్న అంచనాలతో పాటు ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో కొనుగోళ్లతో స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్ 314.02 పాయింట్ల లాభంతో 81,101.32 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 95.45 పాయింట్ల వృద్ధితో 24,868.60 వద్ద ముగిసింది. సూచీ లాభపడటం వరుసగా ఇది ఐదో రోజు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 19 రాణించాయి. సొంత షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్)పై గురువారం నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు 5.03 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు తగ్గి రూ.88.12 వద్ద ముగిసింది.

బయోలాజికల్-ఈ, ఐఐఎల్‌కు మలేరియా వ్యాక్సిన్ లైసెన్సు

న్యూఢిల్లీ: బహుళ దశల్లో వినియోగించే మలేరియా వ్యాక్సిన్ యాడ్‌ఫాల్సివ్యాక్స్ తయారీ లైసెన్సును భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) ఐదు కంపెనీలకు అందించింది. ఈ లైసెన్సు పొందిన కంపెనీల్లో హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్-ఈ (బీఈ),ఇండియన్ ఇమ్యూనోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) సహా టెక్ ఇన్వెన్షన్ లైఫ్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్, పనేషియా బయోటెక్, జైడస్ లైఫ్ సైన్సెస్ ఉన్నాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండియా మెడ్‌టెక్ ఎక్స్‌పో 2025లో ఈ విషయం ప్రకటించారు. రోగుల్లో ప్రాణాంతకమైన ప్లాస్మోడియం ఫాల్సిపారం ఇన్ఫెక్షన్‌ను అదుపు చేసి సమాజంలోని ఇతరులకు మలేరియా వ్యాపించకుండా ఉపయోగపడే ఈ వ్యాక్సిన్‌ను ఐసీఎంఆర్ పర్యవేక్షణలో భువనేశ్వర్‌కు చెందిన రీజినల్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ (ఆర్ఎంఆర్‌సీ) అభివృద్ధి చేసింది. కాగా ఈ వ్యాక్సిన్ తయారీకి అర్హత గల కంపెనీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణలను ఐసీఎంఆర్ గత జూలైలో ఆహ్వానించింది. ఈ వ్యాక్సిన్ అందుబాటు ధరల్లో లభించడంతో పాటు గది ఉష్ణోగ్రతలో 9 నెలల పాటు సమర్థవంతంగా నిలవగలుగుతుంది.

టీవీఎస్ అపాచీ @ 20 ఏళ్లు



- మార్కెట్లోకి కొత్త మోడళ్ల విడుదల

బెంగళూరు (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ మోటార్ కంపెనీ పోర్టుఫోలియోలో అత్యంత ప్రజాదరణ పొందిన అపాచీ మోటార్‌సైకిల్ మార్కెట్లోకి అడుగుపెట్టి 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్, సీఈఓ కేఎన్ రాధాకృష్ణన్ మార్కెట్లోకి లిమిటెడ్ ఎడిషన్ అపాచీ ఆర్‌టీఆర్ శ్రేణి మోటార్ సైకిళ్లను విడుదల చేశారు. 2005లో అపాచీ మార్కెట్లోకి విడుదల చేసినప్పటి నుంచి వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని రాధాకృష్ణన్ తెలిపారు. దాదాపు 80కి పైగా దేశాల్లో 65 లక్షల మంది వినియోగదారులకు అపాచీ అత్యంత నమ్మకమైన బ్రాండ్‌గా ఉందన్నారు. అపాచీ 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 160, 180, 200, ఆర్‌టీఆర్ 310, ఆర్ఆర్ 310 లిమిటెడ్ ఎడిషన్స్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. అలాగే సరికొత్త ఆర్‌టీఆర్ 160 4వీ, ఆర్‌టీఆర్ 200 4వీ వేరియంట్స్‌ను విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ లిమిటెడ్ ఎడిషన్స్ ధరలు రూ.1,37,990 నుంచి రూ.3,37,000 మధ్యన ఉండగా ఆర్‌టీఆర్ 4వీ వేరియంట్స్ ధరలు రూ.1,28,490 నుంచి రూ.1,59,990 మధ్యన ఉన్నాయి.

హైదరాబాద్‌లో నెమెచెక్ జీసీసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, నిర్మాణ, ఆపరేషన్స్ (ఏఈసీ/ఓ) రంగానికి సేవలందిస్తున్న జర్మనీ కంపెనీ నెమెచెక్ హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను (జీసీసీ) ఏర్పాటు చేసింది. ఆధునిక జీవనంలో బహుళ అంతస్తుల భవనాలు, ఆస్పత్రులు, కంపెనీల్లో భవన సమాచార నిర్వహణ (బీఐఎం) వ్యవస్థ ప్రాధాన్యత పెరిగిందని; ఆయా సంస్థలకు తాము బీఐఎం సాఫ్ట్‌వేర్ అందిస్తామని నెమెచెక్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ పండిత తెలిపారు. నిర్మాణ రంగంలో ప్రపంచంలోనే మూడో పెద్ద మార్కెట్ అయిన భారత్‌లో తమ సేవలు విస్తరించడం లక్ష్యమని కంపెనీ సీఎఫ్ఓ లూయిస్.ఓ వెల్లడించారు.

సులభంగా పీఎస్‌యూల డీలిస్టింగ్

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయిన ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ)షేర్ల డీలిస్టింగ్‌ను సెబీ సులభతరం చేసింది. అయితే ప్రభుత్వానికి 90 శాతం లేదా అంతకంటే ఎక్కువ వాటా ఉన్న పీఎస్‌యూలకు మాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఇందుకోసం నిర్ణయించే కనీస ధరను పబ్లిక్ షేర్‌హోల్డర్స్‌లో మూడింట రెండు వంతుల మంది ఆమోదించాలన్న నిబంధనలను సెబీ సవరించింది. అయితే వాటాదారులకు చెల్లించే ధర, కనీస ధర కంటే కనీసం 15 శాతమైనా ఎక్కువ ఉండాలని స్పష్టం చేసింది. ఈ డీలిస్టింగ్ నిబంధనలు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, బీమా కంపెనీలకు వర్తించవని సెబీ స్పష్టం చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	118	విజయవాడ	137
వరంగల్	118	గుంటూరు	127
కరీంనగర్	118	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	118	చిత్తూరు	108
కర్నూలు	118	నెల్లూరు	113
విశాఖపట్నం	141	అనంతపురం	113
గోదావరి	137		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,10,290 ▲	1,01,100 ▲	1,39,000 ▲
విజయవాడ	1,12,800 ▲	1,06,500 ▲	1,28,000 ▲
విశాఖపట్నం	1,12,870 ▲	99,850 ▲	1,40,000 ▲
రాజమండ్రి	1,10,290 ▲	1,01,100 ▲	1,28,900 ▲
ప్రొద్దుటూరు	1,13,600 ▲	1,04,500 ▲	1,28,800 ▲
ముంబై	1,09,475 ▲	1,00,279 ▲	1,24,770 ▲

దుబాయ్‌లో ఉంటూ.. అబుధాబిలో మ్యాచ్‌లా?

అఫ్ఘాన్ కెప్టెన్ రషీద్ అంతృప్తి

దుబాయ్: ఆసియాకప్‌లో తమ జట్టు షెడ్యూలింగ్‌పై అఫ్ఘానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. తాము ఆడే మూడు మ్యాచ్‌లు అబుధాబిలో జరుగనుండగా.. దుబాయ్‌లో వసతి ఏర్పాటు చేశారన్నాడు. దీంతో మ్యాచ్‌ల కోసం ప్రతీసారి రెండు గంటలు ప్రయాణం చేయాల్సి వస్తుందని వాపోయాడు. మంగళవారం మధ్యాహ్నం దుబాయ్‌లో జట్ల కెప్టెన్ల విలేకరుల సమావేశంలో పాల్గొన్న రషీద్.. సాయంత్రం హాంకాంగ్‌తో మ్యాచ్ కోసం వెంటనే అబుధాబికి వెళ్లడం గమనార్హం.



ట్రోఫీతో జట్ల కెప్టెన్లు

ఆల్‌రౌండర్లే బలంగా..

బరిలోకి టీమిండియా
నేడు యూఏఈతో పోరు
రాత్రి 8 గంటల నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

దుబాయ్: టీ20 వరల్డ్‌కప్ చాంపియన్ టీమిండియా.. ఇప్పుడు ఆసియా కప్‌పై కన్నేసింది. బుధవారం యూఏఈ జట్టుతో జరిగే తమ తొలి మ్యాచ్ ద్వారా టైటిల్ వేటను ఆరంభించబోతోంది. ఇప్పటికే 8సార్లు విజేతగా నిలిచిన భారత్ ఈసారి కూడా ఫేవరెట్‌గానే పోటీపడుతోంది. అలాగే ఆదివారం పాకిస్థాన్‌తో జరుగబోయే సమరానికి యూఏఈతో మ్యాచ్‌ను రిహార్సల్‌గా భావిస్తోంది. అయితే, భారత తుది జట్టు కూర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు ఆసక్తి కరంగా మారింది. ప్రధాన కోచ్‌గా గంభీర్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి జట్టులో ఆల్‌రౌండర్ల ప్రాధాన్యత ఎక్కువగా కనిపిస్తోంది. పేస్, స్పిన్ ఆల్‌రౌండర్లను బరిలోకి దించేందుకు అతను ఇష్టపడుతున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లోనూ ఇదే సూత్రాన్ని అనుసరించి సుందర్‌కు అవకాశమిచ్చాడు. ఎనిమిదో నెంబర్ వరకు బ్యాటింగ్‌లో ఎలాంటి ఇబ్బంది ఉండకూడదని గంభీర్ భావిస్తుంటాడు. ఇప్పుడు ఆల్‌రౌండర్ విభాగంలో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌లకు జతగా శివమ్ దూబేను కూడా ఆడించే ఆలోచనలో ఉన్నాడు. దూబే స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొని వేగంగా పరుగులు సాధించగలడు. అప్పుడు కుల్దీప్ యాదవ్ బెంచ్‌కే పరిమితం కాక తప్పదు. స్పిన్‌లో వరుణ్ చక్రవర్తి, అక్షర్‌కు తోడు అభిషేక్‌తో ఓవర్లు వేయించే అవకాశం ఉంది. ఇక కీపర్‌గా సంజూ శాంసన్‌ను పక్కనబెట్టి జితేశ్ శర్మను ఆడించడం ఖాయమే. నెట్ సెషన్స్‌లోనూ జితేశ్ ఎక్కువగా ప్రాక్టీస్ చేయడం దీనికి ఊతమిస్తోంది. గిల్ జట్టులో చేరడంతో ఓపెనర్‌గా శాంసన్ స్థానం గల్లంతైంది. అతడిని మూడో నెంబర్‌లో ఆడించాలని చూసినా అక్కడ తిలక్ వర్మ నిలకడగా రాణిస్తున్నాడు. జితేశ్‌ను ఏడు, అక్షర్‌ను ఎనిమిదో స్థానంలో బరిలోకి దించవచ్చు. మిడిలార్డర్‌లో తిలక్, కెప్టెన్ సూర్య, హార్దిక్ కీలకం కానున్నారు. బౌలింగ్‌లో బుమ్రా, అర్ష్‌దీప్ ప్రధాన పేసర్లుగా ఉంటారు.

యూఏఈ పోటీ ఇచ్చేనా..? యూఏఈ జట్టుకిది భారీ మ్యాచ్‌గానే చెప్పవచ్చు. స్టార్ బౌలర్ బుమ్రాను ఎదుర్కోవడమే కాకుండా.. గిల్, సూర్య లాంటి బ్యాటర్లకు బౌలింగ్ చేయడం అసోసియేట్ సభ్యదేశానికి అరుదుగా లభించే అవకాశం. కెప్టెన్ మహ్మద్ వసీమ్, రాహుల్ చోప్రా, సిమ్రన్‌జీత్ సింగ్‌లపై జట్టు ఎక్కువగా ఆధారపడింది. ఏదేమైనా భారత్‌కు గట్టి పోటీనిచ్చేందుకు ప్రయత్నిస్తామని కోచ్ లాల్‌చంద్ రాజ్‌పుత్ అన్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్, అబిషేక్, తిలక్, సూర్యకుమార్ (కెప్టెన్), జితేశ్, హార్దిక్, శివమ్ దూబే, అక్షర్, బుమ్రా, అర్ష్‌దీప్, వరుణ్.

యూఏఈ: వసీమ్ (కెప్టెన్), షరాఫు, రాహుల్, ఆసిఫ్, ఫరూఖ్, హర్షిత్, సిమ్రన్‌జీత్, జవదుల్లా, హైదర్, సిద్దిఖీ, రోహిద్.

స్పోర్ట్స్

పతకానికి బౌట్ దూరంలో..

- క్వార్టర్స్‌కు నిఖత్
- వరల్డ్ బాక్సింగ్



లివర్‌పూల్: ఇప్పటికే రెండుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్.. ముచ్చటగా మూడోసారి మెగా టోర్నీలో పతకం సాధించేందుకు అడుగు దూరంలో నిలిచింది. ఈ తెలుగమ్మాయి ప్రపంచ చాంపియన్‌షిప్ 51 కిలోల విభాగంలో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. తద్వారా పతకానికి కేవలం ఒక్క బౌట్ దూరంలో నిలిచింది. సెమీస్ చేరితే, కనీసం కాంస్య పతకం ఖాయం అవుతుంది. అయితే, ప్రత్యర్థి నుంచి కఠిన సవాల్‌ను ఎదుర్కొని ప్రీక్వార్టర్స్‌ను అధిగమించింది. మంగళవారం పోరులో అంతగా అనుభవం లేని జపాన్ బాక్సర్, 21 ఏళ్ల యున నిషినకపై నిఖత్ 5-0తో పోరాడి గెలిచింది. ఇక, రెండుసార్లు ఒలింపిక్ రజత పతక విజేత బ్యూస్ నాజ్ కకిరోగ్లు (టర్కీ) రూపంలో నిఖత్‌కు క్వార్టర్స్‌లో ముప్పు పొంచి ఉంది. పురుషుల విభాగంలో సుమీత్ (75 కిలోలు), సచిన్ సివాచ్ (60 కి), నరేందర్ బ్రేవాల్ (90+ కి) ప్రీక్వార్టర్స్‌లోనే వెనుదిరిగారు. సుమీత్ 0-5తో కివాన్ (బల్గేరియా) చేతిలో, సచిన్ 1-4తో బిబార్స్ (కజకిస్థాన్) చేతిలో, నరేందర్ 1-4తో డిగో లెంజీ (ఇటలీ) చేతిలో ఓడారు.

శ్రీకాంత్ అవుట్

- హాంకాంగ్ ఓపెన్‌లో సాత్విక్ జోడీ బోణీ

హాంకాంగ్: ప్రపంచ మాజీ నెంబర్‌వన్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్‌కు హాంకాంగ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. మెయిన్ డ్రా కూడా చేరకుండా క్వాలిఫయర్స్‌లోనే కంగుతిన్నాడు. క్వాలిఫయర్స్ ఆరంభ రౌండ్లో భారత్‌కే చెందిన తరుణ్ మన్నెపల్లి 28-26, 21-13తో కిడాంబికి షాకిచ్చి సంచలనం సృష్టించాడు. అయితే, ఆ తర్వాత జరిగిన ఫైనల్ రౌండ్లో తరుణ్ 23-21, 13-21, 18-21తో జస్టిన్ హూ (మలేసియా) చేతిలో ఓడాడు. పురుషుల డబుల్స్ మెయిన్ డ్రా తొలి రౌండ్లో స్టార్ జోడీ సాత్విక్/చిరాగ్ శెట్టి 21-13, 18-21, 21-10తో తైవాన్ ద్వయం సియాంగ్/వాంగ్ లిన్‌పై గెలిచింది. సింగిల్స్‌లో కిరణ్ జార్జ్ మెయిన్ డ్రాకు చేరాడు.

భారత జట్టులో అనూష



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టులో విజయవాడ క్రీడాకారిణి అనూషకు చోటు లభించింది. ఈనెల 13 నుంచి 23 వరకు కొరియాలో ఈ పోటీలు జరగనున్నాయి.

క్వార్టర్స్‌లో జ్యోతికి నిరాశ

గ్వాంగ్జు (కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తెలుగు ఆర్చర్ జ్యోతి సురేఖకు నిరాశ ఎదురైంది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం క్వార్టర్స్‌లో భారత్‌కే చెందిన పర్ణీత్ కౌర్ 149-147తో సురేఖను ఓడించింది. కాగా, సెమీస్‌లో 142-143తో సోఫియా పైజ్ (ఎల్ సాల్వడార్) చేతిలో పరాజయం పాలైన పర్ణీత్ కౌర్.. కాంస్యం పోరులోనూ విఫలమైంది. కౌర్ 144-145తో అలెగ్జాండ్రా ఉస్కియానో (కొలంబియా) చేతిలో ఓటమి పాలైంది. మహిళల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో వెటరన్ దీపిక కుమారి, గథా కడాకే, అంకిత భక్తలతో కూడిన భారత జట్టు సెమీస్‌లో 2-6తో జపాన్ చేతిలో ఓడింది. కాంస్యం కోసం కొరియాతో తలపడనుంది.

దబాంగ్.. అదుర్స్

- వరుసగా నాలుగో విజయం
- ప్రొ కబడ్డీలో వారియర్స్ చిత్తు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్ సీజన్-12లో దబాంగ్ ఢిల్లీ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ గెలిచి అజేయంగా నిలిచింది. మంగళవారం జరిగిన పోరులో దబాంగ్ జట్టు 45-34 స్కోరు తేడాతో బెంగాల్ వారియర్స్‌ను కంగుతినిపించింది. దబాంగ్ తరఫున అషు మాలిక్ అత్యధికంగా 16 పాయింట్లు సాధించాడు. అనంతరం గుజరాత్ జెయింట్స్, జైపూర్ పింక్ పాంథర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత సమయానికి స్కోర్లు 30-30తో సమమయ్యాయి. దీంతో టైబ్రేకర్‌లో గోల్డెన్ రెయిడ్ ద్వారా జైపూర్ 1-0తో గెలిచింది.

బోణీ అదిరింది

ఆసియాకప్

హాంకాంగ్‌పై అఫ్ఘానిస్థాన్ ఘనవిజయం

అబుధాబి: ఆసియాకప్ ఆరంభ మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ అదరగొట్టింది. మంగళవారం హాంకాంగ్‌తో జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షోతో రాణించిన రషీద్ సేన 94 రన్స్ తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 188 పరుగులు చేసింది. పవర్‌ప్లేలోనే రెండు వికెట్లు కోల్పోయినా ఓపెనర్ సెదిఖుల్లా అటల్ (73 నాటౌట్), అజ్మతుల్లా (53) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. ఈ ఇద్దరి ధాటికి ఆఖరి ఐదు ఓవర్లలో 78 పరుగులు నమోదయ్యాయి. నబీ (33) ఫర్వాలేదనిపించాడు. అటు హాంకాంగ్ ఏకంగా ఐదు క్యాచ్‌లు వదిలేసి ఆసియాకప్ చరిత్రలో చెత్త రికార్డును మూటగట్టుకుంది. ఆ తర్వాత భారీ ఛేదనలో హాంకాంగ్ ఏ దశలోనూ లక్ష్యం వైపు సాగలేదు. చివరకు 20 ఓవర్లలో 9 వికెట్లకు 94 పరుగులు చేసి ఓడింది. బాబర్ హయత్ (39), యసీమ్ (16) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. గుల్బదిన్ నయిబ్, ఫరూఖిలకు రెండేసి వికెట్లు దక్కాయి.

సంక్షిప్త స్కోర్లు

అఫ్ఘానిస్థాన్: 20 ఓవర్లలో 188/6 (అటల్ 73 నాటౌట్, అజ్మతుల్లా 53; కించిత్ షా 2/24, ఆయుష్ 2/54).

హాంకాంగ్: 20 ఓవర్లలో 94. (హయత్ 39, యసీమ్ 16; నయిబ్ 2/8, ఫరూఖి 2/16)



సెదిఖుల్లా (73 నాటౌట్)



www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 10-9-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**



1) అగ్నికీలల్లో నేపాల్ పార్లమెంట్
2) దాడికి గురైన మాజీ ప్రధాని షేర్ బహదూర్‌కు సైనికుల రక్షణ 3) యువ నిరసనకారులు

నేపాల్ అగ్నిగుండం

జైళ్ల ధ్వంసం.. ఖైదీల పరారీ

చిక్కుకుపోయిన పర్యాటకులు

యువత ఆందోళనలు హింసాత్మకం.. పార్లమెంట్, సుప్రీంకోర్టు, ప్రముఖుల ఇళ్లకు నిప్పు

ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా.. అదే బాటలో అధ్యక్షుడు రామ్‌చంద్ర, మంత్రులు

నేతల ఇళ్లపై దాడులు, నిప్పు.. కాలిన గాయాలతో మాజీ ప్రధాని ఖనాల్ భార్య మృతి

ఆర్థిక, విదేశాంగ శాఖల మంత్రులపై దాడులు.. ఆర్మీ బ్యారెక్‌లకు ప్రముఖులు

సైన్యం చేతికి పాలన?.. తదుపరి ప్రధానిగా కఠ్మాండూ మేయర్ బాలేంద్ర షాకు అవకాశం?

కఠ్మాండూ, సెప్టెంబరు 9: సామాజిక మాధ్యమాలపై నిషేధానికి వ్యతిరేకంగా మొదలైన యువత ఉద్యమం.. నేపాల్ ప్రభుత్వాన్ని దించేసింది. సోమవారం మొదలైన ఆందోళనలు.. మంగళవారం హింసాత్మకంగా మారాయి. దీంతో.. హిమాలయ దేశం అగ్నిగుండంగా మారింది. నిరసనకారులు అధికారపక్షం.. విపక్షం అని చూడకుండా.. ప్రధాని సహా.. మంత్రులు, మాజీ ప్రధానుల ఇళ్లపై దాడులు జరిపారు. వారి అధికారిక, ప్రైవేటు ఇళ్లకు నిప్పు పెట్టారు. మాజీ ప్రధాని జలనాథ్ ఖనాల్ ఇంటికి ఆందోళనకారులు నిప్పంటించగా.. ఆ మంటల్లో ఖనాల్ భార్య రాజ్యలక్ష్మి చిత్రాకర్ సజీవ దహనమయ్యారు. కొందరు మంత్రులు, వీఐపీలను హెలికాప్టర్లలో ఆర్మీ బ్యారెక్‌లకు తరలించగా.. ఆ అవకాశం లేని మంత్రులపై ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. మహిళా మంత్రులపైనా

మిగతా 11వ పేజీలో...

నిన్న బంగ్లాదేశ్.. నేడు నేపాల్

ప్రజా ఉద్యమాల ఉధృతికి.. 'పొరుగు' నేతలు పతనం

ఆందోళనలను ఉక్కుపాదంతో అణచివేసే ప్రయత్నాలు విఫలం

ప్రాణనష్టం సంభవించినా వెనుకడుగు వేయని యువత

నేడే 'సూపర్ సిక్స్' జయభేరి!



ఎన్నికల హామీల అమలుతో అనంతలో 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' భారీ సభ

చంద్రబాబు, పవన్, లోకేశ్ సహా హాజరవుతున్న 3 పార్టీల నేతలు


అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ఆధ్వర్యంలో తొలి సభ

రాయలసీమపై పట్టుసాధించే దిశగా వరుసగా సభల నిర్వహణ

మేలో కడపలో 'మహానాడు' పండుగ నేడు అనంతలో సూపర్ సిక్స్ సభ

అంగరంగ వైభవంగా ఏర్పాట్లు

3.5 లక్షల మంది వస్తారని అంచనా



బుధవారం అనంతపురంలో నిర్వహించనున్న సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ కోసం చేస్తున్న ఏర్పాట్లు

రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీల విజయోత్సవ సభ బుధవారం అనంతపురంలో జరగనుంది. 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' పేరుతో నిర్వహించే ఈ సభకు కూటమిలోని మూడు పార్టీల నాయకులు, మంత్రులు సహా ఇతర నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు.

సూపర్ 6

అమరావతి/అనంతపురం(క్రైం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' పేరుతో భారీ ఎత్తున బుధవారం నిర్వహించనున్న సభ ద్వారా రాయలసీమలో సత్తా చాటాలని కూటమి పార్టీలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. అనంతపురంలో జరగనున్న ఈ సభలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా ఆయా పార్టీల నేతలు పాల్గొననున్నారు.

పండగ తెచ్చిన పథకాలివే!

దీపం 2.0: మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను ఇచ్చేలా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఫలితంగా మహిళల వంటింటి ఖర్చు భారీగా తగ్గింది.

తల్లికి వందనం: ఈ పథకం ద్వారా ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా వారందరికీ రూ.13 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నారు. ఈ పథకం కింద మొత్తం 67 లక్షల మందికి పైగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో

మిగతా 12వ పేజీలో...

ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో గెలుపు

రాధాకృష్ణన్‌కు 452, సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు

781 మంది ఎంపీల్లో ఓటు వేసిన 767 మంది

14 మంది గైర్హాజరు.. చెల్లని ఓట్లుగా 15 గుర్తింపు

డీఎంకే సహా 15 మందికి పైగా విపక్ష ఎంపీల క్రాస్ ఓటింగ్

సుదర్శన్‌రెడ్డికి ఇద్దరు లేదా ముగ్గురు వైసీపీ ఎంపీల మద్దతు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించారు. ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై 152 ఓట్ల ఆధిక్యంతో గెలిచి.. భారత దేశ 15వ ఉప రాష్ట్రపతిగా నిలిచారు. ఈ ఎన్నికలో విజయానికి 377 ఓట్లు అవసరం కాగా రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు వచ్చాయి. ఆయన ప్రత్యర్థి, ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి 300 ఓట్లు సాధించారు. మొత్తం 781 మంది సభ్యులకు గాను 767 మంది పార్లమెంట్ సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీఆర్‌ఎస్, బీజేడీ, శిరోమణి అకాలీదళ్ పార్టీలకు చెందిన 12 మంది సభ్యులతోపాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 15 మంది సభ్యుల ఓట్లు చెల్లలేదు. ఎన్డీఏ కూటమి సభ్యులందరూ రాధాకృష్ణన్‌కు

మిగతా 10వ పేజీలో...

'కోయంబత్తూరు వాజపేయి' సీపీఆర్

తొలి నుంచి సౌమ్యుడిగా పేరు.. 2 సార్లు లోక్‌సభకు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తమిళనాడులో రథయాత్ర

పార్టీపట్ల ఎనలేని విధేయతతో దక్కిన పదవులు

తమిళనాట పార్టీ శ్రేణుల సంబరాలు 10

ఎన్డీయేది నైతికంగా పరాజయమే

ఉప రాష్ట్రపతి ఫలితంపై ఖర్గే

రాధాకృష్ణన్ నిబద్ధతకు సరైన గుర్తింపు 4

చంద్రబాబు, పవన్, లోకేశ్ అభినందనలు



జీఎస్‌డీపీపై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, సీఎస్ విజయానంద్, అధికారులు

సుస్థిర ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

2025-26 మొదటి త్రైమాసికంలో 10.5% వృద్ధిరేటు

రంగాలవారీగా 11.91 శాతంతో 'పరిశ్రమలు' టాప్

జాతీయ సగటు వృద్ధిరేటు కంటే రాష్ట్రానిదే అధికం

మొత్తంగా ఆర్థిక ఏడాదిలో 17.1 శాతం సాధించాలి

ఆ దిశగా తదుపరి కార్యాచరణ తీసుకోవాలి

రవాణా, హోటళ్లు, రియల్ తదితర రంగాలపై దృష్టి

ప్రణాళిక శాఖ అధికారులకు సీఎం దిశానిర్దేశం

రెండంకెల వృద్ధి రేటుపై చంద్రబాబు సంతృప్తి

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాభివృద్ధి గాడిన పడుతోంది. చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో వృద్ధి రేటు ఊపందుకుంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 మొదటి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో రాష్ట్ర జీఎస్‌డీపీ 10.5 శాతం వృద్ధి రేటు సాధించిందని, ఇది జాతీయ సగటు వృద్ధిరేటు 8.8 శాతం కంటే ఎక్కువని ప్రణాళిక శాఖ అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. గత ఏడాది ఇదే సమయంలో రాష్ట్రంలో 9.58 శాతం వృద్ధి

మిగతా 3వ పేజీలో...

19న మెగా డీఎస్సీ సభ!

ఎమ్మెల్యేలందరూ పాల్గొనేలా సన్నాహాలు

సచివాలయ సమీపంలో నిర్వహణకు కసరత్తు

ఈ సభలోనే అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు

దసరా సెలవుల్లో కొత్త టీచర్లకు శిక్షణ, కౌన్సెలింగ్

బడుల పునఃప్రారంభం రోజున వీరంతా విధుల్లోకి

ఎంపికైన పేర్లతో 15న తుది జాబితాలు విడుదల



అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులతో భారీఎత్తున సభ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 18 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్నందున 19న సభ నిర్వహించాలని యోచిస్తోంది. ఎమ్మెల్యేలు అందరూ పాల్గొనేందుకు వీలుగా అసెంబ్లీ సమావేశాల సమయంలో, అది కూడా సచివాలయానికి

మిగతా 12వ పేజీలో...

అధికారం.. డబ్బు.. విషం!

మద్యం స్కామ్‌ను కళ్లకు కడుతూ లఘుచిత్రాలు

మూడు భాగాలుగా చిత్రీకరించిన ఔత్సాహికులు

అధికారం కోసం మద్యంపై జగన్ ఫేక్ హామీలు

విషంతో సమానమైన నాసిరకం మద్య విక్రయం

జగన్ వీడియో క్లిప్పింగ్‌లు, బాధితుల కథనాలు...

సామాజిక మాధ్యమాల్లో అందుబాటులోకి..



లిక్కర్ నిందితుల రిమాండ్ పొడిగింపు

రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణం మద్యం స్కామ్. లిక్కర్‌లో సుమారు రూ.3500 కోట్ల అవినీతి చోటు చేసుకున్నట్లు అంచనా. ఇది ఎలా జరిగిందో సామాన్య ప్రజలకూ అర్థమయ్యేలా కొంత మంది ఔత్సాహికులు మద్యం కుంభకోణానికి చిత్రరూపం ఇచ్చారు. మూడు భాగాల లఘు చిత్రాలను చిత్రీకరించారు. ఈ భాగాలకు 'అధికారం.. డబ్బు.. విషం..' అనే శీర్షికలు పెట్టారు.

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన మద్యం స్కాంపై 3 లఘు చిత్రాలు సిద్ధమయ్యాయి. ఇందులో మొదటి భాగం నిడివి 18.34 నిమిషాలు. హాజీ మస్తాన్, దావూద్ ఇబ్రహీం వంటి మాఫియా డాన్‌లతో జగన్‌ను పోలుస్తూ, మద్యం మాఫియా డాన్‌గా పేర్కొంటూ ఈ భాగం మొదలవుతుంది. అధికారం కోసం 2019 ఎన్నికలకు ముందు

మిగతా 4వ పేజీలో...

రైతుల్లేని వైసీపీ పోరు

జగన్ పిలుపును పట్టించుకోని అన్నదాతలు

ఆర్డీవో ఆఫీస్‌ల వద్ద నిరసనలకు స్పందన కరువు

ఇంటికే పరిమితమైన వైసీపీ అధ్యక్షుడు 4

మమ అనిపించిన పార్టీ నేతలు, కార్యకర్తలు



కొత్త దళపతి.. తిరుపతి!

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామకం! 10

పోలీసు వర్గాల వెల్లడి.. అధికారికంగా ప్రకటించని పార్టీ

క్యాడర్ రిక్రూట్‌మెంట్, ఆయుధ నిపుణుడిగా తిరుపతికి పేరు

చంద్రబాబుపై దాడిలో ప్రమేయం.. దంతెవాడ దాడికి సారథ్యం

దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా మాధ్వి హిడ్మా!

నోయిడా 'బిట్స్'లో ఏపీ విద్యార్థి కాల్చివేత!

రూమ్‌మేట్స్ మధ్య ఘర్షణ 10

స్నేహితుడిని చంపి తానూ కాల్చుకున్న విద్యార్థి

మృతుడి స్వస్థలం చిలకలూరిపేట

పంచాయతీరాజ్‌లో పదోన్నతుల జాతర

అన్ని కేడర్లలో కలిపి 10 వేల మందికి ప్రమోషన్లు

ఇప్పటికే 6 వేల మందికి పదోన్నతి 12

గ్రామ సచివాలయాల్లోకి వెళ్లే ఇంకో 4 వేల మందికి కూడా

సీఎం, డిప్యూటీ సీఎంకు ఉద్యోగుల కృతజ్ఞతలు

మూడు రోజులు భారీ వర్షాలు! 12

దక్షిణ కోస్తాలో కొనసాగనున్న ఎండ తీవ్రత

కావలిలో 39.2, నెల్లూరులో 39.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతిసీమగా మణిపూర్!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 13న మణిపూర్‌ను సందర్శించనున్నారు. ఎప్పుడో జరగాల్సిన ఈ పర్యటన ఆ దుఃఖభూమికి ఇప్పటికైనా ఉపశమనం కలిగిస్తే అదే పదివేలు!

దురదృష్టకర ప్రజాసమూహాల కథలన్నీ వలసపాలనతో ప్రారంభమయ్యాయి. మణిపురీల చరిత్ర ఇందుకు భిన్నంకాదు. బ్రిటిష్ వలస పాలకులు మణిపూర్‌ను కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాలుగా విభజించి ఆ రెండిటిని వేర్వేరు పరిపాలనా వ్యవస్థల కింద ఉంచారు. ఈ వేర్పాటు కొండ ప్రాంతాలలో అధికంగా ఉండే కుకీజోలు, మైదాన ప్రాంతాలలో సంపూర్ణ ప్రాబల్యమున్న మెయితీల మధ్య వైమనస్యతను సృష్టించింది. అది క్రమంగా తీవ్రతను సంతరించుకుని ఇప్పటికీ వైషమ్యాలను రగుల్కొలుపుతోంది.

కొండ ప్రాంతాలలో ఉండే కుకీజోలు, ఇంకా నాగాలు మొదలైన తెగలవారు రాష్ట్ర జనాభాలో 47 శాతంగా ఉన్నారు. అయితే వీరి అధీనంలో విస్తారమైన భూములు ఉన్నాయి. మైదాన ప్రాంతాలలో ఉండే మెయితీలు రాష్ట్ర జనాభాలో 53 శాతంగా ఉన్నారు వీరికి భూ వసతి తక్కువే అయినప్పటికీ మొదటి నుంచీ రాజకీయ అధికారం చెలాయిస్తున్న సామాజిక వర్గమిది. భూమి హక్కులతో పాటు రాజకీయ అధికారంలో అసమ ప్రాతినిధ్యం విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. స్వతంత్ర భారతదేశంలో ప్రభుత్వాలు అనుసరించిన విధానాలతో ఆ ఘర్షణలు విషమించాయి. రాష్ట్ర రాజకీయాలపై పెత్తనం చెలాయిస్తున్న మెయితీలు తమకు షెడ్యూల్డు తెగ హోదా సాధించుకునేందుకు పూనుకున్నారు. తద్వారా కొండ ప్రాంతాలలోని భూములను తమ ఆర్థిక బలంతో కైవసం చేసుకోవచ్చునేది వారి ఆలోచన. మణిపూర్ హైకోర్టు 2023 ఏప్రిల్ 14న మెయితీలకు ఎస్టీ హోదా ఇవ్వాలని ఆనాడు అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రభుత్వానికి సూచించింది. మెయితీలకు ఎస్టీ హోదా లభిస్తే కొండ ప్రాంతాల భూములు సమస్తమూ వారి అధీనమవుతాయని తమకు మనుగడే కష్టమవుతుందని కుకీలు ఆందోళనకు గురయ్యారు.

తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు కుకీజోలు పోరాటపథం పట్టారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పూర్తిగా మెయితీ పక్షపాతం వహించారు. కుకీజోల అలజడిని నిర్లక్ష్యం చేశారు. పైగా వారిని నార్కో టెర్రరిస్టులు అని నిందించారు. దీంతో కుకీజోలు మే 3న ఒక బృహత్ నిరసన ప్రదర్శనకు ఉద్యుక్తులయ్యారు. మెయితీలు ప్రతిదాడులకు పూనుకున్నారు. హింస ప్రజ్వరిల్లింది. అది దావానలంలా రాష్ట్రమంతటా వ్యాపించింది. వందల మంది బలయ్యారు. వేలాది ప్రజలు నిరాశ్రయులయ్యారు. రెండేళ్లు దాటినా ఆ హింసాగ్నులు ఇంకా పూర్తిగా ఆరనేలేదు.

మెయితీలు, కుకీజోలను దహించివేస్తున్న పరస్పర విద్వేషాగ్నులు మణిపురి సమాజాన్ని సైనికీకరణ చేశాయనడం సత్యదూరం కాదు. ఇంత జరుగుతున్నా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎడతెగని మౌనమే పాటించింది. రాజ్యాంగ వ్యవస్థలు కూలిపోయిన సంక్షోభానికి కారకుడైన ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను తొలగించేందుకు కూడా సంకల్పించలేదు. చివరకు పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయిన తరువాత బీరేన్ సింగ్ రాజీనామా చేశారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించాలో నిర్ణయించుకోలేకపోయిన మోదీ సర్కార్ రాష్ట్రపతి పాలనను విధించింది. అయినా పరిస్థితులు యథాతథంగా కొనసాగుతున్నాయి.

మెయితీలతో తమ సహజీవనం అసాధ్యమని, తమ ప్రాంతాలకు శాసన నిర్మాణ అధికారాలతో కేంద్ర పాలిత ప్రాంత హోదా నివ్వాలని కుకీజోలు డిమాండ్ చేస్తున్నారు. మెయితీలు, కుకీజోల మధ్య హింసాత్మక ఘర్షణలను నివారించేందుకు ఇరువర్గాల ప్రాంతాల మధ్య తటస్థ మండలాల నేర్పాటు చేసి వాటిని కేంద్ర భద్రతా బలగాల కాపలాలో ఉంచారు. దీనివల్ల మణిపూర్‌లో ప్రజల, సరుకుల రవాణా నిర్నిరోధంగా సాగడం అసాధ్యమైపోయింది. మరో సమస్య ఘర్షించుకుంటున్న సామాజిక వర్గాల సైనికీకరణ. ఈ పరిస్థితులలో రెండు కీలక పరిణామాలు సంభవించాయి. అవి: కుకీజో మిలిటెంట్ గ్రూపులతో సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ ఒప్పందం పునరుద్ధరణ, జాతీయ హైవే-02ను ప్రజల, సరుకుల స్వేచ్ఛాయుత రవాణాను అనుమతించేందుకు కుకీజో గ్రూపుల నిర్ణయం. మణిపూర్‌లో పరిస్థితులు మెరుగుపడాలంటే కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించాలి. ఇది జరగాలంటే బీజేపీతో సహా అన్ని రాజకీయ పక్షాలు విశాల దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవల్సి ఉన్నది. 'ఎట్టి పరిస్థితులలోను హింసాత్మక ఘర్షణలు మళ్లీ ప్రజ్వరిల్లకుండా చూడాల్సిన బాధ్యత నాయకులపై ఉన్నది. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించేవారు నాయకులే కారని' నిక్కచ్చిగా చెప్పుతూ 'ఒక కొత్త ఆరంభం మణిపూర్‌కు అవసరం' అని ప్రజామేధావి ఒకరు వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో ఒక కొత్త ఉదయం ఉదయించి, శాంతిసీమగా ఆ ఈశాన్య భారత రాష్ట్రం పునరుజ్జీవం పొందేందుకు ప్రధాని మోదీ పర్యటన నాంది అవ్వాలనేదే సమస్త భారతీయుల ఆకాంక్ష.

సర్వేపల్లి నుంచి చంద్రాపురం దాకా..



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్


అనుకున్నట్లుగానే ఉపరాష్ట్రపతి ఎన్నిక విషయంలో పెద్ద ఆశ్చర్యాలు ఏమీ లేవు. ఎన్డీఏ అభ్యర్థి చంద్రాపురం పొన్నుసామి రాధాకృష్ణన్‌కే మెజారిటీ ఓట్లు ఉన్నాయి కనుక ఆయన అవలీలగా ఉపరాష్ట్రపతిగా ఎంపికయ్యారు. ఇరుపక్షాల మధ్య బొటాబొటి ఓట్ల తేడా ఉంటే ఈ ఎన్నిక ఆసక్తికరంగా ఉండేది. కాని ఎన్డీఏ మిత్రపక్షాలన్నీ కలిసికట్టుగా ఉండడమే కాక, ఎన్డీఏ యేతర పార్టీలు కూడా కొన్ని మద్దతు ప్రకటించడం, కొన్ని పార్టీలు తటస్థంగా ఉంటామని ప్రకటించడంతో ఈ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో ముందుగానే స్పష్టమైపోయింది. సీపీ రాధాకృష్ణన్‌కు రావాల్సిన ఓట్ల కంటే ఎక్కువ రాగా ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి పడాల్సిన ఓట్ల కంటే తక్కువ పడ్డాయి. ప్రతిపక్షాలకు చెందిన 315 మంది ఎంపీలూ ఓటు వేశారు అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు వచ్చాయని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ప్రతిపక్షాల శిబిరం నుంచే క్రాస్ ఓటింగ్ జరిగిందన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. ప్రజాస్వామ్యంలో ఇది అనూహ్యం కాదు. ఆశ్చర్యకరమయిన విషయం ఏమంటే ఇరుపక్షాలు వర్క్‌షాప్‌లు, మాక్ ఓటింగ్‌లు నిర్వహించినా 15 ఓట్లు చెల్లకుండా పోయాయి!

ఉపరాష్ట్రపతి పదవి మన దేశంలో రెండవ అత్యున్నత రాజ్యాంగ హోదా. ఇది కూడా లాంఛనమైన పదవి అయినప్పటికీ జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా తర్వాత జరిగిన ఈ ఎన్నికకు ప్రాధాన్యత పెరిగింది. మోదీ ప్రభుత్వమే ఏరి కోరి తెచ్చుకున్న జగదీప్ ధన్‌ఖడ్ వారికే తలనొప్పిగా మారడంతో ఆయనను వదిలించుకున్నారన్న విషయం స్పష్టమే అయినప్పటికీ ఉపరాష్ట్రపతి పదవికి ఉన్న ప్రాధాన్యత తగ్గలేదు. అందుకు కారణం తొలి ఉపరాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ నుంచి ఎందరో ఆ పదవికి వన్నె తెచ్చారు. రాజ్యసభ ఛైర్మన్‌గా కూడా ఉపరాష్ట్రపతి పదవి చర్చలో ఉంటుంది కనుక ఆ పదవిలో ప్రాధాన్యతను విస్మరించలేనిది. వారి ప్రతి చర్యనూ ప్రజలు గమనించే అవకాశం ఉంటుంది. రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికైన రాధాకృష్ణన్ సాధు స్వభావి, మృదుభాషి. ఉపరాష్ట్రపతి పదవికి ఉన్న ప్రాధాన్యతను కాపాడేందుకు ఆయన ప్రయత్నిస్తారనడంలో సందేహం లేదు. రాధాకృష్ణన్‌కు ఉన్న నేపథ్యం, సైద్ధాంతిక నిబద్ధత రీత్యా ఆయనను ధన్‌ఖడ్ మాదిరి వదిలించుకునే అగత్యం బీజేపీ అగ్రనేతలకు రాకపోవచ్చు. అంత సాహసం కూడా వారు చేసే అవకాశం లేదు.

ఏదిఏమైనప్పటికీ గత నెల రోజులుగా ఉపరాష్ట్రపతి పదవిపై మీడియాలో విస్తృత చర్చ జరిగింది. సీపీ రాధాకృష్ణన్ ఎక్కడా పెద్దగా నోరు విప్పనప్పటికీ, ప్రతిపక్షాల శిబిరం తరఫున పోటీ చేసిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉధృతంగా ప్రచారం చేశారు. వివిధ రాష్ట్రాల్లో తిరిగి అక్కడి నేతల్ని, ప్రజాప్రతినిధులను కలుసుకున్నారు. రాజ్యాంగ విలువల్ని కాపాడేందుకు, ప్రజాస్వామ్యం ఆరోగ్యంగా ఉండేందుకు ఉపరాష్ట్రపతి పదవి అనేది ఎంత ముఖ్యమో అని ఆయన వివరించారు. ఈ పదవి పార్టీలకు అతీతమైనదని, ఎంపీలు స్వేచ్ఛగా ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయాల్లో అంతర్గత ప్రయోజనాలే కాని అంతరాత్మ ప్రబోధాలు ఎక్కడ పనిచేస్తాయి?

ఉపరాష్ట్రపతి పదవీ ఎన్నిక ప్రతిపక్షాలు సంఘటితం అయ్యేందుకు దోహదం చేసింది. ఓట్ చోరీ, బిహార్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాలు కలిసికట్టుగా ఉభయసభల్ని స్తంభింపచేశాయి. పహల్గామ్‌పై జరిగిన చర్చలో ప్రభుత్వాన్ని అనేక అంశాలపై నిలదీశాయి. అనుకున్న దానికంటే కొన్ని ఓట్లు తగ్గినప్పటికీ ఉపరాష్ట్రపతి ఎన్నికల ఫలితం ప్రతిపక్షాల ఐక్యతపై పెద్దగా ప్రభావం చూపే అవకాశాలు లేవు. పై పెచ్చు ఎన్డీఏకూ, ఇండియా కూటమికీ మధ్య ఉన్న సైద్ధాంతిక వ్యత్యాసాల్ని స్పష్టంగా చెప్పేందుకు ఈ ఎన్నికలు అవకాశం కల్పించాయి. బాల్యం నుంచీ హిందూత్వ భావజాలంతో ఎదిగిన సీపీ రాధాకృష్ణన్‌కు పోటీగా సోషలిస్టు భావజాలం గల సుదర్శన్‌రెడ్డిని అన్ని పక్షాలు ఏకగ్రీవంగా తమ అభ్యర్థిని ఎంచుకోవడమే ఈ సైద్ధాంతిక వ్యత్యాసానికి నాంది పలికింది. రాజ్యాంగ నైతికత, అందరికీ సామాజిక న్యాయం, ప్రతి ఒక్కరికీ సమాన విలువ అన్న అంశాలపై సుదర్శన్ రెడ్డి ప్రచారం చేశారు. ఒకరకంగా ప్రతిపక్షాలకు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి ఇదివరకు లేని ఒక సిద్ధాంతవేత్త రూపంలో సుదర్శన్‌రెడ్డి లభించారని చెప్పవచ్చు. ఇండియా కూటమి అభ్యర్థి ఓటమి చెందినప్పటికీ ఆయన ప్రచారం చేసిన అంశాల ప్రాధాన్యత మాత్రం తగ్గిపోయే అవకాశం లేదు.

ప్రతిపక్షాలు ఎదుర్కొంటున్నది ఎన్డీఏనో, బీజేపీనో కాదు, దేశ రాజకీయాల్లో ఒక బలమైన శక్తిగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీని అని స్పష్టంగా చెప్పక తప్పదు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ, ఆ మాట కొస్తే అధికారంలోకి రానప్పటి నుంచీ నరేంద్రమోదీ అనేక ప్రతికూలతలను ఎదుర్కొన్నారు. గుజరాత్ అల్లర్ల నుంచీ ఎన్నో ఆటుపోట్లు ఆయనకు ఎదురయ్యాయి. ప్రధానిగా పెద్దనోట్ల రద్దు, సాగు చట్టాల నుంచి ఇటీవల పహల్గామ్ సంఘటన, అమెరికాతో విభేదాల దాకా ఆయన ఎన్నో సమస్యలను, స్వీయ ప్రతిష్ఠ దెబ్బతినడాన్ని ఎదుర్కొన్నారు. కాని ఆసక్తికరమైనదేమిటంటే ఆయన గ్రాఫ్ ఎప్పుడు పడిపోతుందో, ఎప్పుడు పెరుగుతుందో చెప్పడం కష్టం. ఆయన జాబితాలో వైఫల్యాలెన్నో విజయాలూ అంతకు మించి ఉన్నాయి. అందువల్ల ప్రధానమంత్రి అనుకూల పక్షాలే కాదు, మోదీని మనస్ఫూర్తిగా సమర్థించని ఎన్నో పక్షాలు కూడా ప్రత్యక్షంగా ఆయనను వ్యతిరేకించడానికి భయపడతాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి గెలిచినప్పటికీ ఆయనకు సమస్యలు తొలగిపోతాయని కాని, కొత్త సమస్యలు రావని కానీ, ఆయన వాటిని ఎదుర్కోలేరని కానీ చెప్పడానికి వీల్లేదు. ఆయన డిగ్రీ గురించి వివాదం తలెత్తినప్పటికీ అవతలి వారి కంటే నాలుగాకులు ఆయన ముందే చదివి ఉంటారన్నదానిలో సందేహం లేదు. రష్యా, చైనా అధినేతలు పుతిన్, జిన్‌పింగ్‌లతో ఇటీవల ఎస్‌సీఓ సదస్సులో నవ్వుతూ మాట్లాడుతున్న దృశ్యాలను చూపిస్తూ ఒక రాజకీయ నాయకుడు 'ఈ వ్యక్తి డిగ్రీల గురించి ఎవరు పట్టించుకుంటారు?' అని ప్రశ్నించారు.



'ప్రతిపక్షాలు ప్రభుత్వ విధానాలను నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా స్పష్టంగా విమర్శించడానికి అనుమతించకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశత్వంలోకి దిగజారిపోయే అవకాశం ఉంది. అదే సమయంలో విపక్షాలు సైతం పార్లమెంటు కార్యకలాపాలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకునేంతగా దిగజారిపోకూడదు' అని సర్వేపల్లి రాధాకృష్ణన్ రాజ్యసభ ఛైర్మన్‌గా సభలోనే ప్రకటించారు. 15వ ఉపరాష్ట్రపతి చంద్రాపురం రాధాకృష్ణన్ మరో సర్వేపల్లి రాధాకృష్ణన్ కాగలరా? ప్రభుత్వం, ప్రతిపక్షాలు పార్లమెంట్‌కు కలిసికట్టుగా పూర్వ వైభవం సంతరింపచేయగలవా?

మరోవైపు ప్రతిపక్షాలకు చాలా కాలం తర్వాత ఒక నాయకుడు దొరికాడని చెప్పవచ్చు. వారు ఆయన వెనుక నడిచేందుకు వెనుకాడడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాహుల్ ఒక నిప్పుకణంలా మండిపడుతున్నాడు. ఓట్లచోరీతో సహా ఆయన లేవనెత్తే అంశాలకు ప్రాధాన్యత లభిస్తోంది. బిహార్‌లో ఆయన నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్రకు పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవే ఆయన వెంట నడవాల్సి వస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీ అవలంబించిన సిద్ధాంతాలు ఎలా ఉన్నప్పటికీ రాహుల్ తమ పార్టీకి ఒక కొత్త సిద్ధాంతాన్ని ఏర్పర్చే ప్రయత్నం చేస్తున్నారు. విభిన్న సామాజిక వర్గాలను తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే ఎన్డీఏ, ఇండియా కూటమిల మధ్య సైద్ధాంతిక వ్యత్యాసాలను నిర్ధారించేందుకు ఆస్కారం కలిగిస్తోంది. ఈ సైద్ధాంతిక పోరు ప్రతి అసెంబ్లీ ఎన్నికలోనూ, సార్వత్రిక ఎన్నికల వరకు సంఘటితం చేసి తమది భిన్నమైన సైద్ధాంతిక కూటమి అని ప్రజలు అర్థం చేసుకునేలా చేయడం అంత సులభమైన విషయం కానే కాదు. కానీ రాహుల్ వెనక్కు తగ్గే అవకాశాలు లేవు.

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు అసలు పరీక్ష ఆయన రాజ్యసభ ఛైర్మన్ సీటులో కూర్చున్న తర్వాతే మొదలవుతుంది. భారత తొలి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ అధిష్ఠించిన ఆసనమది. తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు, దౌత్యవేత్త అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ హిందూ ధర్మాన్ని ఒక తాత్విక అంశంగా స్వీకరించిన మహోన్నత దార్శనికుడు. తన మూలాలు భారతీయ సాంస్కృతిక వారసత్వంలో ఉన్నప్పటికీ తన ఆలోచనలు ఆధునికమని ఆయన ప్రతి సందర్భంలో నిరూపించేవారు. తొలి ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ తొలి ఛైర్మన్‌గా ఆయన తన తర్వాత ఆ పదవులు నిర్వహించేవారికి ఒక పథనిర్దేశం చేసి వెళ్లారు. 'రాజ్యసభ అంటే కేవలం చట్టాలు చేసే సభ కాదు. అది చర్చించే సభ. అందరూ విలువైన చర్చలకు పూనుకునే అవకాశం ఈ సభ కల్పించింది. లోక్‌సభ, రాజ్యసభ రెండూ మన రాజ్యాంగంలో భాగమయ్యాయి కనుక ఈ వ్యవస్థను సమర్థంగా కొనసాగించడం అనేది మన పనిపైనే ఆధారపడి ఉన్నది' అన్న ఉదాత్తుడు సర్వేపల్లి రాధాకృష్ణన్. ఉపరాష్ట్రపతిగా తన కార్యకలాపాలను రాజకీయ, దౌత్య రంగాల్లో విస్తరించి దేశ ప్రతిష్ఠను పెంచే స్వేచ్ఛ ఆయనకు లభించింది. రాధాకృష్ణన్ సభాధ్యక్ష స్థానంలో ఉన్నంతకాలం ఎటువైపూ మొగ్గు చూపే ప్రసక్తి ఉండదని, సభ్యుల హక్కులకు భంగం వాటిల్లబోదని నిరూపించారు. నెహ్రూ, భూపేశ్ గుప్తా, రాధాకృష్ణన్‌ల మధ్య జరిగే వాదనలు నిశితమూ తీవ్రమైనవి అయినా సుహృద్భావ వాతావరణంలో జరిగేవి. హెచ్ఎన్ ఖుంజ్రూ, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి హేమాహేమీలు సర్వేపల్లి సభా నిర్వహణను ప్రశంసించేవారు. 'ప్రతిపక్షాలు ప్రభుత్వ విధానాలను నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా స్పష్టంగా విమర్శించడానికి అనుమతించకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశత్వంలోకి దిగజారిపోయే అవకాశం ఉంది. అదే సమయంలో ప్రతిపక్షాలు సైతం పార్లమెంటు కార్యకలాపాలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకునేంతగా దిగజారిపోకూడదు' అని ఆయన రాజ్యసభ ఛైర్మన్‌గా సభలోనే ప్రకటించారు. 15వ ఉపరాష్ట్రపతి చంద్రాపురం రాధాకృష్ణన్ మరో సర్వేపల్లి రాధాకృష్ణన్ కాగలరా? ప్రభుత్వం, ప్రతిపక్షాలు పార్లమెంట్‌కు కలిసికట్టుగా పూర్వ వైభవం సంతరింపచేయగలవా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

వర్ణ మాంత్రికుడు వడ్డాది పాపయ్య

రంగుల రారాజు, వపా అనే పేర్లతో ప్రశస్తిగాంచిన చిత్రకారుడి పూర్తి పేరు వడ్డాది పాపయ్య. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో ఒక సామాన్య కుటుంబంలో సెప్టెంబర్ 10, 1921న మహాలక్ష్మి, రామమూర్తి దంపతులకు జన్మించారు. వడ్డాది పాపయ్య తన ఐదవ ఏటనే చిత్రకళ ఆరంగ్రేటం చేసారు. ఆయన తండ్రి చిత్రకళా ఉపాధ్యాయుడు కావడంతో చిత్రకళలో ఓనమాలు తండ్రి వద్దనే నేర్చి, ఆయన బొమ్మలు గీచే పద్ధతిని పరిశీలించి అతి చిన్న వయసులోనే ఇంటిలో ఉన్న రవివర్మ గీచిన 'కోదండరామ' చిత్రంను ప్రేరణగా తీసుకుని హనుమంతుని చిత్రాన్ని గీసారు పాపయ్య.

పాపయ్య చిత్రాలను తొలినాళ్ళలో దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు తన పత్రికలలో ప్రచురించి, ప్రోత్సహించారు. ఆ తరువాత రేరాణి, మంజూష, అభిసారిక, ఆంధ్రపత్రిక, భారతి, ఆంధ్రజ్యోతి, యువ, చందమామ, బాలి, జ్యోతి, స్వాతి వార, మాస పత్రికల్లో వపా వర్ణ, రేఖా చిత్రాలు, కార్టూన్లు గీయటం ప్రారంభించారు. వపా తన కుంచెతో చందమామ పిల్లల మాసపత్రికను దాదాపు అర్ధశతాబ్దం పాటు తీర్చిదిద్దారు. అప్పటిలో చందమామ వివిధ భాషలలో ప్రచురితమయ్యేది. ఆ విధంగా పాపయ్య చిత్రాలు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి.

దీపావళి ప్రత్యేక సంచికలు వడ్డాది పాపయ్య వర్ణ చిత్రాలతో పాఠకుల మనసులను దోచుకునేవి. ముఖచిత్రాలు చూసి వార, మాసపత్రికలు కొనేలా చేసిన చిత్రకారుడు ఆయన. చందమామలో ఆయన మూడు దశాబ్దాల పాటు క్రమం తప్పకుండా ఐదు వందలకు పైగా ముఖచిత్రాలు గీచారు. ఆయన జీవించి ఉన్నంతకాలం మరొకరు ఆ పత్రిక ముఖచిత్రం గీయలేదు. నవ్వులు పువ్వులు, వాణి, ఆనందవాణి, యువ, ఆంధ్రజ్యోతి తదితర పత్రికల్లో వపా వందల కార్టూన్లు తనదైన శైలిలో వేశారు. ప్రాచీన సాహిత్యాన్ని ఆకళింపు చేసుకొని తన కుంచెకు సాహితీ సౌరభాలు అద్ది చిత్రాలను చిత్రించిన ప్రత్యేక చిత్రకారుడు ఆయన. వపా కార్టూన్లు, రేఖాచిత్రాలు గీయడమే కాదు, కొన్ని కథలూ రాసారు. చందమామలో కొడవటిగంటి కుటుంబరావు మొదలుపెట్టిన 'దేవీ భాగవతం' కథలను పూర్తి చేసింది ఆయనే. పౌరాణిక సీరియల్ 'విష్ణుకథ' కూడా ఆయనే రాసారు. ఆయన రంగుల చిత్రాలు ఒక అద్భుత ప్రపంచాన్ని పాఠకుల మదిలో ఆవిష్కరించేవి. పౌరాణిక, జానపద ఘట్టాలకు రూపాలనిచ్చి, వాటికి జీవం పోసిన చిత్రబ్రహ్మ తన చిత్రాల ద్వారా ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు.



తెలుగు చిత్రకళకు జాతీయస్థాయి కీర్తి తెచ్చిన అమర చిత్రకారుడు వడ్డాది పాపయ్య (వపా). తెలుగు సంస్కృతిని, ఇతిహాసాలు, పురాణాలు, కాలాలు, రాగాలు, నక్షత్రాలు, గ్రహాలు, నదులు, పౌర్ణమిలు, కావ్యనాయకులు, పురాణ పురుషులు, పండుగలు, ఆచారవ్యవహారాల్ని తన కళాచాతుర్యంతో కమనీయ దృశ్యకావ్యాలుగా మలచారాయన. ఎందరో ఔత్సాహికులకు ఆయన చిత్రాలు స్ఫూర్తినిస్తున్నాయి.

1940వ దశకంలో పిల్లల్ని ఆకట్టుకోవడానికి ఆయన 'బాల' పత్రికలో తమాషా అయిన బొమ్మలు ఎన్నో వేశారు. బొమ్మను మామూలుగా చూస్తే ఒక రూపం, తిరగ వేసి చూస్తే మరొకరూపం కనిపించేవి. సాధారణంగా చిత్రకారులు మోడల్స్ లేదా వారి నమూనాలనో చూస్తూ చిత్రాలు గీస్తుంటారు. కాని పాపయ్య మాత్రం తన ఆలోచనల రూపాలనే చిత్రాలుగా చిత్రించేవారు. ఆయన ఎక్కువగా స్త్రీలకు సంబంధించిన చిత్రాలే గీచారు. అసభ్యతకు తావులేకుండా అమలిన శృంగారం తన చిత్రాల్లో చూపించారు.

తన చిత్రాలతో తెలుగు సంస్కృతిని, ఇతిహాసాలు, పురాణాలు, కాలాలు, రాగాలు, నక్షత్రాలు, గ్రహాలు, నదులు, పౌర్ణమిలు, కావ్యనాయకులు, పురాణ పురుషులు, పండుగలు, ఆచారవ్యవహారాల్ని తన కళాచాతుర్యంతో కమనీయ దృశ్యకావ్యాలుగా మలచి కళాభిమానుల్ని రంగుల లోకంలో విహరింపజేసిన మహోన్నత చిత్రకారుడు వడ్డాది పాపయ్య. ఆయన రంగుల మిశ్రమం ప్రత్యేకంగా ఉంటుంది. ఎప్పుడూ మనం చూసే రంగులే అయినా, ఆకర్షణగా ఉండేవి. ఆయన దేశవాళీ రంగులే వాడి పేరు పొందారు. పౌరాణిక చిత్రాలను నీటి రంగులతో చిత్రించేవారు. ప్రపంచంలో నక్షత్రాలకు సంబంధించిన చిత్రాలను గీసిన ఒకే ఒక చిత్రకారుడు పాపయ్య. 27 నక్షత్రాలకు చక్కని రూపు కల్పించడంతోపాటు వాటి లక్షణాలను అంతర్లీనంగా చాటి చెప్పారు. రామాయణం, భారతం, భాగవతం, హనుమాన్, శివపురాణం తదితర కథలకు తనదైన శైలిలో వర్ణ చిత్రాలు సహజ సుందరంగా చిత్రించారు. చిత్రకళా ప్రపంచంలో వపా చిత్రించని అంశం లేదంటే అతిశయోక్తికాదు.

ఆయన గీసిన చిత్రాల క్రింద 'వ.పా.' అనే పొడి అక్షరాల సంతకం పెట్టేవారు. వీరి బొమ్మలకు గల మరొక కుంచె గుర్తు '0 | 0' అని ఉండడం. దీని గురించి ఆయన చెప్పిన భాష్యం – "గతం శూన్యం, వర్తమానం శూన్యం, భవిష్యత్తులో నిలుచున్నానని". అది ఆయన 'లోగో'గా తన చిత్రాలలో ఉపయోగించేవారు. ఆయన ప్రపంచంలో 'లోగో' గలిగిన ఏకైక చిత్రకారుడు కావటం తెలుగువారికి గర్వకారణం.

వపా మిత్రుల బలవంతంపై ఖరగ్‌పూర్, శ్రీకాకుళంలలో చాలకాలం కింద చిత్రకళ ప్రదర్శనలు నిర్వహించారు. వారిని సత్కరించడానికి ఆంధ్రవిజ్ఞాన సమితి 'సంక్రాంతి' పర్వదినం పురస్కరించుకొని వపా చిత్రకళా ప్రదర్శన తొలిసారి నిర్వహించింది. ఈ సందర్భంగా అప్పటికప్పుడు ఇరవై వర్ణ చిత్రాలు సృష్టించి ప్రదర్శించారు.

చిత్రకారునిగా ఎంత గొప్పవారో, వ్యక్తిగా అంత నిరాడంబరంగా, ప్రచారార్భాటాలకు దూరంగా ఉండి ఇంట్లో కూడా ముభావంగా తన పని చేసుకునేవారు. వపా చిత్రాలు తెలిసినంతగా ఆయన జీవిత విశేషాలు ప్రజలకు తెలియవు. ఆ చిత్రకారుడిని గురించి సుంకర చలపతిరావు, సి.పి.బ్రౌన్ అకాడమీ వారి పుణ్యమా అని ఒక గ్రంథమే రాయడం, తెలుగుజాతి రత్నాలు పరంపరలో అది వెలువడటం– ఎంతో సంతోషదాయకమైన విషయం. వడ్డాది పాపయ్య శత వసంతాల ప్రత్యేక సంచిక 'వపాకు వందనం' 2021లో విశాఖపట్నం చిత్రకళా పరిషత్ వారు ఆవిష్కరించారు. గత ముప్పై సంవత్సరాలుగా విశాఖ నగరంలో చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో పాపయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి.

తెలుగు చిత్రకళకు జాతీయస్థాయి కీర్తి తెచ్చిన అమర చిత్రకారుడు వడ్డాది పాపయ్య (వపా). ఆయన కాలధర్మం చెంది మూడు దశాబ్దాలు దాటినా, నేటికీ ఆయన కళాప్రతిభ మసకబారలేదు. ఎందరో ఔత్సాహికులకు ఆయన చిత్రాలు స్ఫూర్తినిస్తున్నాయి. భౌతికంగా వపా నేడు మన మధ్య లేకపోయినా ఆయన సృష్టించిన వేలాది చిత్రకళా రూపాలు మన హృదయాలలో ఎప్పటికీ సజీవంగా ఉంటాయి.

● జి.కె. విశ్వనాథరాజు

(సౌభాగ్య గజపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖ పబ్లిక్ లైబ్రరీలో నేడు వపా జయంతి)

శాస్త్రీయ దృక్పథంతో మానవీయ సమాజం

ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి దగ్గర యలవర్రు గ్రామంలో 1922 సెప్టెంబరు 10న వ్యవసాయ కుటుంబంలో జన్మించిన యలవర్తి నాయుడమ్మ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రసాయన శాస్త్రవేత్త. చర్మ పరిశోధనలలో విశేష కృషి చేసిన మేధావి. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ & ఇండస్ట్రియల్ రీసెర్చి సంస్థ అత్యున్నత (డైరక్టరు జనరల్) పదవి నిర్వహించారు. సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో చేరి, 1985 జూన్ 23న మరణించేదాకా నిత్య పరిశోధకుడిగానే జీవించారు.



సామాజిక విషయాలలో కూడా శాస్త్రీయ అభినివేశాన్ని ప్రదర్శించటం నాయుడమ్మ ఆశయం. మూఢ విశ్వాసాల్నీ ముహూర్త బలాల్నీ వీడి, హేతుబద్ధమైన ఆలోచనతో కూడిన మనిషి చైతన్యమూ, వ్యక్తిత్వమూ వికసించే మానవీయ సమాజం వైపు జాతి జనుల అడుగులు పడాలనేది ఆయన ఆశ, ఆదర్శం కూడా! దేశమంతా విద్యారంగం, ఇతర మార్గాల ద్వారా శాస్త్రీయ అభినివేశం (సైంటిఫిక్ టెంపర్) లోతుగా విస్తరించాలని ఆయన తపించారు. హేతుబద్ధ చింతన, శాస్త్రీయ వివేచనా, నిరంతర అధ్యయనం, నిత్య పరిశోధనా... ఆయన జీవధాతువులు. మూఢ విశ్వాసాలను ఖండించటం, కాలం చెల్లిన భావాలను తిరస్కరించటం ఆయన వ్యక్తిత్వంలో, జీవిత ఆచరణలో ఒక భాగం.

కుల-మతతత్వాలు, దోపిడీ-దౌర్జన్యం, ఆభిజాత్యం, జాతి విద్వేషం... మొదలైన సామాజిక రుగ్మతలను మనంగా అర్థం చేసుకుని పరిష్కరించుకోవాల్సి ఉండగా – మన జీవన కష్ట నిష్ఠురాలన్నిటికీ పుట్టుక సమయం నాటి గ్రహగతులూ, కుజదోషాలూ అంటూ మనిషినీ, సమాజాన్నీ దేవుడు, కర్మ, గ్రహబలం పేరిట పరాధీనాలుగా మార్చివేస్తున్న ఈనాటి కొందరి భక్తి పరిశ్రమాధిపతుల విధానాలను మనం ప్రశ్నిస్తున్నామా? నాయుడమ్మయితే ఇటువంటి సమయంలో ఏం చేసేవారో ఆలోచించామా? సామాజిక సమస్యలను సమాజంలోనే నిలవేసి, ప్రశ్నించి తర్కించి ఒక జవాబుని రాబట్టాలి. అదీ నాయుడమ్మ పద్ధతి. శాస్త్రీయ అభినివేశానికి పట్టంగట్టటమే నాయుడమ్మకి నిజమైన నివాళి.

– దివి కుమార్, జనసాహితి

(నేడు తెనాలి రామకృష్ణ కవి సభా మందిరంలో నాయుడమ్మ 103వ జయంతి పురస్కార సభ)

సవాళ్ల మధ్య సంక్షేమం–అభివృద్ధి సవారీ!

గత ఐదేళ్ల జగన్ పాలన రాష్ట్రానికి ఒక పీడకలగా మిగిలింది. ఆర్థిక అరాచకం రాజ్యమేలింది. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. సమస్త వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. వాటిని సరిదిద్ది రాష్ట్రాభివృద్ధిని పట్టాలెక్కించడానికి కూటమి ప్రభుత్వం 15 నెలలుగా శ్రమిస్తోంది. రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చెయ్యడానికి లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు కాలంతో పోటీపడుతున్నారు. రాష్ట్ర ప్రజలు తనపై పెట్టుకొన్న నమ్మకాన్ని, అంచనాలను నిలబెట్టుకుంటూ పాలన సాగిస్తున్నారు. సంక్షేమం–అభివృద్ధి జోడు గుర్రాలుగా పాలనను పరుగులు పెట్టిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. సూపర్ సిక్స్ విజయంపై కూటమి పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ నేడు సంయుక్తంగా అనంతపురంలో భారీ బహిరంగ సభ నిర్వహించి, ఇప్పటివరకూ అమలు చేసిన వివిధ సంక్షేమ–అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజెప్పాలని నిర్ణయించాయి.

అధికార పగ్గాలు చేపట్టగానే ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా పెంచిన పింఛన్లను అమలు చేసేలా సీఎం చంద్రబాబు తొలి సంతకం చేశారు. అప్పటివరకు అందుతున్న రూ.3వేల పింఛన్‌ను ఒకేసారి రూ.4వేలకు పెంచి తన హామీ నిలబెట్టుకొన్నారు. తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ ఆర్థిక సాయం అందిస్తూ తల్లుల ఖాతాల్లో రూ.13వేల చొప్పున జమ చేశారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఒక్కొక్క రైతుకి రూ.2వేల చొప్పున మూడు విడతలుగా ఆర్థికసాయం అందించింది ప్రభుత్వం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా మహిళలకు ఆర్థిక భరోసా కల్పించింది. స్త్రీశక్తి పథకం కింద 5 కోట్ల పైచిలుకు ప్రయాణాలతో మహిళలు దీన్ని సూపర్ హిట్ చేశారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 మందిని ఉపాధ్యాయులుగా భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు సీఎం చంద్రబాబు. జగన్‌రెడ్డి ఐదేళ్లల్లో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు.

మహిళలకు దీపం-2 పథకం ద్వారా ఏడాదికి 3 ఉచిత సిలెండర్లకు రూ.2,684 కోట్ల వ్యయం చేశారు. జగన్ నిలిపేసిన అన్న క్యాంటీన్లను కూటమి అధికారంలోకి రాగానే పునరుద్ధరించి అన్నార్తుల ఆకలి తీరుస్తున్నది. చేతివృత్తులు, కులవృత్తులకు అండగా నిలిచేందుకు అన్ని వర్గాలకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. బీసీల గృహనిర్మాణానికి అదనంగా రూ.50 వేలు, బీసీల ఇళ్లపై 3 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ.98వేల సబ్సిడీ అందిస్తోంది. 40వేల సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తోంది. కల్లుగీత కార్మికులకు 10శాతం మద్యం దుకాణాలు, బార్‌లు కేటాయించింది. మత్స్యకారులకు వేట విరామ సమయంలో 20 వేల చొప్పున ఆర్థిక సాయం ఇస్తోంది. చేనేతకు అండగా హ్యాండ్లూమ్స్‌కు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తోంది. నేతన్న భరోసా కింద చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.25వేల సాయాన్ని అందిస్తున్నది.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సంక్షేమం–అభివృద్ధి జోడు గుర్రాలుగా పాలనను పరుగులు పెట్టిస్తోంది. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. 15 నెలల్లో దాదాపు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఏడు లక్షల ఉద్యోగాలు కల్పించారు.

ఎస్సీ వర్గీకరణతో వారి దశాబ్దాల ఆకాంక్షను నెరవేర్చింది. ఏజెన్సీ ప్రాంతాల్లో అడవితల్లి బాటలో కార్యక్రమం ద్వారా రూ.1,000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టింది. పేద ధనిక తారతమ్యం లేకుండా 5 కోట్ల మంది ప్రజలకు వర్తింపజేస్తూ యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ.25 లక్షల వరకూ వైద్యచికిత్సలు ఉచితంగా చేయించుకునేందుకు ఆస్కారం కల్పించింది. శాండ్, వైన్, మైన్, డ్రగ్స్ మాఫియాలపై ఉక్కుపాదం మోపింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే 20 వేల కి.మీ రోడ్లు మరమ్మత్తులు చేశారు. వీటితోపాటు సీసీ, బీటీ, రాష్ట్ర రహదారులు 7 వేల కి.మీ నిర్మించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,987 కోట్లు పంచాయతీలకు విడుదల చేశారు.

ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను తిరిగి తీసుకొచ్చేందుకు చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. పారిశ్రామిక వికాసంపై విశ్వాసం కలిగించారు. ఇప్పటికే లులూ, ఒబెరాయ్, బ్రూక్‌ఫీల్డ్, సుజలాన్, గూగుల్, కాగ్నిజెంట్, గూగుల్ డేటా సెంటర్ వంటి సంస్థలు ముందుకు రాగా, మరికొన్ని సంస్థలు రాష్ట్రానికి రావడానికి సిద్ధపడటంతో విశాఖ ఐటీ హబ్‌గా మారనున్నది. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను చేరుకునే క్రమంలో రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారు. 15 నెలల్లో దాదాపు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఏడు లక్షల ఉద్యోగాలు కల్పించారు.

పోలవరానికి కేంద్రం నుంచి రూ.12,157 కోట్లు సాధించారు. ప్రజారాజధాని అమరావతి నిర్మాణాలకు కేంద్రం నుంచి రూ.15వేల కోట్లు సాధించి, ప్రధానితో పునః ప్రారంభం చేయించారు. విశాఖ స్టీల్ పరిరక్షణకు రూ.11 వేల కోట్లు, విశాఖ రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి ప్రధానితో శంకుస్థాపన చేయించారు. ఓర్వకల్లు పారిశ్రామికవాడకు రూ.2,786 కోట్లు, కొప్పర్తి పారిశ్రామిక వాడకు రూ.2,137 కోట్లు కేంద్రం నుంచి సాధించారు. కేంద్రం నివేదిక ప్రకారమే వైసీపీ హయాంలో 2023–24లో వృద్ధిరేటు కేవలం 6.19 శాతం మాత్రమే కాగా, 2024–25లో 8.21 శాతం వృద్ధి రేటు సాధించి దేశంలోనే రెండో స్థానంలో నిలవడం అభినందనీయం. ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు, ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని, పీ-4 విధానం ద్వారా రాష్ట్రంలోని పేదరికాన్ని జీరో పావర్టీ సమూలంగా నిర్మూలించడానికి సీఎం చంద్రబాబు ప్రయత్నాలు ప్రారంభించారు.

■ తొండపు దశరథ జనార్దన్
టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు

సుస్థిర ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నమోదైందని తెలిపారు. వృద్ధిరేటు గణాంకాలు, ఆర్థిక సంవత్సరం మొత్తం వృద్ధిరేటు అంచనాలపై సీఎం మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక మార్గనిర్దేశం చేశారు. సుస్థిర ఆర్థిక వ్యవస్థను సాధించేందుకు వృద్ధి లక్ష్యాలను ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవాలని, త్రైమాసిక ఫలితాలకు తగ్గట్టుగా తదుపరి కార్యాచరణ ఉండాలని అన్నారు. రెండంకెల వృద్ధి రేటుపై సంతృప్తి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి.. ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్న 17.1 శాతం వృద్ధి సాధనకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. కొన్ని రంగాలు ఎందుకు పురోగతి సాధించడం లేదనే దానిపై కారణాలు తెలుసుకునేందుకు నిపుణులతో ప్రత్యేకంగా అధ్యయనం జరపాలని సూచించారు. పర్యాటకంలో ప్రస్తుతం సాధించిన 17.08 శాతం పురోగతి సరిపోదని.. ఈ రంగంలో 25 శాతం వృద్ధికి అవకాశం ఉందని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. వృద్ధిలోనూ అంతర్జాతీయ లక్ష్యాలను అందుకోవాలన్నారు. రైల్వేలు, రవాణా, హోటళ్లు, కమ్యూనికేషన్స్, బ్యాంకింగ్, బీమా, రియల్ ఎస్టేట్ వంటి రంగాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. శాఖలు, రంగాలు, నియోజకవర్గాల వారీగా జీఎస్‌డీపీ వివరాలను లోతుగా నమోదు చేయాలని సూచించారు.

పరిశ్రమల రంగంలో అత్యధిక వృద్ధి

2025-26 తొలి త్రైమాసికంలో రాష్ట్ర జీఎస్‌డీపీలో వృద్ధి జాతీయ సగటు కంటే ఎక్కువగా ఉందని ప్రణాళికా విభాగం అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. జీవీఏ రూ.3,57,894 కోట్లుగా వెల్లడించారు. గత ఏడాది ఇదే సమయంలో రాష్ట్రంలో 9.58 శాతం వృద్ధి నమోదు కాగా, ఈ ఏడాది 10.5 శాతం సాధ్యమైందని పేర్కొన్నారు. ఏపీ జీఎస్‌డీపీ వృద్ధిని రంగాలవారీగా పరిశీలిస్తే పరిశ్రమల శాఖలో 11.91 శాతం, వ్యవసాయ రంగంలో 9.60 శాతం, సేవల రంగంలో 10.76 శాతం వృద్ధి కనిపిస్తోందని తెలిపారు.

వ్యవసాయ అనుబంధ రంగాలు

తొలి త్రైమాసికం ప్రస్తుత ధరల ప్రకారం పశుపోషణ ఉత్పత్తి విలువ రూ.46,751 కోట్లు (6.65 శాతం వృద్ధిరేటు), చేపల పెంపకం-ఆక్వాకల్చర్ ఉత్పత్తి విలువ రూ.32,110 కోట్లు (14.52 శాతం వృద్ధి)గా ఉంది. మాంసం ఉత్పత్తి 3.15 లక్షల టన్నులకు (8 శాతం వృద్ధి) పెరగ్గా.. గుడ్ల ఉత్పత్తి 621.57 కోట్ల నుంచి 674.5 కోట్లకు చేరింది.

పరిశ్రమల రంగం: మైనింగ్-క్వారీయింగ్‌లో ఆదాయం రూ.10,686 కోట్లు (43.54 శాతం వృద్ధి), తయారీ రంగం రూ.40,515 కోట్లు (9.93 శాతం వృద్ధి), నిర్మాణ రంగం రూ.31,550 కోట్లు (9.57 శాతం వృద్ధి) ఉండగా.. రోడ్ మెటల్, బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్ ఉత్పత్తి పెరిగింది.

సేవారంగం: హోటళ్లు, రవాణా-పర్యాటక రంగం ఆదాయం రూ.25,702 కోట్లు (17.92 శాతం వృద్ధి), రియల్ ఎస్టేట్-వృత్తిపరమైన సేవలు రూ.34,324 కోట్లు (11.7 శాతం వృద్ధి) ఉండగా.. పర్యాటకులు 6.89 కోట్ల నుంచి 8.07 కోట్లకు (17.08 శాతం వృద్ధి) పెరిగారు. విమాన ప్రయాణికులు 13.09 లక్షల నుంచి 15.85 లక్షలకు (21.1 శాతం వృద్ధి) పెరిగారు.

చంద్రబాబు బాగా అభివృద్ధి చేస్తున్నారు

- తెలంగాణ ఆగమాగం: మల్లారెడ్డి


శ్రీవారి ఆలయం ఎదుట మల్లారెడ్డి

తిరుమల, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు బాగా అభివృద్ధి చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణలో ఆగం ఆగం అవుతోందన్నారు. అందుకే కేసీఆర్ వస్తే మళ్లీ పాతరోజులు వస్తాయని, ఆయన్ను మళ్లీ సీఎం చేయాలని శ్రీవారిని కోరినట్టు చెప్పారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో పవన్ కల్యాణ్ ఫొటో వద్దు

- డిప్యూటీ సీఎం చిత్రపటం తొలగించేలా ఆదేశాలివ్వండి
- హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం.. నేడు విచారణ

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటో ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. చట్టబద్ధమైన అనుమతులు లేకుండా డిప్యూటీ సీఎం ఫొటో ప్రదర్శిస్తున్నారంటూ రైల్వే విశ్రాంత ఉద్యోగి వై.కొండలరావు ఈ పిల్ దాఖలు చేశారు. చిత్రపటాల ప్రదర్శన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట విధానం తీసుకొచ్చేవరకు కార్యాలయాల్లో పవన్ ఫొటో తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సాధారణ పరిపాలనశాఖ ముఖ్య కార్యదర్శి, సహాయ కార్యదర్శి, సమాచార పౌరసంబంధాల శాఖ డైరెక్టర్‌తో పాటు వ్యక్తిగత హోదాలో పవన్ కల్యాణ్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరపనుంది.

శాప్ ఎండీగా భరణి

- కాకినాడ డీఎఫ్‌వోగా రామచంద్రరావు.. పది మంది అటవీ అధికారుల బదిలీ

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా చిత్తూరు డీఎఫ్‌వోగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి ఎస్.భరణిని ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలోని పది మంది ఫారెస్ట్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాకినాడ జిల్లా అటవీశాఖ అధికారిగా ఎస్.రామచంద్రరావు, చిత్తూరు జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్‌గా రవీంద్రనాథ్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. శ్రీశైలం డీఎఫ్‌వో అబ్దుల్ రావూఫ్‌ను బదిలీ చేసి మార్కాపురం టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించింది. మార్కాపురం టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్‌ను ప్రధాన కార్యాలయానికి బదిలీ చేసింది. కోడూరు డీఎఫ్‌వో జి.సుబ్బరాజును చిత్తూరు డీఎఫ్‌వోగా బదిలీ చేసింది. వైల్డ్ లైఫ్ శిక్షణ పూర్తి చేసుకుని ఏపీలో రిపోర్ట్ చేసిన జి.శివకుమార్‌కు చిత్తూరు డివిజన్‌లోని లకవరం డీఎఫ్‌వోగా పోస్టింగ్ ఇచ్చింది. మరో ఐదుగురిని సబ్ డీఎఫ్‌వోలుగా బదిలీ చేసింది.

బుడుగు కాదు.. పిడుగు!

- సంవత్సరం 9 నెలలకే 70 మంది బంధువులను పేర్లతో గుర్తింపు
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు


తీక్షణ్, తల్లిదండ్రులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అందజేస్తున్న తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

జగ్గయ్యపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిండా రెండేళ్లు కూడా లేని ఈ బుడతడు అద్భుత మేధాశక్తితో అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నాడు. 70మంది బంధువులను పేరుతో సహా గుర్తించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. ఈ బాలమేధావి పేరు తీక్షణ్‌సాయి. ఎన్టీఆర్ జిల్లా వాసవీ సేవాసమితి యువజన విభాగం అధ్యక్షుడు కుంచపర్తి సాయిరాం, లక్ష్మీ భవానీల కుమారుడు. వయస్సు ఒక సంవత్సరం 9 నెలలు. ఇతడు తల్లిదండ్రులు, తాతయ్య, అమ్మమ్మ, నానమ్మలనే కాదు, 70 మంది బంధువుల పేర్లు చెప్పి గుర్తిస్తున్నాడు. మధిరలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో తీక్షణ్‌సాయికి తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అవార్డు అందజేశారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తీక్షణ్‌సాయికి అభినందనలు తెలిపారు.


రాష్ట్ర సచివాలయంలో జిన్నర్స్‌తో జరిగిన సమావేశంలో అగ్రి స్పెషల్ సీఎస్ రాజశేఖర్, సీసీఐ చైర్మన్ లలిత్ కుమార్ గుప్తా, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత

పత్తి కొనుగోలుకు 'కపాస్ కిసాన్' యాప్

- వివరాల నమోదు, స్లాట్ బుకింగ్ తప్పనిసరి
- సీసీఐ కొత్త నిబంధనలపై రైతులు, జిన్నర్స్ అభ్యంతరాలు
- సడలింపులివ్వాలన్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
- 11న ఆల్ ఇండియా జిన్నింగ్ మిల్స్ అసోసియేషన్‌తో కాన్ఫరెన్స్

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొత్త మార్గదర్శకాలు తెచ్చింది. 'కపాస్ కిసాన్' అనే యాప్‌లో రైతుల వివరాలు నమోదు చేసుకోవడంతో పాటు స్లాట్ బుకింగ్‌ను తప్పనిసరి చేసింది. అలాగే మండలాల మ్యాపింగ్, షెడ్యూలింగ్, ఎల్1, 2, 3 ప్రమాణాల ఆధారంగా జిన్నింగ్ మిల్లులు తెరవడం వంటి కొత్త విధానాలను సీసీఐ ప్రవేశపెట్టింది. అయితే ఈ నిబంధనల కారణంగా రైతులు తమ పత్తిని సమీపంలోని కొనుగోలు కేంద్రంలో విక్రయించుకోలేని పరిస్థితి తలెత్తే అవకాశం ఉందని రైతులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. స్లాట్ బుకింగ్ ప్రకారం రాష్ట్రంలో ఎక్కడ సూచిస్తే అక్కడి సీసీఐ కేంద్రానికి రైతులు పత్తిని తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ఇది శ్రమతో కూడుకున్నదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్.. సీసీఐ చైర్మన్ లలిత్ కుమార్ గుప్తా, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీతతో పాటు జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులతో 2025-26లో పత్తి కొనుగోలుపై మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది నుంచి సీసీఐ అమలు చేయనున్న 'కపాస్ కిసాన్' యాప్, జిన్నింగ్ మిల్లుల సంఘం లేవనెత్తిన వివిధ అంశాలపై రాజశేఖర్ సమీక్ష చేశారు. జిన్నింగ్ మిల్లుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు జిన్నర్స్ అసోసియేషన్ అంగీకరించడం లేదని సీసీఐ అధికారులు వివరించారు. అయితే సీసీఐ కొత్త నిబంధనలపై జిన్నింగ్ మిల్లుల ప్రతినిధులు అభ్యంతరం చేస్తూ, సీసీ కెమెరాల విషయంలో కోర్టు ఆదేశాలను పరిగణలోకి తీసుకుని, సీసీఐ నడలింపులు ఇవ్వాలని కోరారు. అందరి వాదనలు విన్నాక.. రైతుల శ్రేయస్సు దృష్ట్యా పత్తి కొనుగోలును వేగవంతం చేయాల్సి ఉన్నందున అవకాశం మేరకు సీసీఐ సడలింపులు ఇవ్వాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సూచించారు. దీనిపై ఈ నెల 11న ఆల్ ఇండియా జిన్నింగ్ మిల్స్ అసోసియేషన్‌తో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి, చర్చల అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని సీసీఐ చైర్మన్ లలిత్ కుమార్ గుప్తా చెప్పారు.

పారిశ్రామికాభివృద్ధి సంస్థకు ఐదుగురు డైరెక్టర్ల నియామకం

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థకు ప్రభుత్వం ఐదుగురు డైరెక్టర్లను నియమించింది. ఈ సంస్థ చైర్మన్‌గా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి చెందిన డేగల ప్రభాకర్‌ను ఇంతకుముందే నియమించారు. తాజాగా కోనసీమ జిల్లా గన్నవరం నియోజకవర్గానికి చెందిన బాలభారతి మట్టపర్తి, విజయవాడ సెంట్రల్‌కు చెందిన జలకం రాజారావు, ఆత్మకూరు నుంచి కటారి రమణయ్య, కర్నూలుకు చెందిన మనోజ్‌కుమార్ భీమిశెట్టి, మైదుకూరు నియోజకవర్గానికి చెందిన పండిటి మల్హోత్రాలను డైరెక్టర్లను నియమిస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మెడ్‌టెక్ జోన్‌లో స్టార్టప్‌లకు ఇంక్యుబేషన్ హబ్

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో స్టార్టప్‌ల కోసం లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంక్యుబేషన్ హబ్‌ను సిద్ధం చేశారు. ఇక్కడి వరల్డ్ ట్రేడ్ సెంటర్ భవనంలో దీనిని ఏర్పాటు చేశారు. సర్జికల్ సూది నుంచి సర్జికల్ రోబోటిక్స్ వరకు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వస్తువుల తయారీకి ప్రయత్నించే భారతీయ స్టార్టప్‌లకు ఉపయోగపడేలా దీనిని తీర్చిదిద్దారు. వినూత్న ఆలోచనలతో వచ్చే వారికి అండగా ఉంటుందని మెడ్‌టెక్ జోన్ సీఈఓ జితేంద్రశర్మ పేర్కొన్నారు.

అన్ని నియోజకవర్గాల్లో అరకు కాఫీ షాపులు

- అధికారులకు మంత్రి సంధ్యారాణి ఆదేశాలు

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోనూ అరకు కాఫీ షాపుల ఏర్పాటుతోపాటు, గిరిజన ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులోకి తేవాలని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) అధికారులను రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. విశాఖపట్నంలోని జీసీసీ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ కె.శ్రావణ్‌కుమార్, ఎండీ, వీసీ కల్పనకుమారితో కలిసి ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. గిరిజనులకు లాభదాయకమైన కాఫీ సాగును మరింత పెంచాలన్నారు. చింతపల్లి ప్రాంతంలో కాఫీ తోటలకు వ్యాపించిన బెర్రీ బోరర్ తెగులుపై బెంగ పడవద్దని, ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతాలకు కేటాయించిన రూ.7,500 కోట్లలో రూ.1,300 కోట్లను రహదారుల నిర్మాణానికి ఉపయోగించామన్నారు. అరకు కాఫీ మార్కెటింగ్‌కు సంబంధించి ఇప్పటికే 18 సంస్థలతో ఎంఓయూలు చేసుకున్నామని వెల్లడించారు.

డెన్మార్క్ వెళ్లనున్న కమిషనర్ వీరపాండియన్

ప్రజారోగ్యంలో డిజిటలైజేషన్ శిక్షణకు హాజరు

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో డిజిటలైజేషన్ సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ రంగంలో స్ఫూర్తిగా ఉన్న డెన్మార్క్ ప్రభుత్వం ఇచ్చే శిక్షణా కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం అస్సాం, జమ్మూకశ్మీర్, మధ్యప్రదేశ్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ డైరెక్టర్లను ఎంపిక చేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఏబీడీఎం మిషన్ డైరెక్టర్ జి.వీరపాండియన్ డెన్మార్క్ వెళ్లనున్నారు. డెన్మార్క్ ప్రభుత్వం పూర్తి ఖర్చులతో అక్టోబరు 1 నుంచి 31 వరకూ నెలరోజుల పాటు వీరికి శిక్షణ ఇవ్వనుంది.

గోల్డ్ క్లస్టర్‌కు భూములిచ్చే వారికి

రిటర్నబుల్ ప్లాట్లు

- భూసమీకరణ ప్రక్రియ ద్వారా 78 ఎకరాలు సేకరణ
- మున్సిపల్ శాఖ ఆదేశాలు.. నోటిఫికేషన్ విడుదల

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతం మంగళగిరిలో ఏర్పాటు చేయనున్న గోల్డ్ క్లస్టర్ కోసం చేపట్టనున్న భూ సమీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామంలో సేకరించే 78.01 ఎకరాల్లో ఈ గోల్డ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం అవసరమయ్యే భూసమీకరణ కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఏపీ సీఆర్‌డీఏ చట్టంలోని సెక్షన్ 55, సబ్‌సెక్షన్ 3 కింద భూసమీకరణ చేపట్టనున్నారు. దీనికోసం భూములిచ్చిన వారికి తర్వాత అదే ప్రాంతంలో రిటర్నబుల్ ప్లాట్లు అందజేస్తారు. మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ గోల్డ్ క్లస్టర్‌కు సంబంధించి ప్రత్యేక అభివృద్ధి పథకం కింద చేసిన ప్రతిపాదనలను సీఆర్‌డీఏ ఆమోదించింది. దీని ప్రకారం భూములిచ్చిన ఒరిజినల్ పట్టాదారులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఒక ఎకరాకుపైగా ఇచ్చినవారికి 550 చదరపు గజాలు, 0.50-0.99 ఎకరాలకు 380 చ.గజాలు, 0.25-0.49 ఎకరాలకు 380 చ.గజాలు, 0.24 ఎకరం లోపు భూమి ఇచ్చిన వారికి 180 చ.గజాలు రిటర్నబుల్ ప్లాట్‌లు అందజేస్తారు. అసైన్డ్ భూముల విషయంలో ఎకరా పైబడిన భూమిని కోల్పోయిన వారికి 450 చ.గజాలు, 0.50-0.99 ఎకరాలు ఇచ్చిన వారికి 330 చ.గజాలు, 0.25-0.49 ఎకరాలు ఇచ్చిన వారికి 230 గజాలు, 0.24 ఎకరాల కంటే తక్కువ ఇచ్చిన వారికి 150 చ.గజాలు రిటర్నబుల్ ప్లాట్‌లు అందజేస్తారు. గుంటూరు జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సబ్‌కలెక్టర్/డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఈ భూసమీకరణ చేపట్టనున్నారు.



రామ్మోహన్ కుమారుడికి లోకేశ్ ఆశీస్సులు

మంత్రి నారా లోకేశ్ మంగళవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నివాసానికి వెళ్లారు. రామ్మోహన్, శ్రావ్య దంపతుల కుమారుడికి ఆశీస్సులు అందజేశారు. వారి కుమారుడిని ఎత్తుకుని ముద్దాడారు. అక్కడే ఉన్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి సతీమణి మాధవీలత క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.


చాగంటి కోటేశ్వరరావుకు కొప్పరపు కవుల జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ. చిత్రంలో మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, ఎల్వీ సుబ్రహ్మణ్యం, సాగర్ అని సింగరాజు

చాగంటికి కొప్పరపు కవుల ప్రతిభా పురస్కారం

- ప్రదానం చేసిన జస్టిస్ ఎన్వీ రమణ

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రవచన కర్త, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు కొప్పరపు కవుల జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. విశాఖ నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం జరిగిన కొప్పరపు కవుల కళాపీఠం 23వ వార్షికోత్సవాల్లో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ముఖ్య అతిథిగా హాజరై చాగంటికి పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ రమణ మాట్లాడుతూ పంచభూతాలు ఉన్నంతకాలం మన మాతృభాష తెలుగు వెలుగొందాలని ఆకాంక్షించారు. తెలుగువారికి ఆధ్యాత్మికత, సంస్కృతి, క్రమశిక్షణతో కూడిన మూలాలను ప్రవచనాల ద్వారా తెలియజేస్తూ, జాతిని జాగృతం చేస్తున్న చాగంటి కోటేశ్వరరావు కొప్పరపు కవుల కళాపీఠం ప్రతిభా పురస్కారానికి అన్ని విధాలా అర్హులని కొనియాడారు. పురస్కార గ్రహీత చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ కొప్పరపు కవుల వంటి సరస్వతీ ఉపాసకుల పేరిట నెలకొల్పిన విశిష్ట పురస్కారం తనకు లభించడం భగవంతుని కృప అన్నారు. అవధానికి కేవలం భాష మీద పట్టుంటే చాలదని, సకల శాస్త్రాలు, పురాణ ఇతిహాసాలపైనా పట్టు ఉండాలని తెలిపారు. అతిథులుగా మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, కాలిఫోర్నియాకు చెందిన లిపి సంస్థ ముఖ్యకార్యనిర్వహణాధికారి సాగర్ అని సింగరాజు, ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ నిందితుల రిమాండ్ పొడిగింపు

» ఏడుగురికి 12 వరకు పొడిగించిన ఏసీబీ కోర్టు

విజయవాడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ఏడుగురు నిందితులకు రిమాండును ఈనెల 12వ తేదీ వరకు కోర్టు పొడిగించింది. విజయవాడలోని ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు మంగళవారం ఈ ఉత్తర్వులు ఇచ్చారు. రిమాండ్ గడువు ముగియడంతో విజయవాడలోని జిల్లాజైలులో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్ రెడ్డి, బూనేటి చాణక్య, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్ నాయుడు, గుంటూరు జైల్లో ఉన్న బాలాజీ యాదవ్, నవీన్‌కృష్ణలను మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. దీంతో ఈ ఏడుగురికి రిమాండ్‌ను పొడిగించారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు వెళ్లడంతో ఆయన కోర్టుకు హాజరుకాలేదు. ఆయన ఈనెల 11వ తేదీ సాయంత్రం జైలు అధికారుల ఎదుట లొంగిపోవాల్సి ఉంది. అలాగే, బెయిల్‌పై విడుదలైన కె.ధనుంజయ్ రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప, పైలా దిలీప్ వేర్వేరుగా కోర్టుకు హాజరయ్యారు. వీరికి డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయడాన్ని సవాలు చేస్తూ సిట్ అధికారులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై స్టే ఇచ్చిన హైకోర్టు ఈనెల 11వ తేదీన తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. కోర్టు హాల్లో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సిట్ అధికారులు సీజ్ చేసిన రూ.11 కోట్లను ప్రస్తావించారు. ఆ డబ్బుతో తనకు ఎలాంటి సంబంధమూ లేదన్నారు. అయితే, దీనిపై ఇప్పటికే కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని, వాటిని చదువుకోవాలని కసిరెడ్డికి న్యాయాధికారి సూచించారు.

పీఎస్ఆర్, కాంతి రాణా సస్పెన్షన్ పొడిగింపు



పీఎస్ఆర్ | కాంతి రాణా తాతా

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతి రాణా తాతా సస్పెన్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించింది. ముంబైకి చెందిన సినీనటి కాదంబరి జెత్వానీపై అక్రమ కేసు బనాయించి ఆమెతోపాటు కుటుంబ సభ్యులను వేధించిన కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులు ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్నారు. ఈ నెల 2న సమావేశమైన రివ్యూ కమిటీ కేసు దర్యాప్తుపై ఆరా తీసింది. ఇంకా పూర్తి కానందున సస్పెన్షన్ ఎత్తేస్తే సీనియర్ ఐపీఎస్ అధికారులు దర్యాప్తుపై ప్రభావం చూపించే అవకాశం ఉందని కమిటీ అభిప్రాయపడింది. దీంతో 2026 మార్చి 8 వరకూ సస్పెన్షన్ పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే కేసులో సస్పెండైన మరో ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ తనకు పోస్టింగ్ ఇప్పించాలంటూ కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు.

వివేకా హత్య కేసు విచారణ 16కు వాయిదా

» గత విచారణలో సుప్రీంకోర్టు ప్రశ్నలపై అఫిడవిట్ దాఖలుకు సమయం కోరిన సీబీఐ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. సీబీఐ విజ్ఞప్తితో కేసును సుప్రీంకోర్టు ఈనెల 16కి వాయిదా వేసింది. గత విచారణ సందర్భంగా.. వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తు అవసరమా? లేదా? నిందితుల కస్టోడియల్ విచారణ చేయాలా? వద్దా? నిందితుల్లో ఎంత మంది బెయిల్ రద్దు చేయాలో తెలియజేయాలని, ప్రతి అంశానికి సంబంధించి సమగ్ర వివరణ ఇవ్వాలని న్యాయస్థానం సీబీఐని ఆదేశించింది. అయితే మంగళవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మ ధర్మాసనం ఎదుట కేసు విచారణకు రాగా.. అఫిడవిట్ దాఖలు చేయడానికి మరికొంత సమయం కావాలని సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు కోరారు. ఆ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కేసును సెప్టెంబరు 16న మధ్యాహ్నం 2 గంటలకు విచారిస్తామని తెలిపింది.

అధికారం.. డబ్బు.. విషం!

(మొదటి పేజీ తరువాయి)

జగన్ మద్యం అంశాన్ని ఎలా వాడుకున్నారో ఈ భాగం వివరిస్తుంది. నాటి ఎన్నికల ప్రచారంలో.. మందు అనేది లేకుండా చేస్తానని ఆయన చెప్పిన వీడియో క్లిప్‌ను చూపిస్తూ, ఆ తర్వాత ఆ హామీని ఎలా తుంగలో తొక్కారో వివరించారు. ప్రజలు మద్యం తాగకుండా చేసేందుకు మద్యం ధరలను షాక్ కొట్టేలా పెంచుతానంటూ కల్లిబొల్లి మాటలు చెబుతూ.. నిబంధనలను తనకు ఇష్టం వచ్చినట్లు మార్చేస్తూ.. ప్రజలకు చీప్ లిక్కర్‌ను అధిక ధరలకు అమ్ముతూ.. ప్రభుత్వ ఖజానాను ఎలా కొల్లగొట్టారో పేర్కొన్నారు. త్రీ క్యాపిటల్స్, రాయల్ రైట్, స్పెషల్ స్టేటస్ అంటూ పిచ్చి పిచ్చి పేర్లతో పిచ్చి బ్రాండ్లను నాసిరకం మద్యాన్ని మాత్రమే అందుబాటులో ఉంచి ప్రజల ప్రాణాలు పణం పెట్టి వేల కోట్లు సంపాదించిన వైనాన్ని వివరించారు. ఇలా సంపాదించిన మద్యం డబ్బును 2024 ఎన్నికల్లో ఖర్చు పెట్టి మరోసారి అధికారంలోకి రావడానికి జగన్ చేసిన ప్రయత్నాన్నీ వివరించారు. మద్యం కుంభకోణంలో అసలు ఏం జరిగింది. అక్రమాల తీరు.. వైసీపీ పెద్దలు డబ్బులు దండుకుని వాటిని ఎక్కడెక్కడికి తరలించా రు.. ఎవరెవరు మద్యం కుంభకోణంలో భాగస్వాములుగా ఉన్నారు వంటి అనేక అంశాల ను వివరించారు. మద్యం డబ్బుతో సినిమాల నిర్మాణం.. రియల్ ఎస్టేట్ వ్యాపారాలు.. బంగారు బిస్కట్లు.. విదేశాల్లో ఖరీదైన విల్లాల కొనుగోలు చేసిన తీరును ప్రస్తావించారు. మద్యం కారణంగా ఆరోగ్యాలు పాడుచేసుకున్న బాధితుల దీన పరిస్థితిని వారి మాటల్లోనే చూపారు. 'ఎన్నో సమాధానాలు దొరకని ప్రశ్నలు' అంటూ తొలి భాగాన్ని ముగించారు. దీన్ని యూట్యూబ్‌తోపాటు వివిధ సామాజిక మాధ్యమాల్లో అందుబాటులో ఉంచనున్నారు.

రెండో భాగంలో... మద్యం డబ్బులు ఎక్కడి నుంచి ఎక్కడికి తరలించారన్న అంశాలను వివరించారు.

మూడో భాగంలో... మద్యం పేరుతో విషాన్ని ప్రజలతో ఎలా తాగించారు....దాని వల్ల ప్రజల ప్రాణాలతో ఎలా చెలగాటమాడారన్న విషయాలను ప్రస్తావించారు.

కోవూరులో మద్యం స్కాం లింకులు!

» ఆ సొమ్ముతో స్థలం కొనుగోలుపై సిట్ ఆరా

» ధనుంజయ్ రెడ్డి బంధువును విచారించిన అధికారులు



కోవూరులో ధనుంజయ రెడ్డి బంధువు డేగపూడి ప్రభాకరరెడ్డిని విచారిస్తున్న సిట్ అధికారులు

కోవూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని కుదిపేస్తున్న మద్యం కుంభకోణంపై విచారణ జరుపుతున్న సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం) అధికారులు నెల్లూరు జిల్లా కోవూరులో ఓ రియల్టర్‌ను రహస్యంగా విచారించారు. కోవూరు పట్టణానికి చెందిన రియల్టర్ డేగపూడి ప్రభాకరరెడ్డి మద్యం కేసులో నిందితుడైన ధనుంజయ రెడ్డికి సమీప బంధువు. వైసీపీ ప్రభుత్వంలో ధనుంజయ్‌రెడ్డి ప్రభుత్వ కార్యదర్శిగా పని చేసే సమయంలో కోవూరులో 80 అంకణాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇటీవల ధనుంజయరెడ్డి ఆస్తులపై సిట్ దృష్టి సారించడంతో కోవూరులో ఆయన స్థలం కొనుగోలు చేసిన విషయం వెలుగు చూసింది. దీంతో సిట్ అధికారులు మంగళవారం కోవూరు వచ్చి ప్రభాకరరెడ్డిని విచారించారు. అంకణం ఎంతకు కొన్నారు? ఎవరి వద్ద కొనుగోలు చేశారు? అనే విషయాలను రాబట్టారు. మార్కెట్ ధర ప్రకారమే ప్లాటును కొన్నట్టు ప్రభాకరరెడ్డి తెలిపారు. మద్యం కుంభకోణం కేసులో మరో నిందితుడు కృష్ణమోహన్‌రెడ్డి కూడా కోవూరు, విడవలూరు మండలాల్లో పొలాలు కొనుగోలు చేశారని సిట్‌కు సమాచారం అందింది. వాటిపైనా త్వరలో విచారించనున్నారు.

తెలుగు జాతికి చీకటి రోజు!

» ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఆరెస్సెస్ వాదికి ఓటేస్తారా?

» టీడీపీ, జనసేన, వైసీపీపై షర్మిల విమర్శలు



అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీ బలపరచిన అభ్యర్థి రాధాకృష్ణన్‌కు టీడీపీ, జనసేన, వైసీపీ ఓటేసిన మంగళవారం తెలుగు జాతికి చీకటి రోజు అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఆత్మగౌరవమే అజెండా అని తెలుగుదేశం, పదవుల కన్నా జాతి ప్రయోజనం ముఖ్యమని జనసేన ప్రకటించాయని గుర్తుచేశారు. తెలుగే లెస్స అని చిలక పలుకులు పలికిన వైసీపీ తెలుగు జాతికి తీరని ద్రోహం చేసిందని మంగళవారం 'ఎక్స్' పోస్టులో విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా అత్యున్నత పదవికి తెలుగు బిడ్డ పోటీపడితే.. ఆరెస్సెస్ వాదికి ఓటు వేయించిన మూడు పార్టీల అధ్యక్షులు చరిత్రహీనులని అన్నారు. ఇది జాతీయస్థాయిలో తెలుగుజాతికి జరిగిన ఘోర అవమానమని షర్మిల పేర్కొన్నారు. రాష్ట్రానికి బీజేపీ చేసిన మోసం కనిపించలేదా అని ప్రశ్నించారు. మరోవైపు ఈడీ, సీబీఐ కేసులకు భయపడి బీజేపీ బలపరచిన అభ్యర్థి రాధాకృష్ణన్‌కు ఓటేసి.. వైసీపీ అధ్యక్షుడు జగన్ రాష్ట్రానికి వెన్నుపోటు పొడిచారని ఏఐసీసీ కార్యదర్శి మాణిక్యం ఠాకూర్ ఆరోపించారు.

ఆ పదవికి గౌరవాన్ని తెస్తారు

» ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు సీఎం, డిప్యూటీ సీఎం అభినందనలు

» ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపిన మంత్రి లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు పలువురు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు. సీఎం చంద్రబాబు ఎక్స్‌లో స్పందిస్తూ.. 'జాతికి సేవ చేసేందుకు వచ్చిన అవకాశంలో మీరు విజయం సాధిస్తారని నమ్ముతున్నా. ప్రజాస్వామిక విలువలను కాపాడటంలో మీకు ఉన్న అపారమైన అనుభవం దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది' అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందిస్తూ... 'ఆయన అనుభవం, ఆదర్శవంతమైన రాజనీతిజ్ఞత ఉపరాష్ట్రపతి పదవికి గౌరవాన్ని తెస్తాయి. రాజ్యసభలో నిర్మాణాత్మక చర్చల ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఆయన కృషి చేస్తారు' అని ఆకాంక్షించారు. కాగా మంత్రి లోకేశ్, ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన రాధాకృష్ణన్‌కు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సత్యకుమార్ ఓ ప్రకటనలో... అభ్యుదయ భావాలు కలిగిన రాధాకృష్ణన్ సేవలు ఇకపై దేశానికి ఉపయోగపడనున్నాయని అన్నారు.

రైతుల్లేని వైసీపీ పోరు

» జగన్ పిలుపును పట్టించుకోని అన్నదాతలు

» ఆర్డీవో కార్యాలయాల వద్ద నిరసనలకు రాష్ట్రవ్యాప్తంగా స్పందన కరువు

» ఇంటికే పరిమితమైన వైసీపీ అధ్యక్షుడు




అనంతపురం నగరంలో నిర్వహించిన ర్యాలీలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, శైలజానాథ్ తదితరులు

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై రెవెన్యూ డివిజన్ కార్యాలయాల ఎదుట నిరసనలు తెలపాలన్న వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపును రాష్ట్రవ్యాప్తంగా రైతులెవరూ పట్టించుకోలేదు. మంగళవారం 'అన్నదాత పోరు' పేరుతో ఆ పార్టీ నిర్వహించిన ఆందోళనల్లో అన్నదాతలు కనిపించలేదు. పోరుకు పిలుపునిచ్చిన జగన్.. తాడేపల్లిలో నివాసానికే పరిమితమయ్యారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలే పాల్గొని మమ అనిపించారు. పలుచోట్ల సీనియర్ నేతలు, మాజీ మంత్రులు కూడా డుమ్మా కొట్టారు. రైతుల నుంచి స్పందన లేకపోవడంతో పలుచోట్ల వైసీపీ నేతలే రైతుల్లా కండువాలు కప్పుకుని ఆర్డీఓ కార్యాలయాలకు వెళ్లారు. యూరియా కొరత తీర్చాలంటూ వినతిపత్రాలు ఇచ్చేసి వచ్చేశారు. ఇబ్రహీంపట్నం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి జోగి రమేశ్ రెచ్చిపోయి వ్యాఖ్యలు చేయడంతో పోలీసులు ఆయన్ను కట్టడి చేశారు. దీంతో పక్కనే ఉన్న గాంధీబొమ్మకు వినతిపత్రం ఇచ్చేసి జోగి రమేశ్ వెనుదిరిగారు. పుంగనూరులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతిలో అభినయ్‌రెడ్డి, చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, అనకాపల్లిలో గుడివాడ అమర్నాథ్, నందిగామలో దేవినేని అవినాశ్‌రెడ్డి తదితరులు పార్టీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గోదావరి జిల్లాల్లో యూరియా కొరత లేకపోవడం, ఈ జిల్లాల్లో వాడకం కూడా తగ్గడంతో వైసీపీ పిలుపును రైతులు ఏమాత్రం పట్టించుకోలేదు. ఆందోళనలకు వీల్లేదంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేయడంతో.. శాంతియుతంగా అన్నదాత పోరు చేస్తామంటూ వైసీపీ నేతలు ప్రకటించారు. శాంతియుత ర్యాలీలకు పోలీసులు అనుమతిని ఇచ్చినా కూడా పలుచోట్ల వైసీపీ శ్రేణులే ముఖం చాటేశాయి. అధికారాన్ని కోల్పోయాక వరుసగా రైతు పోరు పేరిట జగన్ ఇస్తున్న పిలుపునకు రైతుల నుంచిగానీ, సొంత పార్టీ నేతల నుంచిగానీ స్పందన రావడం లేదు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కీలక సన్నివేశాల చిత్రీకరణ



సాయి దుర్గాతేజ్ కథానాయకుడిగా రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై కె. నిరంజన్‌రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం కీలక షెడ్యూల్‌లోకి ప్రవేశించింది. పీటర్ హెయిన్ కొరియోగ్రఫీ చేసిన అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్న ఓ బాలీవుడ్ స్టార్‌తో సాయి దుర్గాతేజ్ తలపడతారు. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన సీజీఐ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. సినిమాను తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు.



ఒకే తెరపై మీ ఇద్దరూ.. అద్భుతం!

అల్లు అర్జున్

మంచు లక్ష్మి ప్రధాన పాత్రధారిగా వంశీకృష్ణ మల్లా తెరకెక్కిస్తున్న చిత్రం 'దక్ష'. 'ద డెడ్లీ కాన్స్పిరసీ' అనేది ఉపశీర్షిక. మోహన్‌బాబు, సముద్రఖని, సిద్ధిక్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ మంచు ఎంటర్టైన్‌మెంట్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ నెల 19న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా అల్లు అర్జున్ చిత్రం ట్రైలర్‌ను సోషల్‌మీడియా వేదికగా విడుదల చేశారు. 'నా మిత్రురాలు, ఆప్తురాలైన లక్ష్మీ మంచుకు శుభాకాంక్షలు. మీరు, మోహన్‌బాబు గారు ఒకే తెరపై కనిపించడం అద్భుతంగా అనిపిస్తోంది. చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు.

'మిరాయ్'ను కుటుంబంతో చూడాలి

'ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో 'మిరాయ్' సినిమాపై ఆసక్తి పెరిగింది. తప్పకుండా ఈ సినిమాను చూడాలనే కుతూహలాన్ని వారికి కలిగించింది. తద్వారా 'మిరాయ్' చిత్రానికి అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి విడుదలకు ముందే చక్కని స్పందన వచ్చింది. ప్రేక్షకులు వారి కుటుంబంతో కలసి 'మిరాయ్'ను చూడాలనేది మా కోరిక. అందుకే టికెట్ ధరలను పెంచడం లేదు' అని నిర్మాత, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ అన్నారు. తేజ సజ్జా కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విశ్వప్రసాద్ 'మిరాయ్' విశేషాలను మీడియాతో పంచుకున్నారు.



- నిర్మాణ వ్యయం గురించి ఆలోచించకుండా, నేను చాలా లోతుగా ఇన్‌వాల్వ్ అయి చేసిన సినిమా ఇది. మార్కెట్ లెక్కలు వేసుకోకుండా మా బేనర్ నుంచి ఒక ఎక్స్‌ట్రార్డినరీ సినిమా ఇవ్వాలని ఈ చిత్రాన్ని నిర్మించాం. మిరాయ్ ఒక అద్భుతమైన ఫాంటసీ అడ్వెంచర్.
- చరిత్రకు కాల్పనికతను జోడించిన కథ ఇది. అశోకుడు తొమ్మిది పుస్తకాల్లో తన జ్ఞానాన్ని నిక్షిప్తం చేయడం, వాటి సంరక్షణను యోధులకు అప్పగించడం, అందులో ఒక పుస్తకం రక్షణ కోసం హీరో, విలన్ మధ్య ఎలాంటి పోరాటం జరిగిందనే అంశం చుట్టూ కథ నడుస్తుంది. అలాగే తల్లి సంకల్పంతో ముడిపడిన కథ ఇది. ఈ సినిమాలో లొకేషన్లు, గ్రాఫిక్స్ ఆడియన్స్‌కి కొత్త అనుభూతిని ఇస్తాయి.
- ఈ సినిమా కోసం తేజ చాలా కష్టపడ్డాడు. యాక్షన్ కోసం థాయ్‌లాండ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. అలాగే మనోజ్ ప్రతి నాయకుడిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారు.
- ప్రభాస్ 'రాజాసాబ్' చిత్రాన్ని జనవరి 9న విడుదల చేస్తున్నాం. కాంతార 2 చిత్రంతో కలిపి ట్రైలర్‌ను, ప్రభాస్ పుట్టిన రోజున ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం.

అవన్నీ వదంతులే

- కాజల్ అగర్వాల్



'నేను ప్రమాదానికి గురైనట్లు సామాజిక మాధ్యమాల్లో నిరాధారమైన వార్తలు చూశాను. ఇక లేనని కూడా ప్రచారం చేశారు. అవన్నీ వదంతులే. వాటిని చూసి ఎంతో నవ్వుకున్నాను' అని పేర్కొన్నారు కథానాయిక కాజల్ అగర్వాల్. ఆమె ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలతో పోరాడుతోందని కొన్ని సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ వార్తలపై అభిమానులను ఉద్దేశిస్తూ కాజల్ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'దేవుని దయవల్ల నేను క్షేమంగా, సురక్షితంగా ఉన్నాను. ఇలాంటి తప్పుడు వార్తలు నమ్మొద్దని, ప్రచారం చెయ్యొద్దని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను' అని పేర్కొన్నారు. కాజల్ అగర్వాల్ ప్రస్తుతం 'రామాయణ' సినిమాలో నటిస్తున్నారు.

ప్రేమానుభూతితో సాగే పాట



యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం నటిస్తోన్న కొత్త సినిమా 'కె-ర్యాంప్'. యుక్తి తరేజా కథానాయిక. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 18న విడుదలవుతోంది. మంగళవారం ఈ చిత్రం నుంచి 'కలలే కలలే కనులకు నువ్వు కనబడి కలలే...' అంటూ ప్రేమానుభూతితో సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. భాస్కరభట్ల రాసిన ఈ గీతానికి చైతన్య భరద్వాజ్ స్వరాలు సమకూర్చగా కపిల్ కపిలన్ ఆలపించారు.

ఇంత విషం ఇప్పించండి


● కన్నడ హీరో దర్శన్ కంటతడి



'వెలుగును చూసి 30 రోజులు అయింది. జైలులో ఉండలేకపోతున్నాను. నాకు ఇంత విషం ఇప్పించండి' అని కన్నడ హీరో దర్శన్ న్యాయమూర్తిని అభ్యర్థించారు. చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో ఆయన నిందితుడు. పరప్పన అగ్రహార జైలులో ఉన్న ఆయనను బెంగళూరు 57వ సీసీహెచ్ కోర్టు ఎదుట మంగళవారం వర్చువల్‌గా హాజరుపరిచారు. పరప్పన అగ్రహార జైలు నుంచి దర్శన్‌ను బళ్లారి జైలుకు పంపే పిటిషన్‌పై కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. వర్చువల్‌గా హాజరైన దర్శన్.. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని చెయ్యి ఎత్తారు. దీంతో న్యాయాధికారి ఆయనకు మాట్లాడే అవకాశం కల్పించారు. ఆ సమయంలో ఉద్వేగానికి లోనైన దర్శన్, వెలుగును చూసి 30 రోజులైందని, చేతులకు ఫంగస్ వచ్చిందని వివరించారు. ఇతర నిందితులతో నిమిత్తం లేదని, తనకు మాత్రం కొంచెం విషం ఇప్పించాలని కోరారు. అలాంటి మాటలు మాట్లాడవద్దని, సౌలభ్యాలు, సమస్యల గురించి మాత్రమే చెప్పాలని న్యాయాధికారి దర్శన్‌కు సూచించారు. అనంతరం పిటిషన్ విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. దర్శన్‌ను బెంగళూరు జైలులోనే ఉంచాలని, అవసరమైన పరుపు, తలగడ సమకూర్చాలని, జైలులో అటూ ఇటూ తిరిగేందుకు అవకాశం కల్పించాలని న్యాయాధికారి ఆదేశించారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

విలక్షణమైన కథలతో వస్తున్నాం



'ప్రస్తుతం మా 'భీమవరం టాకీస్' పతాకంపై పలు చిత్రాలు నిర్మిస్తున్నాం. అందులో 'యండమూరి కథలు', 'కెపీహెచ్‌బీ కాలనీలో', 'మా నాన్న హీరో', 'మహానాగ' తదితర చిత్రాల రెగ్యులర్ షూటింగ్ మొదలైంది' అని నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ చెప్పారు. తమ నిర్మాణ సంస్థలో రూపొందుతున్న కొత్త సినిమాల వివరాలను ఆయన మీడియాతో పంచుకున్నారు. 'మా బేనర్‌పై వరుస చిత్రాలు చేస్తున్నాం. త్వరలో ప్రముఖ దర్శకుడితో భారీ బడ్జెట్‌తో ఓ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. మరికొన్ని చిత్రాలు పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా విలక్షణమైన కథలతో కామెడీ, సోషల్, డ్రామా, హారర్.. ఇలా విభిన్న జానర్లలో ఈ చిత్రాలు ఉంటాయి' అని చెప్పారు.

సీఎం చంద్రబాబును ఆశీర్వదిస్తున్న వేద పండితులు



దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

22 నుంచి అక్టోబరు 2 వరకు నవరాత్రులు

ఉత్సవాలకు సీఎం చంద్రబాబును ఆహ్వానించిన దుర్గగుడి అధికారులు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కనకదుర్గమ్మ వారి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2 వరకు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ నిమిత్తం దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, దేవస్థానం ఈవో వి.కె.శీనానాయక్, ఆలయ వేద పండితులు, అర్చకులు ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రికి వేద ఆశీర్వచనం, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. మూలా నక్షత్రం రోజున రాష్ట్ర ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలు సమర్పించే ఆనవాయితీ గురించి వివరించి, ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. దేవాలయ అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యుడు వి.శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


35 సెక్టార్లుగా..

ఇంద్రకీలాద్రిపై సిద్ధమవుతున్న బందోబస్తు

హోల్డింగ్ పెంచుదాం

శరన్నవరాత్రుల నిర్వహణ కమిటీ నిర్ణయం

- ఘాట్‌రోడ్డుకు అటు ఇటు ప్రదేశాల గుర్తింపు



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): హోల్డింగ్.. శరన్నవరాత్రి మహోత్సవాల్లో ప్రతి ఏడాది వినిపించే పదం ఇది. 22వ తేదీ నుంచి ఇంద్రకీలాద్రిపై మొదలయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో హోల్డింగ్ పాయింట్లను పెంచాలని అధికారులు నిర్ణయించారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారి జన్మనక్షత్రం మూల రోజున సరస్వతి అలంకారం వేస్తారు. ఆ రోజున అమ్మవారిని దర్శించుకోవడానికి దేశం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు. ముందు రోజు రాత్రి నుంచి క్యూలైన్లలోకి చేరుకుంటారు. ఇందుకోసం పోలీసులు భక్తులను అదుపు చేయడానికి హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. వినాయకుడి ఆలయం, వీఎంసీ, రాజీవ్‌గాంధీ పార్కు, కుమ్మరిపాలెం సెంటర్, కేఎల్ వాటర్ రిజర్వాయర్ ప్రదేశాల్లో ఈ పాయింట్లు ఉంటాయి. 29వ తేదీన అమ్మవారు సరస్వతిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. గడచిన ఏడాది మూల నక్షత్రం రోజున సుమారుగా 80వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది ఆ సంఖ్యకు మించి భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకు తగిన విధంగా హోల్డింగ్ పాయింట్లను పెంచుకోవాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

సుమారు 5వేల మందితో భద్రతా విధులు

- ఇతర జిల్లాల నుంచి రానున్న 2 వేల మంది
- ఈ-డిప్లాయ్‌మెంట్‌లో బందోబస్తు సమాచారం



ఐదు వేల మందితో బందోబస్తు.. 35 సెక్టార్లు.. దసరా శరన్నవరాత్రుల్లో ఇదీ బందోబస్తు లెక్క.. ఇంద్రకీలాద్రిపై 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యే శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించి బందోబస్తు లెక్కలను పోలీస్ అధికారులు తేలుస్తున్నారు. ఉత్సవాలకు కౌంట్‌డౌన్ మొదలవ్వడంతో బందోబస్తుకు సంబంధించిన స్కీంను రూపొందించడంలో అధికారులు వేగం పెంచారు. గడిచిన ఏడాది తలెత్తిన పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది బందోబస్తును సిద్ధం చేస్తున్నారు. దీనికి సంబంధించిన కసరత్తు కమిషనర్ కార్యాలయంలో జరుగుతోంది.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఇంద్రకీలాద్రిపై గత ఏడాది మాదిరిగానే ఈ సారి ఐదు వేల మందితో బందోబస్తును ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. గడచిన సంవత్సరం వరద ముంపు తగ్గిన వెంటనే శరన్నవరాత్రి ఉత్సవాలు వచ్చాయి. వరదల ప్రభావంతో భక్తులు పెద్దగా అమ్మవారి దర్శనానికి రారని అధికారులు భావించారు. ఈ అంచనాలను తారుమారు చేస్తూ భక్తులు అమ్మవారి దర్శనానికి వచ్చారు. వాస్తవానికి ప్రతి శరన్నవరాత్రుల్లో మొదటి ఐదు రోజులు భక్తుల రద్దీ సాధారణంగా ఉంటుంది. మూలా నక్షత్రం రోజు నుంచి రద్దీ పెరుగుతూ ఉంటుంది. గడచిన ఏడాది శరన్నవరాత్రులకు అంకురార్పణ జరిగిన రోజు నుంచి భక్తుల రద్దీ కొనసాగింది. దసరా రోజున అంచనాలకు మించి భక్తులు వచ్చారు. దీంతో అధికారులు ఆ రోజు పూర్తిగా వీఐపీ దర్శనాలను రద్దు చేశారు. చివరి రోజున అప్పటి వరకు సిబ్బంది సరిపడకపోవడంతో అప్పటికప్పుడు గ్రేహౌండ్స్‌ను, ప్లటూన్లను రంగంలోకి దింపాల్సి వచ్చింది. ఈసారి అలాంటి పరిస్థితి లేకుండా తొలి రోజు నుంచి కొన్ని ప్లటూన్లను రిజర్వ్‌లో ఉంచాలని అధికారులు

మిగతా 6లో..

ఈ-డిప్లాయ్‌మెంట్‌లో వసతి, విధుల సమాచారం

ఈ ఏడాది శరన్నవరాత్రుల్లో బందోబస్తు సిబ్బందికి సమాచారాన్ని ఈ-డిప్లాయ్‌మెంట్ ద్వారా పంపబోతున్నారు. ఇప్పటికే 'ఈ' విధానాన్ని పలు ఈవెంట్లకు ఉపయోగించారు. రాష్ట్రంలో అధికారుల నుంచి సిబ్బంది వివరాలన్నీ ఈ డిప్లాయ్‌మెంట్ యాప్‌లో నిక్షిప్తమై ఉంటాయి. ఎవరెవరికి, ఎక్కడెక్కడ విధులు కేటాయించారో దీని ద్వారా సమాచారం పంపుతారు. వారికి భోజనం, వసతి సదుపాయం ఎక్కడ కల్పించారో ఆ వివరాలు అందులోనే ఉంటాయి. ఆ వసతి కేంద్రాల వద్ద గైడ్ పీసీలను నియమిస్తారు. బందోబస్తు విధులు ఉన్న వారు విజయవాడకు చేరుకుని నేరుగా ఆ వసతి కేంద్రాలకు వెళ్లిపోతారు. శరన్నరాత్రులు ఆరంభం నుంచి ఎవరెవరు ఎక్కడ విధులు నిర్వర్తించాలో ఈ డిప్లాయ్‌మెంట్ ద్వారా సమాచారం పంపుతారు. ఆ సెక్టార్‌కు ఇన్‌చార్జి ఎవరో ఆ అధికారి పేరు, ఫోన్ నంబరును సిబ్బందికి పంపుతారు. అధికారులు ముందుగా సెక్టార్ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించి సూచనలు చేస్తారు. వాటిని వారు ఆ సెక్టార్‌లోని సిబ్బందికి చెబుతారు.

విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న విశ్వవిద్యాలయం చాన్సలర్, గవర్నర్ అబ్దుల్ నజీర్, చిత్రంలో వీసీ చంద్రశేఖర్ తదితరులు



స్నాతకోత్సవం

ఎన్టీఆర్ వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 27, 28వ స్నాతకోత్సవాన్ని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైద్య విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు పతకాలు, ధ్రువీకరణ పత్రాలను ప్రదానం చేశారు. ప్రజల ఆరోగ్యం వైద్యుల చేతుల్లోనే ఉందని, నూతన మెలకువలు నేర్చుకుంటూ వైద్యరంగాన్ని అగ్రస్థానంలో నిలపాలని పిలుపునిచ్చారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

రైల్వే ఇంజనీరింగ్ విభాగంలో ఇష్టారాజ్యం ● ట్రాక్ మెయింటినెన్స్‌కే సరిపోని సిబ్బంది

రైల్వేలో ఇంజనీరింగ్ విభాగాన్ని సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. విజయవాడ డివిజన్ పరిధిలో ఒక పక్క కొత్తగా ప్రాజెక్టులు చేపడుతున్నారు. మరో పక్క థర్డ్ రైల్ పనులు కొనసాగుతున్నాయి. అయినా అవసరానికి అనుగుణంగా సిబ్బంది మాత్రం ఉండటం లేదు. దీనికి ఇంజనీరింగ్ విభాగంలో కొందరు సూపర్‌వైజర్ల అవినీతే కారణంగా తెలుస్తోంది. అవుట్ సోర్సింగ్ పేరుతో అరకొరగా సిబ్బందిని తీసుకుని, ఎక్కువ మందిని తీసుకున్నట్టు చూపి వారి జీతాలను పక్కదారి పట్టిస్తున్నట్టు సమాచారం. దీంతో ఉన్నవారి మీదనే పనిభారం పడుతోంది.

- మూడో లైన్ అదనపు పనులకు కటకట
- ఉన్న వాళ్లను ఇళ్లల్లో పనిచేయించుకుంటున్న సూపర్ వైజర్లు
- అవుట్ సోర్సింగ్ పేరుతో అవినీతి దందా!

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కొంత కాలంగా విజయవాడ - గూడూరు, విజయవాడ - కాజీపేట సెక్షన్లలో మూడవ లైన్, విద్యుదీకరణ పనులు జరుగుతున్నాయి. ఇవి కాకుండా రెగ్యులర్ మెయింటినెన్స్ పనులు ఉండనే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో రెగ్యులర్ మెయింటినెన్స్ పనులు చేయటానికే ఇంజనీరింగ్ విభాగం.. సిబ్బంది కొరతను ఎదుర్కొంటోంది. మూడోలైన్ పనులకు ఎంత మంది సిబ్బంది అవసరం అవుతారో.. దానికి అనుగుణంగా సిబ్బంది కావాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాల్సిన అధికారులు ఆ పని చేయటం లేదు. రెగ్యులర్ మెయింటినెన్స్ పనులలో కీమెన్,

మిగతా 6లో..

రైల్వే పనుల్లో ఇంజనీరింగ్ సిబ్బంది



జీపీఎస్ ట్రాకింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను పక్కన పెట్టేశారు!

క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి జీపీఎస్ ట్రాకింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను గతంలో ఇచ్చేవారు. జీపీఎస్ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుండటంతో అవినీతి సూపర్ వైజర్స్ బాగోతాలు బయటపడతాయన్న ఉద్దేశ్యంతో వాటికి తెలివిగా ముగింపు పలికారు. జీపీఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సరిగా పనిచేయటం లేదని, పరికరాలు నాణ్యతగా లేవని వాటికి ఉద్వాసన పలికారు.

మొబైల్ అప్లికేషన్ పేరుతో సిబ్బంది వ్యక్తిగత గోప్యతను హరిస్తున్నారు!

రైల్వే ఇంజనీరింగ్ విభాగంలో క్షేత్రస్థాయిలో ట్రాక్ మీద పనిచేసే వారికి పెద్దగా సాంకేతిక పరిజ్ఞానం ఉండదు. వారి దగ్గర స్మార్ట్ ఫోన్లు ఉన్నా.. ఫోన్ల వాడకం తప్ప మిగిలిన వాటి గురించి తెలియని వారు చాలా మంది ఉన్నారు. ట్రాక్ వర్క్ చేస్తున్న వారిని పర్యవేక్షించే పేరుతో.. మొబైల్ యాప్ తయారు చేశారు. ఈ యాప్‌ను వారి ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసి జీపీఎస్‌ను ట్రాక్ చేస్తున్నారు. జీపీఎస్ ట్రాకింగ్ మీద సరైన అవగాహన చాలా మందికి లేకపోవటం వల్ల డ్యూటీలలో లేని సమయాలలో కూడా వారి కదలికలు ఏమిటన్నది సూపర్ వైజర్లు తెలుసుకుంటున్నారు.

గని ఆత్కూరులో తీవ్ర విషాదం

బైక్, మినీ లారీ ఢీకొని దంపతులు మృతి

- ఖమ్మం జిల్లా తక్కెళ్లపాడు వద్ద ఘటన
- కుమారుడి పెళ్లి పనులపై వెళ్తుండగా ఘటన



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భార్యాభర్తలు శ్రీనివాసరావు, రజని

కంచికచర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొన్నది. ఖమ్మం జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన భార్యాభర్తలిద్దరూ దుర్మరణం పాలయ్యారు. గనిఆత్కూరుకు చెందిన దామినేని శ్రీనివాసరావు (57), రజని (51) దంపతులకు ఇద్దరు సంతానం. కుమార్తెకు పెళ్లి కాగా, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఉద్యోగం చేస్తున్న కుమారుడు చందుకు ఇటీవల పెళ్లి సంబంధం కుదిరింది. త్వరలో పెళ్లి చేసేందుకు ఏర్పాట్లలో ఉన్నారు. ఈలోగా ఇంట్లో ఉప్పలమ్మ దేవత కొలుపు కొలవాలనుకున్నారు. ఇందు నిమిత్తం ముహూర్తం కోసం పూజారిని కలిసేందుకు మంగళవారం

మిగతా 6లో..

షేక్ ఖుద్దూస్, షేక్ షారుక్ మృతదేహాలు



ఉసురుతీసిన ఈత సరదా

- మునేరులో మునిగి ఇద్దరు మృతి
- మోగులూరు గ్రామంలో విషాదం

కంచికచర్ల రూరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మునేరులో మునిగి ఇద్దరు మృతి చెందిన ఘటన కంచికచర్ల మండలంలో మోగులూరు గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... మోగులూరు గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ షఫీ కుమారుడు షేక్ ఖుద్దూస్ (24), షేక్ హర్షద్ కుమారుడు షేక్ షారుక్ (19), మరో ఇద్దరితో కలిసి గ్రామంలోని పామాయిల్ తోట సమీపంలో ఉన్న మునేరులో ఈతకు దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో మునిగిపోయారు. దీంతో మిగిలిన ఇద్దరు గ్రామంలోకి వెళ్లి విషయం చెప్పారు. వారు కునికినపాడు గ్రామం నుంచి గజ ఈతగాళ్లను రప్పించి నీటిలో గాలింపు చర్యలు చేపట్టగా, మృతదేహాలు బయట పడ్డాయి. ఏసీ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబానికి అండగా ఉంటున్న ఖుద్దూస్ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

స్టాప్.. సూసైడ్!

- మూడ్‌ను గుర్తిస్తే ఆత్మహత్యను ఆపొచ్చు
- అధికంగా యువతే చనిపోవడంపై ఆందోళన
- నేడు ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం

8



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీ నరసింహారావు

మున్సిపాల్టీలకు ఆదాయం పెంచాలి

» మున్సిపల్ ఆర్డీ నరసింహారావు

గుడివాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉన్న అవకాశాలను వినియోగించుకుని జిల్లాలోని మున్సిపాల్టీలకు మరింత ఆదాయాన్ని పెంచేలా కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ ప్రాంతీయ సంచాలకులు సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, కొన్ని ఆస్తి పన్నుల విషయంలో పన్ను విధింపు తక్కువగా ఉందని, వాటిని సర్వే చేసి సరిచేయాలన్నారు. కొన్నిచోట్ల వివిధ కారణాలతో పన్ను విధించ లేదన్నారు. దీనివల్ల మున్సిపాల్టీలే ఆదాయాన్ని కోల్పోతాయన్నారు. ఆస్తిపన్నుల మొత్తాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటే మున్సిపాల్టీలకు 15 నుంచి 20శాతం వరకు ఆదాయం పెరుగుతుందన్నారు. గుడివాడ మున్సిపాలిటీకే రూ.1కోటి మేర ఆదాయం పెరిగే అవకాశముందన్నారు. ప్రతి వ్యాపారి ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. గడువు ముగిసిన దుకాణాలను వెంటనే లీజులకు ఇచ్చేలా చూడాలన్నారు. నీటి సరఫరా పైపుల లీకులు, బ్లాక్ స్పాట్‌లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రజలే ప్రమాదముందని, ప్రజారోగ్యం విషయంలో అలసత్వం వద్దని హెచ్చరించారు. సమావేశంలో మచిలీపట్నం నగరపాలక కమిషనర్ సీహెచ్ బాపిరాజు, తిరువూరు, నూజివీడు, పెడన, కొండపల్లి, ఉయ్యూరు, జగ్గయ్యపేట, నందిగామ, తాడిగడప మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.



రోగి వాణితో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి వైద్యబృందం

విజయవంతంగా కేన్సర్ రోగికి శస్త్రచికిత్స

» ప్రభుత్వాసుపత్రి వైద్యుల ఘనత

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు రోగి రొమ్ము కేన్సర్ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తిచేశారు. రాజుపేటకు చెందిన వ్యవసాయ కూలి వెంకటేశ్వరరావు భార్య కె.వాణి రొమ్ముకేన్సర్‌తో బాధపడుతూ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షల అనంతరం రెండో దశలో ఉన్నట్టు తేలింది. ఆసుపత్రిలో అధునాతన పరికరాలతో వైద్యబృందం ఆగస్టు 30న మూడున్నర గంటలపాటు క్లిష్టమైన శస్త్రచికిత్సను చేశారు. రోగిని మంగళవారం డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా చికిత్స వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత మీడియాకు వివరించారు. రోగికి ఎడమవైపు రొమ్ములో స్టేజ్-2లో ఉన్న కేన్సర్ కణితిని టీచింగ్ జనరల్ ఆసుపత్రి వైద్యబృందం తొలగించారు. డాక్టర్ ఆశాలత మాట్లాడుతూ, స్టేజ్-2లో ఉండటం వల్ల చికిత్స చేశామని, 3, 4 స్టేజ్‌లో ఉంటే ఆపరేషన్‌కు వీలుకాదన్నారు. వైద్యులను జిల్లా కలెక్టర్ బాలాజీ అభినందించారు.

వలసవెళ్లిన పిల్లలకు సీజన్ హాస్టళ్లు

» 12 లోగా దరఖాస్తులకు ఆహ్వానం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో తొమ్మిది మండలాల్లో కూలిపనులకు తల్లిదండ్రులతో వెళ్లిన పిల్లలకు భోజనం, చదువు చెప్పేందుకు 43 హాస్టళ్లు మంజూరు అయ్యాయని, వీటి నిర్వహణకు స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్టు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఆర్.కుముదినిసింగ్ తెలిపారు. మంగళవారం ఏపీసీ తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సీజనల్ హాస్టళ్లను గిరిజన సంక్షేమ శాఖ, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, స్వయం సహాయక సంఘాలు, రిజిస్టర్ కాబడిన స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. స్వయంసహాయక సంఘాలు ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. అనుబంధశాఖల వారు రాతపూర్వకంగా మెయిల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడేళ్ల అనుభవం గల స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఆడిట్ కాపీలు, బైలా, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, ఐడీలతో తమ ప్రతిపాదనలను ఈనెల 12లోగా సమగ్రశిక్ష కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ 8106653305 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు.

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించండి

» వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు

గాంధీనగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోలు తీవ్ర పని ఒత్తిడి గురవుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్ రవీంద్రరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మీని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం కలిసిన ఆయన వీఆర్వోల సమస్యలను ఆమెకు వివరించారు. సుమోటో క్యాస్ట్ సర్టిఫికెట్లు, హౌస్ సైట్లు, ఎంక్వైరీలు, రేషన్‌కార్డుల పంపిణీ, రీసర్వే, పీజీఆర్ఎస్, ఇతర రెవెన్యూ విధుల విషయంలో వీఆర్వోలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రేడ్-2 వీఆర్వోలు ప్రమోషన్లలో ఎదుర్కొంటున్న సమస్యలు, సర్వే పరీక్ష, సీపీటీ పాస్ అయిన వారి రెగ్యులరైజేషన్ గురించి రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల్లో పెడుతున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. సర్వే ట్రైనింగ్ కానివారికి 15 రోజుల ట్రైనింగ్ ఇచ్చి వెంటనే సర్వే ఎగ్జామ్ నిర్వహించాలన్నారు. సర్వే ఎగ్జామ్‌లో ఫెయిల్ అయిన వారికి సప్లిమెంటరీ ఎగ్జామ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జయలక్ష్మి వెంటనే 15 రోజులు సర్వే ట్రైనింగ్ చేపట్టి, పరీక్షలు కూడా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలిచ్చారని రవీంద్రరాజు పేర్కొన్నారు. సచివాలయంలో కలిసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ పదవిపై ఆచంట సునీత అసంతృప్తి!

» తిరస్కరిస్తున్నట్టు సోషల్ మీడియాలో ట్రోలింగ్

జగ్గయ్యపేట : రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించటంపై రాష్ట్ర తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికార సంస్థ అధ్యక్షురాలు ఆచంట సునీత అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఫేస్‌బుక్‌లో ఘాటుగా స్పందించారు. 'చంద్రబాబును దేవుడిగా భావించి పార్టీకి పనిచేశా.. ఉమ్మడి కృష్ణా తెలుగు మహిళ అధ్యక్షురాలిగా, 2022 నుంచి పార్టీ అనుబంధ విభాగం అంగన్వాడీ, డ్వాక్రా సాధికార సమితి అధ్యక్షురాలిగా ఉన్నా.. ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు.. ఇచ్చిన పదవిని తిరస్కరిస్తున్నా.. ఇకపై కార్యకర్తగా కొనసాగుతా' అని పోస్టు చేశారు. ఇది సోషల్ మీడియాలో అవడంతో పార్టీ అధిష్ఠానం ఫోన్‌లో ఆమెను సంప్రదించగా.. ఏదేని కార్పొరేషన్ చైర్మన్ పదవి ఆశించానని, డైరెక్టర్‌గా నియమించటం ఇబ్బందిగా ఉందని వివరించారు. త్వరలోనే సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు సునీత తెలిపారు.

బూడిద ఉద్యమం ఉధృతం

» కాంట్రాక్టును రద్దు చేసి ఉచితంగా ఇవ్వాలి

» పోస్టర్, కరపత్రాల విడుదల

» టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ ఆందోళన



పోస్టర్ విడుదల చేస్తున్న ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ నేతలు, సభ్యులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బూడిద ఉద్యమం ఉధృతమవుతోంది. బూడిదను ఉచితంగా సరఫరా చేయాలని.. ఇచ్చిన కాంట్రాక్టు రద్దు చేయాలని లోకల్ టిప్పర్, లారీ యజమానుల సొసైటీ ఉద్యమ బాటపట్టింది. బూడిదను ఎన్టీటీపీఎస్ అధికారులు విక్రయించడం ద్వారా లోకల్ ట్రాన్స్‌పోర్టర్ల పొట్టకొడుతున్నారని ధ్వజమెత్తారు. బూడిద చెరువులోని బూడిదను విక్రయించే కాంట్రాక్టును రద్దుచేసి ఏడు గ్రామాల్లో ఉన్న స్థానిక టిప్పర్, లారీ ఓనర్స్‌కు ఎప్పటిలానే ఉచితంగా సరఫరా చేసే వరకు పోరాటం ఆగదని డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీ నేతలు, సభ్యులు స్పష్టం చేశారు. మంగళవారం పశ్చిమ ఇబ్రహీంపట్నంలో కొండపల్లి ఖిల్లా ఘాట్‌రోడ్డులో ఉన్న యూనియన్ కార్యాలయ ఆవరణలో గోడ పత్రికలు, కరపత్రాలను విడుదలచేసి నిరసన తెలిపారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, ఎన్టీటీపీఎస్ అధికారులు ఉచిత బూడిదపై స్పష్టత ఇవ్వడం లేదని అందుకే సంస్థ చేస్తున్న కుయుక్తులను నేరుగా ఎన్టీటీపీఎస్ కాలుష్య ప్రభావిత ప్రాంత ఏడు గ్రామాల ప్రజలకు తెలియజేసేందుకు ఇంటింటికి కరపత్రాలను పంచుతామని, ప్రధాన సెంటర్లలో పోస్టర్లు అంటిస్తామన్నారు. గత 40 ఏళ్లగా ఎన్టీటీపీఎస్ బూడిద చెరువులో బూడిదను ఉచితంగా ఇచ్చి ఇప్పుడు వారి స్వలాభం కోసం టన్ను రూ.3లకు అమ్ముకుంటే టెండర్ దక్కించుకున్న సంస్థ టన్ను రూ.150లకు మాకు అమ్మి మా పొట్ట కొట్టేందుకు సిద్ధమైందన్నారు. ఒకవైపు డీజిల్ ధరలు పెరిగి కిరాయిలు లేక అల్లాడుతుంటే టన్ను బూడిద రూ.150లకు కొనుగోలు చేస్తే మాకేం మిగులుతుందని ప్రశ్నించారు. ఉచిత బూడిదపై ఆధార పడి 400 వాహనాలు 1,000 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఇప్పుడు వారందర్ని రోడ్డున పడేసేలా ఎన్టీటీపీఎస్ యాజమాన్యం నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఉచిత బూడిద ఇవ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. లారీలు కొనుగోలు చేసుకోండి ఉచితంగా బూడిద ఇస్తామని చెబితేనే అప్పుచేసి లారీలు కొనుగోలు చేసుకున్నామన్నారు. ఇప్పుడు మాట తప్పి మా బతుకులు నాశనం చేస్తూ స్వలాభం కోసం ఎన్టీటీపీఎస్ యాజమాన్యం తప్పుడు నిర్ణయాలు తీసుకుందని మండిపడ్డారు. తక్షణం కాంట్రాక్టు రద్దు చేసి ఎప్పటిలానే బూడిదను స్థానిక లారీలకు, టిప్పర్లకు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు.

ఆత్మహత్యలే శరణ్యం

- కోయ వెంకట్రావ్ (సొసైటీ అధ్యక్షుడు)



ఉచిత బూడిద ఇవ్వకుంటే స్థానిక టిప్పర్, లారీ ఓనర్స్ సొసైటీలో చాలామంది ఆత్మహత్యలు చేసుకునేందుకునేందుకు సిద్ధం. ఎన్టీటీపీఎస్ యాజమాన్యం నిరంకుశ వైఖరిని పొల్యూషన్ ప్రభావిత గ్రామాల్లో ఎండగడతాం. అమరావతి ఉద్యమం మాదిరిగా మా ఉద్యమం కొనసాగిస్తాం. మాకు ప్రజాదరణ పెరుగుతోంది. టెండర్ రద్దయ్యే వరకు ఉద్యమం ఆపేది లేదు.

- నమ్మించి మోసం చేశారు

కొండిశెట్టి నాగమల్లేశ్వరరావు, కార్యదర్శి



ఎన్టీటీపీఎస్ యాజమాన్యం నమ్మించి మోసం చేసింది. 30 నుంచి 40 ఏళ్ల నుంచి ఫ్లై యాష్‌ను మాకు ఉచితంగా ఇచ్చి ఇప్పుడు డబ్బులకు కొనుగోలు చేసుకోమనడం ఎంత వరకు న్యాయం. వెంటనే కాంట్రాక్టు రద్దు చేయాలి. ఏడు గ్రామాల ప్రజలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం.

వైసీపీ అన్నదాత పోరు పాక్షికం!

» ఆర్డీవో కార్యాలయాల వద్ద ఆందోళన

» ర్యాలీలకు అనుమతించని పోలీసులు.. స్వల్ప తోపులాట



మచిలీపట్నం, నందిగామలో అన్నదాత పోరు ర్యాలీలో వైసీపీ శ్రేణులు

నందిగామ/ఇబ్రహీంపట్నం/మచిలీపట్నంటౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. మంగళవారం ఉమ్మడి కృష్ణా జిల్లాలో వైసీపీ రైతు పోరుబాట కార్యక్రమం జరిగింది. ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ ఆర్డీవో కార్యాలయం, కృష్ణాజిల్లాలో మచిలీపట్నం ధర్నాచౌక్, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయాల పరిధిలో ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామలో రైతు పోరుబాటకు అనుమతి లేక పోవడంతో పోలీసులు పట్టణంలో అడుగడుగునా బారికేడ్లు పెట్టారు. ఉదయం పది గంటల సమయంలో వైసీపీ నేతలు దేవినేని అవినాశ్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు మొండితోక జగన్మోహనరావు, మల్లాది విష్ణు, జగ్గయ్యపేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, ఇంటూరి రాజగోపాల్(చిన్నా) తదితరుల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ర్యాలీగా తరలివచ్చారు. పోలీసులు అడ్డుకున్నా నెట్టుకొని గాంధీ సెంటర్‌కు చేరుకున్నారు. ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చిన అనంతరం వారు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గాంధీ విగ్రహం వద్ద బైఠాయించి ఆందోళన చేశారు.

అరెస్టు భయం.. నందిగామ వెళ్లని జోగి



నందిగామలో అన్నదాత పోరుబాటకు మాజీమంత్రి జోగి రమేశ్ వెళ్లే సాహసం చేయలేదు. పోరుబాటకు అనుమతి లేదని రోడ్డెక్కితే అరెస్టు చేస్తామని ఇబ్రహీంపట్నం సీఐ ఎ.చంద్రశేఖర్ హెచ్చరికతో జోగి రింగ్‌లో గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చి వెనుతిరిగారు. ఈ క్రమంలో ఒక్క కారు కూడా నందిగామ వైపు వెళ్లలేదు. అనంతరం మీడియా ముందు ఇక రెచ్చిపోయాడు జోగి. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ నేతలపై దూషణపర్వానికి దిగాడు.

కృష్ణా జిల్లాలో పోలీసుల ఆంక్షలను పట్టించుకోక బారికేడ్లు తోసేసి వైసీపీ నేతలు రోడ్లపైకి వచ్చారు. ర్యాలీ అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పేర్ని కిట్టు, ఉప్పాల రాము తదితరులు పాల్గొన్నారు. ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయం వద్ద వైసీపీ జిల్లా అధ్యక్షుడు పేర్నినాని, పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, పెనమలూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. గుడివాడ ఆర్డీవో కార్యాలయంవద్ద దుక్కిపాటి శశిభూషణ్, గన్నవరం, గుడివాడ జడ్పీటీసీ సభ్యులు ఎలిజబెత్‌రాణి తదితరులు పాల్గొన్నారు. ఆర్డీవోలకు వినతిపత్రాలు అందజేశారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

» కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం క్రైమ్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియా విషయంలో ఆందోళన చెందవద్దని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు సూచించారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించాలని ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 3,180 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. పది రోజుల్లో మరో 8,000 మెట్రిక్ టన్నుల వరకు సరఫరా చేస్తారన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, వారి అవసరాలకు తగినట్టు టోకెన్ విధానం ద్వారా సరఫరా కొనసాగుతుందని తెలిపారు. యూరియాను నిల్వచేసినా, అక్రమ రవాణాకు పాల్పడినా, సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలు ప్రచారం చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమాలు గుర్తిస్తే సమాచారాన్ని స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు.

35 సెక్టార్లుగా..

(5వ పేజీ తరువాయి)

భావిస్తున్నారు. వినాయకుడి ఆలయం నుంచి ఇంద్రకీలాద్రి, దాని చుట్టుపక్కల ప్రదేశాలను 35 సెక్టార్లుగా విభజించారు. ఒక్కో సెక్టార్‌లో ఐదారుగురు అధికారులు, సిబ్బందిని నియమిస్తారు.

ఇదీ కమిషనరేట్ స్వరూపం

ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో అధికారుల నుంచి సిబ్బంది వరకు మొత్తం 3,635 మంది ఉన్నారు. వీరిలో కొంతమందిని శరన్నవరాత్రి ఉత్సవాలకు ఉపయోగించాలని నిర్ణయించారు. మిగిలిన వారిని నగరంతోపాటు జిల్లాలో బందోబస్తుకు నియమించాలని భావిస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో ఒక ఐజీ, ఆరుగురు డీసీపీలు, 14 మంది డీఎస్పీలు, ముగ్గురు ఏడీసీపీలు, ఒక ఏఆర్ ఏడీసీపీ, 56 మంది ఏఆర్ ఎస్ఐలు, 29 మంది ఏఆర్ ఏఎస్ఐలు, 29 మహిళా ఏఎస్ఐలు, 111 మంది ఏఎస్ఐలు, ఒక కమాండెంట్, ఇద్దరు ఏఆర్ ఏసీపీలు, 431 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 248 మంది ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు, 13 మంది ఏఆర్ మహిళా హెడ్‌కానిస్టేబుళ్లు, 33 మంది మహిళా హెడ్‌కానిస్టేబుళ్లు, 738 మంది హోంగార్డులు, 121 మంది మహిళా హోంగార్డులు, 55 మంది ఇన్‌స్పెక్టర్లు, 817 మంది కానిస్టేబుళ్లు, 503 మంది ఏఆర్ పీసీలు, 54 మంది ఏఆర్ మహిళా పీసీలు, 196 మంది మహిళా పీసీలు, తొమ్మిది మంది ఏఆర్ ఆర్ఐలు, 37 మంది ఏఆర్ ఆర్ఎస్ఐలు, ఐదుగురు ఏఆర్ మహిళా ఆర్ఎస్ఐలు, 110 మంది ఎస్ఐలు, 42 మంది మహిళా ఎస్ఐలు ఉన్నారు. వాళ్లంతా కలిసి మొత్తం 3,635 మంది వరకు ఉన్నారు. ఇందులో కొంతమందిని జిల్లా, విజయవాడ నగరానికి వదిలిపెట్టి మిగలిన వారిని శరన్నవరాత్రుల బందోబస్తుకు వినియోగించాలని భావిస్తున్నారు. వారు కాకుండా ఉత్తరాంధ్ర, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల నుంచి సిబ్బందిని బందోబస్తుకు పిలిపిస్తున్నారు.

వ్యక్తిపై దాడిచేసి.. కారుతో పరారీ

» బాధితుడు బెజవాడకు చెందిన రియల్ వ్యాపారి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అద్దెకు తీసుకున్న కారులో వ్యక్తిపై ఆరుగురు దాడిచేసి, అతడి వస్తువులు, కారుతో సహా పరారైన సంఘటన విశాఖనగరంలోని ఎంవీపీ స్టేషన్ పరిధిలో జరిగింది. అనారోగ్యం కారణంగా బాధితుడు ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో పోలీసులు తాజాగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ దేముడు నాయుడు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ పాయకాపురం సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన చల్లా కృష్ణంరాజు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి సమీపంలో రియల్ ఎస్టేట్, క్వారీ మైనింగ్ వ్యాపారం చేస్తున్నారు. ఈ నెల 3న విశాఖ వచ్చిన ఆయన ఏపీ 40 హెచ్ఎన్ 6660 నంబరు గల బ్రిజా కారును అద్దెకు బుక్ చేసుకుని, భీమిలి, రుషికొండ వెళ్లి, రాత్రి 10.30 గంటల సమయంలో అప్పుఘర్ వద్దకు చేరేసరికి డ్రైవర్ సిరిగుడి రాజు కారును నిలిపి, పబ్లిక్ టాయిలెట్‌లోకి వెళ్లాడు. అదే సమయంలో ఆరుగురు వ్యక్తులు కారు వద్దకు వచ్చి కృష్ణంరాజుపై దాడి చేసి, అతడి ఐ ఫోన్, విలువైన పత్రాలు, ఇతర వస్తువులు, కారుతో సహా పరారయ్యారు. బాధితుడు తన బంధువు ఆదిత్య సహాయంతో తొలుత కేజీహెచ్, అనంతరం ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. అయితే దాడికి పాల్పడింది కారు డ్రైవర్ సిరిగుడి రాజుకు సంబంధించిన వ్యక్తులేనని, వారిలో మధువంశీ, రామకృష్ణ, మధు బుజ్జి, మధు చైతన్య, మరో ముగ్గురు ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అలల తాకిడికి కొట్టుకుపోయి వ్యక్తి మృతి

బాపట్లరూరల్ : బాపట్ల సూర్యలంక సముద్రతీరంలో అలల తాకిడికి కొట్టుకుపోతున్న ముగ్గురు యువకులను రక్షించబోయి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే హైదరాబాద్ నుంచి సూర్యలంక తీరంలో స్నానాలు ఆచరించడానికి వచ్చిన ముగ్గురు వ్యక్తులు అలల ఉధృతికి సముద్రంలోనికి వెళుతున్న క్రమంలో పక్కనే ఉన్న నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి సాయి అనే వ్యక్తి ఆ ముగ్గుర్ని రక్షించబోయి తన ప్రాణాలకు ముప్పు తెచ్చుకున్నాడు. డ్రోన్ కెమెరాలతో గమనించిన పోలీసులు, గజఈతగాళ్లు కొట్టుకుపోతున్న ముగ్గుర్ని రక్షించగా, సాయి కనిపించకపోవటంతో గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటి సాయి మృతదేహం బయట పడడంతో తోటిస్నేహితులలో విషాదఛాయలు అలుముకున్నాయి. సాయి (23) విజయవాడ పట్టణానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

త్వరలో మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ నిర్మాణం

» ఎంపీ వల్లభనేని బాలశౌరి

» ఢిల్లీలో రైల్వే అధికారులతో సమావేశం

మచిలీపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా ప్రజల చిరకాల వాంఛగా ఉన్న మచిలీపట్నం-రేపల్లె మధ్య నూతన రైలు మార్గం నిర్మాణానికి త్వరలో అనుమతులు వస్తాయని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. ఢిల్లీలో లోక్‌సభ సబార్డినేట్ లెజిస్లేషన్ చైర్మన్ హోదాలో మంగళవారం రైల్వేబోర్డు చైర్మన్ సతీష్‌కుమార్, రైల్వే అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అధికారులతో ఎంపీ మాట్లాడుతూ మచిలీపట్నం-రేపల్లె మధ్య రైలు మార్గం నిర్మాణం చేస్తే కోల్‌కతా-చెన్నైల మధ్య దూరం 70 కిలోమీటర్ల వరకు తగ్గుతుందన్నారు. అలాగే విజయవాడ జంక్షన్‌పై ట్రాఫిక్ భారం కూడా తగ్గుతుందని తెలిపారు. ప్రయాణ సమయం కలిసి రావడంతోపాటు, సరుకుల రవాణా చార్జీలు కూడా తగ్గుతాయని వివరించారు. దీంతో పాటు మచిలీపట్నం పోర్టు నిర్మాణం త్వరలో పూర్తవుతుందని, ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు సరుకుల ఎగుమతులు, దిగుమ తులు తక్కువ ఖర్చుతో చేసే వెసులుబాటు లభిస్తుందని తెలిపారు. నరసాపురం- మచిలీపట్నం- రేపల్లె-నిజాంపట్నం-బాపట్లను కలుపుతూ కోస్టల్ రైల్వే కారిడార్‌ను ఏర్పాటు చేసేందుకు డీపీఆర్‌ను తయారు చేసి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలోని రామవరప్పాడు, గూడవల్లి, తెన్నేరు, పెడన, మచిలీపట్నం, మచిలీపట్నం పోర్టు, మెడికల్ కళాశాల, గుడివాడ తదితర ప్రాంతాలలో రైల్వే ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఆయన ప్రతిపాదన చేశారు. తిరుపతి-మచిలీపట్నం మధ్య మచిలీపట్నం నుంచి ప్రతిరోజు రైలును నడిపేలా అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రతిపాదనలన్నింటికీ రైల్వేబోర్డు అధికారులు అంగీకారం తెలిపినట్లు ఎంపీ బాలశౌరి వివరించారు.



బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆటోల భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆటో, క్యాబ్ కార్మికులు

ఆటో, క్యాబ్ కార్మికులను ఆదుకోండి

» విజయవాడలో ఆటోలతో భారీ ర్యాలీ

సత్యనారాయణపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కారణంగా పూర్తిగా నష్టపోయిన ఆటో, క్యాబ్ కార్మికులకు వాహనమిత్ర పథకం ద్వారా సంవత్సరానికి రూ.25 వేలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్డున పడిన ఆటో, క్యాబ్ కుటుంబాలను ఆదుకోవాలని, వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో విజయవాడలోని బీఆర్‌టీఎస్ రోడ్డు వద్ద మంగళవారం వందలాది ఆటో, క్యాబ్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల సుమారు 10 లక్షల మంది ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిన్నదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. సిటీ ఆటోవర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు మాట్లాడుతూ, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటోల కొనుగోలుకు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా రూ.4 లక్షల రుణాలు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ రేట్లు తగ్గించాలని, జీవో నెం 21 రద్దు చేయాలన్నారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 18న అన్ని మోటార్ కార్మిక సంఘాలతో 'చలో విజయవాడ' నిర్వహించి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ నగర నాయకులు బి.రూబెన్, ఎం.హనుమంతరావు, ఎస్‌డీ కరీముల్లా, ఎస్‌కే దుర్గావళి, డి.కోటయ్య, ఎన్.నాగేశ్వరరావు, పి.చిన్నా, రాఘవ, తిరుపతయ్య, ఉప్పు ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీ

» దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే సరుకులు

» జాయింట్ కలెక్టర్ ఇలక్కియ



వృద్ధురాలికి రేషన్‌కార్డును అందజేస్తున్న జేసీ ఇలక్కియ

వన్‌టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామని, దివ్యాంగులు, 65 సంవత్సరాల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలిపారు. మంగళవారం జేసీ గొల్లపూడిలోని 50వ నెంబర్ రేషన్ దుకాణాన్ని పరిశీలించి దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు, వృద్ధులకు ఇంటివద్దనే నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువులను కార్డుదారులకు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 957 రేషన్ షాపుల ద్వారా 5,90,243 కార్డుదారులకు 8వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. దివ్యాంగులు, 65 ఏళ్ల పైబడిన 57,690 మంది కార్డుదారులను గుర్తించి వారికి ఇంటి వద్దనే సరుకులను అందజేసే ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని రేషన్‌షాపుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి దానిపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నామని, మొబైల్ ఫోన్ ద్వారా దీనిని స్కాన్ చేసి రేషన్ సరఫరాపై కార్డుదారులు తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. డీలర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీఎస్వో ఎ.పాపారావు, ఏఎస్వో చల్లా లక్ష్మీనారాయణ రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పౌరసరఫరాల సిబ్బంది పాల్గొన్నారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత

(5వ పేజీ తరువాయి)

గ్యాంగ్‌మెన్ వంటి సిబ్బంది సేవల అవసరం ఎక్కువగా ఉంటుంది. ట్రాక్ మెయింటెనెన్సర్స్ తగినంత సంఖ్యలో లేకపోవటంతో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఇళ్లల్లో పనులుకు కొందరు..

ఇంజనీరింగ్ సూపర్ వైజర్ల వ్యవహారశైలి వల్ల కూడా పరోక్షంగా తీవ్ర సిబ్బంది కొరతను ఎదుర్కోవాల్సి వస్తోంది. క్షేత్ర స్థాయిలో పని చేయాల్సిన సిబ్బందిలో కొందరిని సూపర్ వైజర్లు తమ ఇళ్లల్లో పనులు చేయించుకుంటున్నారని తెలిసింది. మిగులు సిబ్బందిలో డబ్బులు సమర్పించుకునే వారికి పెద్దగా పనిలేని డ్యూటీలు అంటే వాచ్‌మెన్లుగా వేయటం జరుగుతోంది.

అవుట్ సోర్సింగ్ సిబ్బంది పేరుతో అవినీతి మేత!

ట్రాక్ వెంబడి పనిచేసే సిబ్బంది కొరతను అధిగమించటం కోసం అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తీసుకుంటున్నారు. అవుట్ సోర్సింగ్ విధానం అన్నది సూపర్‌వైజర్స్‌కు కామధేనువుగా మారింది. అవుట్ సోర్సింగ్ విధానంలో తీసుకున్నట్టుగా చెబుతున్న వారందరూ క్షేత్ర స్థాయిలో పనిచేయడంలేదు. సంతకాలు పెట్టుకుని జీతాలను పక్కదారి పట్టిస్తున్నారన్న తీవ్ర ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయి. రైల్వే ట్రాక్ మెయింటెనెన్స్ పనులలో భాగంగా ట్రాక్ మెషీన్లు వచ్చినా కూడా సిబ్బందితోనే పనిపడుతోంది. ఈ ట్రాక్ మెషీన్లు ఒక్కోసారి 21 రోజుల పాటు నిరంతరాయంగా పనిచేస్తుంటాయి. దూర ప్రాంతాలు వెళ్లి అక్కడే ఉండాల్సి వస్తుంది. పనులు లేని సమయంలో కూడా సిబ్బంది వాటి దగ్గరే ఉండాలి. దీంతో సిబ్బందికి తగిన విశ్రాంతి లభించని పరిస్థితి ఏర్పడుతోంది.

గనిఆత్కూరులో తీవ్ర విషాదం

(5వ పేజీ తరువాయి)

ఉదయం భార్యాభర్తలిద్దరూ మోటారు సైకిల్‌పై ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం అయ్యవారిగూడెం బయలుదేరి వెళ్లారు. ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడు గ్రామం వద్ద ఎదురుగా కోళ్ల దాణాతో వస్తున్న మినీ లారీ, మోటారు సైకిల్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భార్యాభర్తలిద్దరూ శ్రీనివాసరావు, రజని అక్కడికక్కడే మృతిచెందారు. గంట వ్యవధిలోనే భార్యాభర్తలిద్దరూ విగతజీవులుగా మారటంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదం గురించి తెలియగానే పలువురు గ్రామస్థులు, బంధువులు ఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లారు. మధిర ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం సాయంత్రం ఇద్దరి మృతదేహాలను స్వగ్రామం తీసుకువచ్చారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135,144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భారతీనగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రింగ్‌రోడ్డు సెక్షన్ పరిధిలోని విద్యుత్ లైన్లు మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల సబ్‌స్టేషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాసనగర్, బ్యాంక్ కాలనీ 6,7,8 రోడ్లు, భారతీనగర్ 10,12 రోడ్లు తదితర ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

సమన్వయంతో పని చేయండి

శాఖాధిపతులతో జరిగిన సమీక్ష సమావేశంలో కమిషనర్ ధ్యానచంద్ర



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర, పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

కార్పొరేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శాఖలన్నీ సమన్వయంతో పని చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం తన చాంబర్‌లో శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంజనీరింగ్ అధికారులు వర్క్స్ డివిజన్, ప్రాజెక్ట్ డివిజన్‌లు సమన్వయం చేసుకొని పనుల్లో జాప్యం లేకుండా పని చేయాలన్నారు. కొండ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సంతృప్తికరంగా లేదన్నారు, దానికి ఒక పరిష్కారాన్ని తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని మరుగుదొడ్లన్నీ పరిశుభ్రంగా ఉండాలన్నారు, ముఖ్య ప్రదేశాలలో మరుగుదొడ్లతో పాటు స్నానపు గదులు కూడా ఉండేటట్టు చూసుకోవాలన్నారు. నగరపాలక సంస్థ ఆస్తులన్నిటిలో ఎటువంటి మరమ్మతులు ఉండరాదని, కళ్యాణ మండపాలు కమ్యూనిటీ హాళ్లు, కర్మల భవనాలు, పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. నగరంలో దోమలు లేకుండా నివారణ చర్యలు కచ్చితంగా తీసుకునేటట్టు చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్యం అధికారులను ఆదేశించారు. అనధికార బ్యానర్లు ఎక్కడ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక విభాగాన్ని ఆదేశించారు. నగరంలో నూతన పార్కులను అభివృద్ధి చేయాలని ఉద్యానవన విభాగం ఇంజనీరింగ్ విభాగం సమన్వయంతో పని చేయాలని అన్నారు. స్ట్రీట్‌వెండర్లు జోనింగ్, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తెలుసుకుని, వారి సమన్వయంతో చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, జోనల్ కమిషనర్లు, సీఈ శ్రీనాథ్ రెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ కె. అర్జునరావు, పర్యవేక్షణ ఇంజనీర్ పి. సత్యకుమారి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, ఈఈలు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

సీతారాం ఏచూరికి ఘననివాళి

పటమట, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి పటమట కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి శ్యాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశ నుంచి ఎస్ఎఫ్ఐలో పనిచేస్తూ అనేక ఉద్యమాలు, పోరాటాలు చేస్తూ సీపీఎంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. అలాంటి అమరవీరులకు నివాళులు అర్పించడం అంటే ఆయన వదిలివెళ్లిన ఆశయాలను అనుసరించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో రాజు, నరసింహారావు, బాబ్జి, ప్రసాద్, మల్లికార్జునరావు, పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్లను యజమానులకు అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ సిబ్బంది

మొబైల్ ఫోన్ల రికవరీలో ఆర్‌పీఎఫ్ ముందంజ

రైల్వేస్టేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఏప్రిల్ 3న సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌ను ప్రారంభించిన తరువాత సౌత్‌సెంట్రల్ రైల్వే ఆర్‌పీఎఫ్ ఆపరేషన్ అమానత్ కింద మొబైల్ ఫోన్ల రికవరీలో ముందంజలో ఉంది. సాంకేతికత సహాయంతో ఆర్‌పీఎఫ్ సైబర్ సెల్ రైల్ మదద్ ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల ఆధారంగా రికవరీలు ఘనసీయంగా జరుగుతున్నట్లు సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెలికమ్యూనికేషన్ డిపార్టుమెంట్ ఏర్పాటు చేసిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైళ్లలో ట్రాకింగ్, బ్లాకింగ్ వంటి సదుపాయాలను వినియోగించుకుంటున్నారు. ఇప్పటి వరకు 125 ఫిర్యాదులు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజన్ల నుంచి వచ్చాయి. వీటిలో 96 మొబైల్ ఫోన్స్‌కి సంబంధించినవే ఉన్నాయి. వాటిని సైబర్ సెల్ బ్లాక్ చేసింది. 34 డివైజ్‌లను గుర్తించారు. వాటిలో 9 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. వాటిని యజమానులకు అందించటం కూడా జరిగింది. 13 మొబైల్ ఫోన్లు ఇప్పటికే ఆర్‌పీఎఫ్ దగ్గర ఉండగా వాటిని యజమానులకు అప్పగించే ప్రయత్నం జరుగుతుంది. సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆర్‌పీఎఫ్ బృందాన్ని అభినందిస్తూ ఆర్‌పీఎఫ్ సైబర్ సెల్ కీలకమైన విభాగంగా మారిందన్నారు.

17న 'నిరుద్యోగి ఆవేదన' సదస్సును జయప్రదం చేయాలి

ఏఐవైఎఫ్ ప్రధానకార్యదర్శి రాజేంద్రబాబు

గాంధీనగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 17న జరగనున్న 'నిరుద్యోగి ఆవేదన' సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సులో నిరుద్యోగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. స్థానిక ధాసరిభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని కోరుతున్నా కూటమి ప్రభుత్వం ఏడాదిన్నరగా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్, నగర సహాయకార్యదర్శి సింగంశెట్టి మోహన్ ప్రసాద్, సిరం రవికుమార్, షైనీ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పాటు ఎంపీడీవో స్వర్ణలతను సత్కరిస్తున్న డీవైఈవో రవికుమార్

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి

గన్నవరం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు తరగతి గదికి వెళ్లినప్పుడు విద్యార్థులను చూడగానే తమ పిల్లలు వారిలో కనిపించినప్పుడే ఉత్తమ బోధన అందిస్తారని గుడివాడ డీవైఈవో కొండా రవికుమార్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఉత్తమ అవార్డులు అందుకున్న కె.కుమార్‌బాబు, జ్ఞానేష్, రత్నకుమారి, సరళతో పాటు ఏపీడీగా పదోన్నతి పొందిన ఎంపీడీవో టి.స్వర్ణలతను మంగళవారం స్థానిక విద్య వనరుల కేంద్రంలో జరిగిన హెచ్ఎంల సమావేశంలో ఘనంగా దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, అవార్డు పొందటంతో బాధ్యత మరింత పెరిగినట్లు భావించాలని ఆ దిశగా విద్యార్థులకు అర్థవంతమైన బోధన చేయటంతో పాటు ఆ పాఠశాలని కూడా అందరి సహకారంతో అభివృద్ధి చేయాలని చెప్పారు. ఎంఈవో-2 ఆర్.కమల, యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి దేవరపల్లి విద్యాసాగర్, హెచ్ఎంలు కెఎస్ జగదీశ్వరరావు, ఎస్.నాగవేణి, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం నియామకం

మాచవరం శ్రీదాసాంజనేయస్వామి దేవస్థానానికి



నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

వన్‌టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ మాచవరం శ్రీదాసాంజనేయస్వామి దేవస్థానానికి నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నూతన పాలకవర్గంలో చోడిశెట్టి కృష్ణప్రసాద్ (జనసేన), ఎ.కృష్ణాజీ (జనసేన), ఎం.ధనలక్ష్మి (టీడీపీ), కె.దుర్గారావు (టీడీపీ), మద్దాల రుక్మిణీబాయమ్మ (టీడీపీ), ఎన్.వి.వి. సత్యవరప్రసాద్ (టీడీపీ), టి.వెంకటేశ్వరరావు (టీడీపీ), పి.భాగ్యలక్ష్మి (టీడీపీ), ఎల్.దుర్గ (టీడీపీ), ఎ.శ్రీకాంత్ యాదవ్ (టీడీపీ), బి.రత్నకుమారి (బిజేపీ), ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దేవస్థానం అర్చకుడు జి.వెంకటాచార్యులను నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం నూతన పాలకవర్గం చైర్మన్‌గా చోడిశెట్టి కృష్ణప్రసాద్‌ను ఎన్నుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది. త్వరలో నూతన పాలకవర్గం కమిటీ దేవస్థానంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే అభినందనలు

అజిత్‌సింగ్‌నగర్: మాచవరం దాసాంజనేయ స్వామి దేవస్థానం నూతన పాలకవర్గాన్ని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మంగళవారం అభినందించారు. అజిత్ సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో నూతన పాలక మండలి సభ్యులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొండా ఉమా కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమలో ఆలయ కార్యనిర్వాహణాధికారిణి లోకేశ్వరి, నేతలు ఘంటా కృష్ణమోహన్, నవనీతం సాంబశివరావు, పిరియా సోమేశ్వరరావు, దాసరి కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు వంతెనతో అవస్థలు

● నిత్యం రద్దీగా కనకదుర్గానగర్ రోడ్డు
● ట్రాఫిక్ స్తంభన



ఇరుకుగా మారిన కనకదుర్గానగర్ వంతెన, ట్రాఫిక్‌తో నిలిచిన వాహనాలు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: అసలే ఇరుకు రోడ్డు దానికి తోడు ఇరుకుగా మారిన వంతెనతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మూడో డివిజన్ పరిధిలోని కరెన్సీనగర్ కాలనీలోని బాయన బాబూజీ రోడ్డు నుంచి కనకదుర్గా నగర్ వెళ్లడానికి మురుగుకాలువపై వంతెన నిర్మించారు. ప్రస్తుతం ఏలూరు జాతీయ రహదారి, సర్వీస్ రోడ్డుపై నిత్యం వాహనాలతో రద్దీ ఎక్కువగా ఉండడంతో కరెన్సీనగర్ కాలనీలోని బాయన బాబుజీ రోడ్డు, కనకదుర్గానగర్ కాలనీ ప్రధాన రోడ్డు ప్రత్యామ్నాయంగా మారాయి. వాహనదారులు బల్లెం వారి వీధి గుండా బాయన బాబూజీ రోడ్డులో ప్రవేశించి హైటెన్షన్ రోడ్డులోకి, కనకదుర్గానగర్ మెయిన్ రోడ్డులో చేరుకుంటారు. ఇక్కడ నుంచి మహానాడు రోడ్డు, ఆటోనగర్, భారతీనగర్, గురునానక్, పటమట, బందర్ రోడ్డుకు వెళ్లే వాహనదారులు కనకదుర్గానగర్ మెయిన్ రోడ్డును ఉపయోగిస్తున్నారు. దీంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఈరోడ్డుకి వెళ్లే మొదట్లో పంట కాలువపై నిర్మించిన వంతెన ఇరుకుగా మారింది. వాహనాల రద్దీకి ఇక్కడ తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి తమ సమస్య గుర్తించి వంతెనను వెడల్పు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

కరెన్సీ నగర్ కాలనీలో పలు విద్యాసంస్థలు ఉండడంతోపాటు పలువురు రాజకీయనేతలు, అధికారులు ఉన్నారు. దీంతో వారి కోసం వచ్చే వారితో ఉదయం, సాయంత్రం వేళ్లలో వాహనాల రద్దీ ఉండడంతో ట్రాఫిక్ నిలిచిపోతుంది.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం, అతిథులు

అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్‌ను ఉద్యమంగా భావించాలి

పెనమలూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్ 2025 కేవలం పోటీ మాత్రమే కాదని, ఇదొక ఉద్యమంగా భావించాలని గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కార్యక్రమ పోస్టరును అతిథులు, యాజమాన్య ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్ 2025 అనేది సీఎం చంద్రబాబుతో ప్రారంభించిన ఏపీఎస్‌సీహెచ్‌ఈ ఆధ్వ ర్యంలో నడిపిస్తున్న ఒక విప్లవాత్మక జాతీయ క్వాంటమ్ టెక్నాలజీల రంగంలో విద్యార్థుల ఆధారిత ఆవిష్కరణలకు తలుపులు తెరవడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, డీన్లు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

కోడింగ్, ప్రోగ్రామింగ్ స్కిల్స్‌పై శిక్షణ

ఉంగుటూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కోడింగ్ అండ్ ప్రోగ్రామింగ్ స్కిల్స్, ఎథికల్ హ్యాకింగ్ అండ్ సెక్యూరిటీ టెస్టింగ్‌పై పట్టుసాధించిన విద్యార్థులకు పారిశ్రామిక, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విస్తృతమైన అవకాశాలున్నాయని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఏపీకి చెందిన రిసోర్స్ పర్సన్లు ఎన్.సత్యకృష్ణ, ఈ. భాస్కర్ సంతోష్‌లు అన్నారు. మండలంలోని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, ఏఐ విభాగం ఆధ్వర్యంలో 3, 4వ సం. విద్యార్థులకు కోడింగ్ అండ్ ప్రోగ్రామింగ్ స్కిల్స్, టెక్ ఆఫ్ ది ఎరా హ్యాండ్స్ ఆన్ టెక్నిక్స్ ఫర్ ఎథికల్ హ్యాకింగ్ అండ్ సెక్యూరిటీ టెస్టింగ్ అనే అంశాలపై మంగళవారం రెండు బ్యాచ్‌లుగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కోడింగ్ ప్రాముఖ్యత, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు ఎలా అభివృద్ధి చేసుకోవాలి, సైబర్ బెడద నుంచి డిజిటల్ సిస్టమ్స్‌ను రక్షించడంలో ఎథికల్ హ్యాకింగ్ అండ్ సెక్యూరిటీ టెస్టింగ్ పాత్ర తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్‌లు శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి విద్యార్థులతోపాటు ఏఐ విభాగం హెడ్ కేపీఎన్‌వీ సత్యశ్రీని అభినందించారు.

తాకట్టు వ్యాపారికి టోకరా

పాయకాపురం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నకిలీ బంగారం తాకట్టు పెట్టి వ్యాపారిని మోసగించిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం తోట పద్మావతి ప్రకాష్‌నగర్ ప్రాంతంలో నగల తాకట్టు వ్యాపారం నిర్వహిస్తుంది. నాలుగు నెలల క్రితం వాంబేకాలనీ ప్రాంతానికి చెందిన గుమ్మడి విజయలక్ష్మి అనే మహిళ ద్వారా శైలజ, నవీన్ అనే ఇద్దరు పద్మావతి వద్ద దఫదఫాలుగా నగలు తాకట్టు పెట్టి రూ. 6 లక్షలు తీసుకున్నారు. ఇటీవల తాకట్టు పెట్టుకున్న నగలు గిల్టునగలని తెలియడంతో నగల వ్యాపారి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం

వన్‌టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు మంగళవారం కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం రాణిగారితోటలోని రివర్ వ్యూ పార్క్ సమీపంలోని కృష్ణానదిలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం తెలియజేశారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చి పరిశీలించారు. మృతదేహం వద్ద ఎటువంటి గుర్తింపు ఆధారాలు లేకపోవటంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడికి గాయాలు

ఆటో ఢీకొని కర్ణాటకకు చెందిన ముల్పూరి శివాజీరావు (78) తీవ్రంగా గాయపడ్డాడు. శివాజీరావు గొల్లపూడి పంటకాలువ రోడ్డులో ఉన్న పెద్ద కుమార్తె వద్దకు ఇటీవల వచ్చాడు. ఇతను సోమవారం కరెన్సీనగర్‌లో ఉన్న రెండో కుమార్తె వద్దకు బైక్ పై వెళుతుండగా దర్గా సెంటర్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు భవానీపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ పై కేసు నమోదు చేశారు.

ఆటిజం పిల్లలకు సెన్సరీ గార్డెన్‌తో మేలు

● జిల్లా సెషన్స్ జడ్జి జి. ప్రతిభాదేవి



సెన్సరీ గార్డెన్ ప్రారంభిస్తున్న ప్రతిభాదేవి, తదితరులు

పటమట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మానసిక ఎదుగుదల లేని పిల్లలకు (ఆటిజం) సెన్సరీ గార్డెన్ ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా సెషన్స్ జడ్జి ఆంధ్రప్రదేశ్ లా సెక్రటరీ జి.ప్రతిభాదేవి పేర్కొన్నారు. రోజ్ సొసైటీ వారి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్ (డీఈఐసీ) బాలల సంపూర్ణ రక్షా ఆరోగ్యం కింద పాత గవర్నమెంట్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సెన్సరీ గార్డెన్‌ను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఇటువంటి సెన్సరీ గార్డెన్‌ను విజయవాడలో ఏర్పాటు చేయడం ప్రథమమని నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈ గార్డెన్‌లో వైద్యానికి సంబంధించిన వివిధ రకాలైన మొక్కలు, ఆక్సిజన్ అందించే మొక్కలు, సెన్సరీ ఇంటిగ్రేషన్ థెరపీలో భాగంగా ఈ గార్డెన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.మాధవి, పీడీయాట్రిషన్ రవితేజ, సొసైటీ ప్రెసిడెంట్ ఉషారాణి, సెక్రటరీ లక్ష్మీ, ట్రెజరర్ ఎస్ఆర్ స్వామి, పూర్వపు ప్రెసిడెంట్ సీతామహాలక్ష్మీ, సభ్యులు, తులసి, రత్నలక్ష్మీలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

● గద్దె క్రాంతికుమార్

పటమట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం 15 నెలల కాలంలోనే సంక్షేమం, అభివృద్ధి అనే రెండు రెక్కలతో ఆంధ్రప్రదేశ్‌కు సరికొత్త దిశను చూపుతుందని టీడీపీ యువనేత గద్దె క్రాంతికుమార్ పేర్కొన్నారు. మంగళవారం అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు ఉన్నా సంక్షేమాన్ని ఆపకుండా ముందుకు సాగుతున్న కూటమి పాలన వల్ల ప్రజలకు సంతోషం కలుగుతుందన్నారు. సుపరిపాలనతో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త బ్రాండ్ ఇమేజ్ తెచ్చే విధంగా కూటమి ప్రభుత్వం పరుగులు పెడుతుందని క్రాంతికుమార్ పేర్కొన్నారు.



స్టాప్.. సూసైడ్..!

ప్రపంచ వ్యాప్తంగా ఏటా పెరుగుతున్న ఆత్మహత్యలు

- మూడ్‌ను గుర్తిస్తే ఆత్మహత్యను ఆపొచ్చు
- దేశంలో ఏటా సుమారు 2 లక్షల ఆత్మహత్యలు
- అందులో యువతే అధికంగా ఉండటం ఆందోళన కలిగించే అంశం
- నేడు ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం

దేశంలో బలవన్మరణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఐదేళ్లలో 30శాతం పెరిగినట్టు నివేదికలు చెబుతున్నాయి. కుటుంబ కలహాలు, ప్రేమించినవారు దక్కలేదని, పరీక్ష తప్పామని, ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగం లేదని, పంట పోయిందని, గిట్టుబాటు ధర రాలేదని ఇలా పలు కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచుతున్నారు. ఇలా అర్ధాంతరంగా లోకాన్ని విడిచిపోతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. చిన్నచిన్న కారణాలకే ప్రాణాలు వదిలేస్తున్న ఘటనలు పెరుగుతుండడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యకు కారణాలను విశ్లేషిస్తే హాస్యాస్పదంగా అనిపించేలా ఉంటున్నాయి. ముఖ్యంగా ఆత్మహత్యలకు పాల్పడేవారిలో యువతే ఎక్కువగా ఉండడం ఆందోళనకరం. ఇలా ఆత్మహత్యకు పాల్పడుతున్న వారిలో కొన్ని లక్షణాలుంటాయని, వాటిని ముందుగానే గుర్తిస్తే ప్రాణాలతో కాపాడవచ్చని నిపుణులు చెబుతున్నారు. వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తే ఆ ఆలోచనల నుంచి బయటపడేవచ్చని వైద్యులు వెల్లడించారు. నేడు ఆత్మహత్య నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం - విజయవాడ, ఆంధ్రజ్యోతి

ప్రపంచ వ్యాప్తంగా ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుత తరం యువత ప్రతి చిన్న విషయానికి ఆత్మహత్యకు పాల్పడుతోంది. వీటిని నివారించే ఉద్దేశంతో 2003 నుంచి ఏటా సెప్టెంబరు 10న ఆత్మహత్య నివారణ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రివెన్షన్ (ఐఏఎస్‌పీ) ఏటా భిన్నమైన కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. "చర్చల ద్వారా ఆశ కల్పిద్దాం" అనే థీమ్‌తో మూడేళ్లుగా ఆత్మహత్యలపై అవగాహన కల్పించే చర్యలు చేపడుతున్నారు. సమస్యలతో బాధపడుతూ మానసికంగా బలహీనమయ్యాకే ఆత్మహత్య కు పాల్పడతారని వైద్య నిపుణులు చెబుతున్నారు. అనవసర విషయాల కు ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళన కలిగించే అంశమని, సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని మానసిక వైద్యులు పేర్కొన్నారు.



యువతే ఎక్కువ

ప్రపంచంలో ఏటా ఏడున్నర నుంచి 8 లక్షల మంది ఆత్మహత్యకు పాల్పడితే ఒక్క భారత్‌లోనే 1.80 లక్షల నుంచి 2 లక్షల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. వీరిలో ఎక్కువగా యువతే. నేషనల్ క్రైం రికార్డ్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ప్రకారం 2022లోనే సుమారు 13వేల మంది యువత ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతి ఏడాది ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. రికార్డుల్లో నమోదవ్వని వివరాలు ఇంతకంటే ఎక్కువే. దేశంలో సగటున 3 నిమిషాల్లో ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నట్టు నివేదికలు చెబుతున్నాయి.

మూడు రకాల కారణాలు

ఆత్మహత్యకు పాల్పడేవారిలో మూడు రకాల కారణాలుంటాయి. మొదటిది జన్యుపరంగా సంక్రమిస్తుంది. కుటుంబంలో రెండు, మూడు తరాల్లో ఎవరైనా ఆత్మహత్య చేసుకున్నట్టయితే వారసుల్లో ఆత్మహత్య చేసుకునే ఆలోచన ప్రస్తుత తరానికి 8-10 రెట్లు పెరుగుతుంది. ఈ ప్రక్రియలో ముందుతరం వారికంటే వారి బిడ్డలు, మనవళ్లలో ఆందోళన, ఒత్తిడి ఎక్కువై ఆత్మహత్య పాల్పడేలా ప్రేరేపిస్తుంది. పెరిగిన వాతావరణం కూడా ఆత్మహత్యకు కారణమవుతుంది. దీర్ఘకాలిక వ్యాధులతో, నొప్పులు భరించలేనివారు, ఎక్కువకాలం కుటుంబంపై ఆధారపడుతున్నామనే భావనలో ఉండడం ఆత్మహత్యకు కారణాలుగా ఉన్నాయి, వీటన్నిటికి ఒకే కారణం మెదడులోని సెరటోనిన్ అనే రసాయనం తగ్గడం. దీంతో ఒత్తిడి, ఆందోళనకు గురై ఆత్మహత్యకు పాల్పడుతున్నారని చెబుతున్నారు.

ఆత్మహత్యకు పాల్పడేవారిని గుర్తించడమెలా?

ఆత్మహత్యకు పాల్పడాలనే ఆలోచన కలిగిన వారు అప్పటివరకు బాగానే ఉన్నప్పటికీ ఆలోచన కలిగిన తర్వాత ఒంటరిగానే ఉండానికి ఇష్టపడతారు. వారివద్ద ఉన్న విలువైన వస్తువులను ఎవరూ అడగకుండానే ఇచ్చేయడం, వేదాంతాలు మాట్లాడడం, పక్కనున్నవారు ఏం చెప్పినా, అడిగినా పోతేపోనీ లాంటి సమాధానాలు రావడం, నేను పోతే ఏం అవుతుందిలే వంటి మాటలు వచ్చినవారు ఆత్మహత్య ఆలోచనతో ఉన్నట్టు గుర్తించాలి. ఇలాంటి వారిని గుర్తించి మానసిక వైద్యుల వద్దకు తీసుకువస్తే ఈ ఆత్మహత్యలను నివారించవచ్చు

ఒంటరిగా వదలకూడదు
రాఘవేంద్రరావు, సైకాలజీ హెచ్‌ఓడీ, జీజీహెచ్



ఆత్మహత్య ఆలోచన ఉన్నవారిని గుర్తించి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా వదలకూడదు. ఆ ఆలోచన ఉన్నవారు తప్పించుకోవాలని ప్రయత్నిస్తారు. అలాంటివారిని విడిచిపెట్టకుండా ఉండడంతో పాటు వీలైతే నలుగురిలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నించాలి. తర్వాత వెంటనే మానసిక నిపుణులను సంప్రదించాలి. ఈ ఏడాది 'చర్చల ద్వారా ఆశ కల్పిద్దాం' అనే థీమ్‌తో ఆత్మహత్య నివారణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఆత్మహత్య మాట్లాడకూడని విషయం కాదు, మానసిక ఆందోళన ఉన్నవారే ఆత్మహత్య చేసుకుంటారనేది అపోహ, దీనికి ట్రీట్‌మెంట్ లేదు అనే అపోహ.. లాంటి అంశాలు ఈ ఏడాది థీమ్‌లో ఉన్నాయి. ఈ థీమ్‌లతో ప్రజలకు ఆత్మహత్యపై అవగాహన నిర్వహిస్తున్నాం.



రఘుపతి వెంకయ్య చిత్రం కింద ఉన్న పేరును తొలగించిన అధికారులు

రఘుపతి వెంకయ్య చిత్రం కింద ఉన్న పేరు తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాల కింద ఉన్న పేర్లలోని తప్పిదాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన వార్తకు ఆర్టీసీ అధికారులు స్పందించారు. అది తోటనరసయ్య చిత్రం కాదు అనే శీర్షికతో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. ఎట్టకేలకు ఆర్టీసీ బస్టాండ్‌లో ని రెండు చిత్రపటాల కింద ఉన్న పేర్లు రఘుపతి వెంకయ్య చిత్రపటాలని, తోట నరసయ్య చిత్రపటాలు కాదని గుర్తించారు. దీంతో రఘుపతి వెంకయ్య చిత్రపటం కింద ఉన్న తోట నరసయ్య పేరును తొలగించారు. అయితే దక్షిణాదిన చలనచిత్ర పితామహుడు రఘుపతి వెంకయ్య చిత్రం కింద ఉన్న పేరును రాయాల్సి ఉంది. అలాగే రెండో చిత్రాన్ని తోట నరసయ్య చిత్రంగా మార్చాల్సి ఉంది. ఏది ఏమైనా మచిలీపట్నం బస్టాండ్‌లోని స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి.

జాతీయ సాఫ్ట్ టెన్నిస్ జట్టుకు అనూష ఎంపిక



లబ్బీపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఎస్ అనూష భారత సాఫ్ట్ టెన్నిస్ జట్టుకు ఎంపికైనట్టు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీ దిలీప్ కుమార్ తెలిపారు. కొరియాలో ఈ నెల 13 నుంచి 23 వరకు జరగనున్న 9వ ఏషియన్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌కు అనూష భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికూ ఏషియన్ గేమ్స్, వరల్డ్ చాంపియన్ షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించినట్టు తెలిపారు. అనూషను రాష్ట్ర అధ్యక్షుడు వీ శ్రీనుబాబు, కోశాధికారి టీ నీరజ శుభాకాంక్షలు తెలిపారు.

ఆంధ్ర ఉమెన్ టీ20 క్రికెట్ లీగ్
విజేత విజయవాడ బ్లాస్టర్స్

- ఫైనల్‌లో రాయలసీమ రాణీస్‌పై ఘనవిజయం

విజయవాడ స్పోర్ట్స్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ మైదానం వేదికగా 2 నుంచి 9 వరకు నిర్వహించిన ఆంధ్ర ఉమెన్ టీ-20 క్రికెట్ లీగ్ 2025 విజేతగా విజయవాడ బ్లాస్టర్స్ జట్టు నిలిచింది. మంగళవారం జరిగిన ఫైనల్‌లో రాయలసీమ రాణీస్‌తో తలబడిన విజయవాడ బ్లాస్టర్స్ జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించి టోర్నీ విజేతగా నిలిచింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన విజయవాడ బ్లాస్టర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేయగా జట్టు బాటర్లలో కెప్టెన్ మేఘన 49 పరుగులు, మహంతి శ్రీ 37 పరుగులు, రంగ లక్ష్మి 33 పరుగులు చేసి జట్టు గౌరవప్రదమైన స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించారు. అలాగే రాయలసీమ రాణీస్ బౌలర్లలో మాయస్పార్ అంజుమ్ 3 వికెట్లు తీయగా ధరణి జోషి, భార్గవి లక్ష్మి చెరో వికెట్ తీసుకున్నారు. అనంతరం 166 పరుగులు విజయ లక్ష్యంతో బరిలో దిగిన రాయలసీమ రాణీస్ జట్టులో గ్రీష్మ 55 పరుగులు మాయస్పార్ అంజుమ్ 53 పరుగులు తప్ప ఇతర బ్యాటర్లు రాణించకపోవడంతో నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి విజయ లక్ష్యానికి 13 పరుగుల దూరంలోనే నిలిచిపోయారు. విజయవాడ బ్లాస్టర్స్ బౌలర్లలో రిషిక కృష్ణన్ 3 వికెట్లు, బీ అనూష ఈ, మేఘన ఒక వికెట్ తీశారు.

రెండు విడతల డీఏ ప్రకటించాలి

- డెమొక్రటిక్ పీఆర్‌యూ



గవర్నర్‌పేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దసరా కానుకగా ఉపాధ్యాయులకు రెండు విడతల డీఏ ప్రకటించాలని, ప్రతి ఏడాది సంప్రదాయంగా వస్తున్న పద్ధతిలోనే ఈ నెల 22 నుంచి అక్టోబరు 3 వరకు పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించాలని డెమొక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డీ శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక సంఘ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22న ప్రారంభమౌతున్నాయని, దీనికి భిన్నంగా ఈనెల 24 నుంచి సెలవులు ప్రకటించడం భావ్యం కాదన్నారు. పండుగ సందర్భంగా దూర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు సౌకర్యార్థం దసరా తరువాత రోజు వరకు సెలవులు ప్రకటించాలని కోరారు. సంఘ నేతలు పీ నాగరాజు, కోట సుందర్‌రావు, ఈ వెంకటరెడ్డి, ఏ శ్రీనివాస్, ఎం నాగేంద్ర పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవ్‌కు రండి..!

- యోగా గురువు రామ్‌దేవ్ బాబాకు ఎంపీ కేశినేని శివనాథ్ ఆహ్వానం

వన్‌టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఎంపీ కేశినేని శివనాథ్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, యోగా గురువు రామ్‌దేవ్ బాబా మంగళవారం యాదృచ్ఛికంగా ఒకరినొకరు కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) విజయవాడ సాంస్కృతిక వైభవం దేశమంతా చాటిచెప్పేలా నిర్వహించనున్న విజయవాడ ఉత్సవ్ గురించి రామ్‌దేవ్ బాబాకు వివరించి విజయవాడ రావాల్సిందిగా కోరారు. దీనికి రామ్‌దేవ్ బాబా సానుకూలంగా స్పందించటమే కాక విజయవాడ ఉత్సవ్ జరిగే ఆ 11 రోజుల్లో ఒకరోజు తప్పకుండా వస్తానన్నారు. సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ సారథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ ఉత్సవ్‌ను ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. దసరా ఉత్సవాలకు మరింత వన్నె తెచ్చేలా సంస్కృతీ సంప్రదాయాలు, ఆధ్యాత్మికత కలిసి పర్యాటకులతో పాటు భక్తులు, ప్రజలను అలరించేలా విజయవాడ ఉత్సవ్ ఉంటుందని వివరించారు. ఎంపీ కేశినేని శివనాథ్ వివరించిన అంశాలను రామ్‌దేవ్ బాబా చాలా ఆసక్తిగా ఆలకించారు.



ఢిల్లీ ఎయిర్‌పోర్టులో కలుసుకున్న యోగా గురువు రామ్‌దేవ్ బాబా విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్



జి.కొండూరులో డ్రోన్‌లో నానో యూరియా కలుపుతున్న తీరును పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్

యూరియా కొరత లేదు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ

జి.కొండూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని రైతుల అవసరం మేరకే యూరియా, ఇతర ఎరువులు తీసుకువెళ్లి ఉపయోగించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జీ లక్ష్మీశ సూచించారు. మంగళవారం ఆయన ఎన్టీఆర్ జిల్లాలోని జి.కొండూరు, మైలవరం, రెడ్డిగూడెం, గంపలగూడెం, విస్సన్నపేట మండలాల్లో వి స్తృతంగా పర్యటించారు. డ్రోన్స్ ద్వారా వరి పైరుపై నానో యూరియా పిచికారీ విధానాన్ని పరిశీలించారు. పలుచోట్ల రైతులకు చేస్తున్న యూరియా పంపిణీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు ఎరువుల వినియోగం విషయంలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలన్నారు. మొదటి, రెండో, మూడో విడతలో ఎంత మోతాదు వాడాలో తెలుసుకోవాలన్నారు. నానో యూరియా ప్రయోజనాలేమిటి, ఎలా వాడాలనే విషయాలపై మూడు రోజులుగా ఇంటింటికీ అధికారులు, సిబ్బంది వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో 32 డ్రోన్స్ ద్వారా స్ప్రేయింగ్ డెమో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నిరంతరం ఎరువుల రవాణా, సరఫరాపై పర్యవేక్షణ చేస్తున్నట్టు చెప్పారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులకు ఎరువులను అందిస్తున్నట్టు చెప్పారు. ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే
నిరవధిక సమ్మె

- ప్రైవేటు డిగ్రీ కాలేజీల సంఘాల ప్రకటన

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కాలేజీలకు ఫీజుల బకాయిలు, ఇతర సమస్యలను పది రోజుల్లో పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని, నిరవధికంగా కాలేజీలను మూసివేస్తామని ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘాలు ప్రకటించాయి. రెండు ప్రధాన సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రమణాజీ, సి.విజయభాస్కర్ రెడ్డి, పి.జయరాం, పి.పెద్దిరాజు మంగళవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా డిగ్రీ కోర్సులకు కొత్త ఫీజులు ఖరారు చేయాలని, డిగ్రీ కోర్సులకు ఫీజులు నిర్ణయించే అధికారం ఉన్నత విద్య కమిషన్ నుంచి యూనివర్సిటీల పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఇంకా పలు డిమాండ్లు పేర్కొన్నారు.

కండక్టర్ ఎస్‌ఆర్, డబ్బుల బ్యాగ్ చోరీ

- పీఎన్‌బీఎస్‌లో ఘటన
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



సీసీ కెమెరాలో దొంగతనం దృశ్యాలు

బస్‌స్టేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో గుడివాడ డిపో పల్లెవెలుగు బస్సు కండక్టర్ కేఎం రెడ్డి వద్ద ఎస్‌ఆర్, డబ్బులు బ్యాగ్‌ను ఇద్దరు యువకులు అపహరించిన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అ దుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. స్థానిక బస్‌స్టేషన్‌లోని గుడివాడ డిపో ప్లాట్‌ఫారం వద్ద చైర్‌లో పల్లెవెలుగు బస్సు కండక్టర్ కేఎం రెడ్డి కూర్చొన్నాడు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ఆయన వెనుక నుంచి వచ్చారు. ఒక వ్యక్తి ఆయనతో మాట్లాడుతున్నట్టు నటించగా, మరో వ్యక్తి ఆయన వెనుక నుంచి కండక్టర్ ఎస్‌ఆర్, క్యాష్‌బ్యాగ్‌ను చాకచక్యంగా తీసుకుని వెళ్లిపోయాడు. కండక్టర్‌తో మాట్లాడుతున్న యువకుడు కూడా వెళ్లిపోయాడు. తర్వాత కండక్టర్ తన ఎస్‌ఆర్, క్యాష్ బ్యాగ్‌ను చూడగా కనిపించలేదు. దీంతో బాధితుడు బస్‌స్టేషన్ అధికారులకు తెలియజేసి కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు బస్‌స్టేషన్‌లోని సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. నిందితులు విజయవాడ రైల్వే స్టేషన్ వద్ద ఉన్నారని తెలుసుకుని వెళ్లి వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించా రు. విచారణలో నిందితులు ఎస్‌ఆర్, కండక్టర్ ఖాళీ బ్యాగ్‌ను కృష్ణానదిలో పడవేసినట్టు తేలింది. పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. నిందితులు దొంగిలించిన సుమారు రూ.1600 పోలీసులు స్వాధీనం చేసుకుని కండక్టర్‌కు ఇచ్చినట్టు తెలిసింది.



రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో ఎస్ రమేష్ బాబు

దుర్గమ్మ సన్నిధిలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి పై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను మంగళవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ కృష్ణమోహన్ కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో ఎస్ రమేష్ బాబు, అర్చకులు వారికి ఘన స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వారికి ఆశీస్సులందజేశారు. అనంతరం ఏఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

22 నుంచి దసరా సెలవులివ్వాలి

- పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి



ఫైనాన్స్ సెక్రటరీ గౌతమ్‌కు ఉపాధ్యాయుల సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి, యూటీఎఫ్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గవర్నర్‌పేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ ఈనెల 22 నుంచి ప్రారంభమవుతున్న సందర్భం గా అప్పటి నుంచి రాష్ట్రంలో విద్యాసంస్థలకు దసరా సెలవులు ప్రకటించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూ ర్తి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, ఉన్నత విద్య డైరెక్టర్ నారాయణ గుప్తా, డైరెక్టర్ ఆఫ్ ట్రెజరర్ ఎన్ మోహనరావుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లుతో కలిసి సచివాలయంలో విద్యాశాఖాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అంత ర్ జిల్లా బదిలీలు డీఎస్సీ 2025 కంటే ముందు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లోని స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులను డీఎస్సీ 2025 కంటే ముందు చేపట్టాలని కోరారు. ప్లస్-2 పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీలను స్కూల్ అసిస్టెంట్‌ల ద్వారా వెంటనే భర్తీ చేయాలని, ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయుల పండిట్ పీఈటీ పోస్టులు అప్ గ్రేడేషన్ ఫైల్ ఆమోదం చేయాలని ఫైనాన్స్ సెక్రటరీ, జాయింట్ ఫైనాన్స్ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులకు అంతర్ జిల్లా బదిలీలు నిర్వహించాలని డైరెక్టర్, సెక్రటరీలను కోరారు.

కనకదుర్గమ్మ ఆసుపత్రికి వైద్యుల కేటాయింపు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దర్శనానికి వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేస్తుండగా భక్తుల ఆరోగ్య భద్రత నిమిత్తం అర్హత కలిగిన వైద్యులను డిప్యుటేషన్‌పై కేటాయించాలని దేవస్థానం ఈవో శీనానాయక్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఈ మేరకు ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులను కేటాయిస్తున్నట్టు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఆదేశాలు జారీ చేయగా దేవస్థానానికి ఆదేశాలు అందాయి. ఈవో లేఖకు స్పందించి, ఇద్దరు అర్హత కలిగిన ఎంబీబీఎస్ డాక్టర్స్‌ను డిప్యుటేషన్ విధానంపై దుర్గగుడి ఆరోగ్య కేంద్రానికి కేటాయించినట్టు విజయవాడ కొత్తపేట యూఎఫ్‌డబ్ల్యూసీలో పనిచేస్తున్న డాక్టర్ సురేష్ బాబు, కృష్ణలంక యూపీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ ఉదయకృష్ణను దేవస్థానంలో విధులు నిర్వహించాలని వైద్యారోగ్యశాఖ ఆదేశాలిచ్చింది. ఆరోగ్య కేంద్రాన్ని ఇంకా మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నామని, అర్హత కలిగిన సిబ్బంది, సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని, భక్తుల భద్రతే ప్రధానంగా ముందుకు వెళుతున్నామని, అటు మహామండపం వైపు, ఇటు ఘాట్ రోడ్డు వైపు రెండు వైపులా అంబులెన్స్‌లు ఏర్పాటు చేస్తామని ఈవో శీనానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జంక్షన్‌లో భారీ వర్షం



హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జంక్షన్‌లో మంగళవారం భారీ వర్షం కురిసింది. దాదాపు అర్ధగంటకుపైగా ఎడ తెరిపి లేకుండా కురిసిన వర్షంతో రోడ్లు జలమయం అయ్యాయి. ప్రధానంగా విజయవాడ రోడ్డులో పాల కేంద్రం ఎదురుగా, కూడలిలో నూజివీడు రోడ్డు జలమయం అయ్యింది. ప్రధాన డ్రైనేజీలు పూడికతో నిండిపోయి మురుగు నీరు ప్రవహించక పోవడతో ఈ పరిస్థితి ఎదురవుతోంది.

ఫ్యాషన్



సాధారణ మహిళల నుంచి ప్రముఖుల వరకు 'బాంధని' డిజైన్ చీరలను ఇష్టపడని వారుండరు. పండుగలు, పార్టీలు, శుభకార్యాలు ఇలా అన్ని సందర్భాల్లో మహిళలు బాంధని చీరలను ధరించి మురిసిపోతుంటారు. ఒకప్పుడు ఎంతో ప్రాచుర్యం పొందిన డిజైన్లకు సరికొత్త హంగులద్ది నేటి ఫ్యాషన్‌కు అనుగుణంగా తీర్చిదిద్దిన రంగురంగుల చీరలను యువతులు విశేషంగా ఆదరిస్తున్నారు. ఇలా అన్ని వయసుల వారిని అలరిస్తున్న బాంధని డిజైన్లపై ఓ లుక్కేద్దామా...

బహు చక్కని బాంధని

- 'బాంధని' అనేది ఓ సంప్రదాయ వస్త్ర కళ. ముందుగా ఓ సాదా చీర మీద దారాల సహాయంతో ముడులు చుడతారు. ఇలా ముడులతోనే రకరకాల డిజైన్లు రూపొందిస్తారు. తరువాత ఈ చీరని చక్కని రంగులో ముంచి ఆరబెడతారు. చీర పూర్తిగా ఆరిన తరువాత ముడులు విప్పేస్తారు. అంతే బాంధని డిజైన్ చీర రెడీ అయిపోతుంది. ఇలా టై అండ్ డై విధానంలో చుక్కలు, చదరాలు, పూలు, లతలు, అలల సమూహాలతో ఎన్నో విభిన్నమైన డిజైన్లను రూపొందిస్తున్నారు.
- కాటన్, సిల్క్, చందేరి, షిఫాన్, టస్సర్, ఆర్గంజా ఇలా ఎన్నో రకాల చీరల మీద బాంధని డిజైన్లను తీర్చిదిద్దుతున్నారు. వీటికి జర్దోసి, ఎంబ్రాయిడరీ, కుందన్, అద్దాలు, పూసల వర్క్‌లు జోడించి మరింత గ్రాండ్‌గా అందుబాటులోకి తెస్తున్నారు. వీటిని బొటిక్‌లు, షాపుల్లోనే కాదు ఆన్‌లైన్లో కూడా మహిళలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. పలు నగరాల్లో బాంధని డిజైన్ చీరల కోసం ప్రత్యేకమైన షాపులు ఉండడం విశేషం.
- బాంధని డిజైన్లు... యువతులకు, మధ్య వయసు మహిళలకు చక్కగా నప్పుతాయి. కాలేజీలు, కార్యాలయాలకు వెళ్లేవారు రోజువారీ ధరించడానికి సాదా డిజైన్లను ఎంపిక చేసుకుంటే బాగుంటుంది. వివాహాది శుభకార్యాలకు గ్రాండ్ లుక్‌నిచ్చే బాంధని చీరలు కట్టుకుంటే అందంగా హుందాగా కనిపిస్తారు. ఈ చీరల మీద చక్కగా నగలు పెట్టుకోవచ్చు. విభిన్నమైన హెయిర్ స్టయిల్స్ ప్రయత్నించవచ్చు.



అంచెలంచెలుగా ఎదిగి...

భారత రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధానీ) చరిత్రలో డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఒక మహిళ ఎంపిక కావడం తొలిసారి కాగా... ఆమె తెలుగు మహిళ కావడం మరింత విశేషం.
ఎనిమిది ప్రభుత్వ రంగ సంస్థల నిపుణులతో పోటీ పడి ఆ స్థాయికి చేరిన మధుబాల కల్లూరి 32 ఏళ్లుగా మిధానీలో అంచలంచెలుగా ఎదిగారు. తన ఉద్యోగ ప్రయాణం గురించి, విద్య, వైద్యపరంగా తను నిర్వహిస్తున్న సేవల గురించి 'నవ్య'తో ఆమె ప్రత్యేకంగా పంచుకున్నారు.



"మాది విజయవాడ. మా నాన్న అన్నే వెంకట్రావు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో గెజిటెడ్ ఆఫీసర్. పంచాయత్‌రాజ్ శాఖలో పనిచేశారు. అమ్మ సూర్యకుమారి గృహిణి. అప్పుడు ఉన్న పరిమిత వనరులతోనే వారు మాకు చదువు మీద శ్రద్ధ కలిగేలా చేశారు. మేము ముగ్గురం సోదరీమణులం. మా అక్క ఇస్రోలో సైంటిస్ట్ 'జి'గా పనిచేస్తుంటారు. ఇప్పటికీ ఆమె మాకు స్ఫూర్తి. మరో అక్క ఎంపీడీఓగా కంకిపాడులో చేస్తున్నారు.

ఆడపిల్లకు చదువెందుకని అనుకోలేదు...

చాలామంది అంటుండేవారు... ఆడపిల్లలకు చదువులెందుకని! కానీ, మా నాన్న అవేవీ పట్టించుకోలేదు. ఆయన చదువుకు ప్రాధాన్యం ఇవ్వడంతో మేము తొలి నుంచి చదువులో ముందుండేవాళ్లం. ఆరవ తరగతిలో ఉన్నప్పుడు విజయవాడ నుంచి మచిలీపట్టణానికి నన్ను అమ్మానాన్నా ఒంటరిగా పంపేవారు. నాన్న ఆంగ్ల పత్రిక ఒకటి తీసుకువచ్చి చదవమనేవారు. పాఠశాల విద్యాభ్యాసం అంతా విజయవాడ చుట్టుపక్కలనే జరిగింది. కామర్స్‌లో డిగ్రీ మాత్రం నాగార్జున విశ్వవిద్యాలయంలో, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఆంధ్రా యూనివర్శిటీలో చేశా. అనంతరం ఐసీడబ్ల్యుఏఐ, సీఎంఏ కూడా చేశాను. మా అక్కలా నేనూ సైన్స్ చదవాలనుకున్నాను. అయితే... నాన్న ఉద్యోగరీత్యా వేరే ప్రాంతాల్లో ఉండడంతో... నేను హాస్టల్‌లో చేరాల్సి వచ్చింది. అక్కడ కాలేజీలో కామర్స్ బాగా బోధిస్తారని ఆ కోర్సులో చేరాను. డిగ్రీ అయ్యాక సీఏ చేయాలనుకున్నాను. అప్పుడు "ఐసీడబ్ల్యుఏఐ అయితే త్వరగా అయిపోతుంది. ఉద్యోగంలో చేరవచ్చు. మీ ప్రాంతంలో ఆడపిల్లలకు త్వరగా వివాహం చేస్తారు కదా... సీఏ అయితే మధ్యలో చదువు ఆగిపోయే ప్రమాదం ఉంది" అని విజయవాడలో మోడ్రన్ అకాడమీ ప్రిన్సిపాల్ పాపారావు సూచించారు. అలా ఐసీడబ్ల్యుఏఐలో చేరాను. ఆయన సలహాకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

అదే విజేతగా నిలిపింది...

ఐసీడబ్ల్యుఏఐ పూర్తయ్యాక... బెంగళూరులో రెండేళ్లపాటు ఒక కంపెనీలో మేనేజిమెంట్ ట్రైనీగా పని చేశాను. ఆ తరువాత 1993లో మిధానీలో చేరాను. వచ్చే డిసెంబర్‌కు మిధానీతో నా అనుబంధం 32 ఏళ్లు పూర్తిచేసుకోబోతోంది. పలు ప్రభుత్వ రంగ సంస్థల్లో అవకాశం వచ్చినా... హైదరాబాద్‌లో స్థిరపడాలనే ఉద్దేశంతో ఇక్కడే ఉండిపోయాను. ఇక్కడ అకౌంట్స్ ఆఫీసర్‌గా నా ప్రయాణం మొదలయింది. మాది చిన్న సంస్థ కావడం వల్ల నేను పెద్దగా ఇబ్బందులు ఎదుర్కోలేదు. అన్ని విభాగాల్లో ఏం జరుగుతోందో తెలుసుకోవడానికి, పలు అంశాల్లో కీలకమైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం కలిగింది. ఫైనాన్స్ విభాగంలో వివిధ హోదాల్లో పనిచేశాను. కాస్టింగ్, అకౌంట్స్, ఆడిట్, పేమెంట్స్, ట్యాక్సేషన్, ప్రాజెక్ట్స్ లాంటి విభాగాల్లో పనిచేయడం కెరీర్‌లో ఎదిగేందుకు ఎంతగానో తోడ్పడింది. ఈ ఏడాది జూలై 21న ఫైనాన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలను చేపట్టాను. ఈ పోస్ట్ కోసం ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ఎనిమిది మంది ఫైనాన్స్ నిపుణులతో పోటీ పడ్డాను. అయితే... మిధానీలో ఫైనాన్స్‌పరంగా అన్ని విభాగాల్లో నాకు పట్టు ఉండడం, ప్రభుత్వ రంగ ఆర్థిక పరిపాలనపై నాకున్న రికార్డు ఈ రేసులో నన్ను విజేతగా నిలిపిందని భావిస్తున్నాను. సంస్థకు, ఉద్యోగులకు అవసరమైన విధానాల రూపకల్పనలో నేను కీలక పాత్ర పోషించాను. మిధానీలో ప్రతి అంశం నాకు తెలుసు. ఆ అనుభవం, ప్రతి అంశాన్నీ విశ్లేషణాత్మకంగా చూసే అలవాటు... ఇవి ఇంటర్వ్యూలో బాగా ఉపయోగపడ్డాయి.

> **కష్టే ఫలి...**
>
> సీఏ, సీఎంఏ లాంటి కోర్సులు చేస్తున్న చాలా మంది మధ్యలో ఆపేస్తున్నారు. ఆ కోర్సు పూర్తి చేయండి. 2, 3 ఏళ్లు కష్టపడితే మంచి ఉద్యోగం దొరుకుతుంది" అని నేను చెబుతాను. మహిళా ఉద్యోగులు ఇంటిని, ఆఫీసును బ్యాలెన్స్ చేసుకోవడం కోసం సమయాన్ని షెడ్యూల్ చేసుకోవాలి. ఇది తెలియని వారికి మేము కౌన్సెలింగ్ ఇస్తుంటాం. పరిష్కారాలు సూచిస్తూ ఉంటాం. అయితే కుటుంబ సభ్యుల సహకారం లేకుండా ఏదీ సాధ్యం కాదు. ఇక... అత్తమామలతో ఎలా వ్యవహరించాలో తల్లిదండ్రులు పిల్లలకు నేర్పాలి. అది లేకనే సమస్యలు వస్తున్నాయనేది నా భావన. కాగా... ఈ తరానికి పెద్ద సమస్య... చదివే అలవాటు లేకపోవడం. దీనివల్ల సబ్జెక్ట్ అప్‌డేట్ కావడం లేదు. తాజా సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుంటే మనల్ని అధిగమించేవారు ఉండరు. కాబట్టి నిత్యం అధ్యయనం చేస్తూనే ఉండాలి.

మహిళా ఉద్యోగులు పెరగడానికి దోహదం చేశా...

నేను పదేళ్ల నుంచి ఫైనాన్స్ విభాగం అధిపతిగా పని చేస్తున్నాను. నేను చేరినప్పుడు ఇక్కడ మహిళా ఉద్యోగుల సంఖ్య వేళ్ల మీద లెక్కించగలిగేలా ఉండేది. ఇప్పుడు మిధానీలో 10 శాతం మంది ఉద్యోగులు మహిళలు. వారిలో 30 మంది అధికారులు. వర్క్‌మెన్ క్యాడర్‌లో మహిళలు ఉన్నారు. ఫర్నేస్ దగ్గర కూడా పని చేస్తున్నారు. ఇక్కడ ఎలాంటి వివక్షా లేదు. 2011 నుంచి స్వతంత్ర డైరెక్టర్లలోనూ మహిళలు ఉన్నారు. ప్రస్తుతం కూడా బోర్డులో సగం మంది.. అంటే ముగ్గురు మహిళా డైరెక్టర్లే. వారిలో నేనొకరిని కాగా... ఇద్దరు స్వతంత్ర డైరెక్టర్లు. ఇక మా ఉద్యోగుల్లో, కనీసం మా విభాగంలో మహిళల నియామకంలో, వారి శాతం పెరగడంలో నా పాత్ర ఉందని చెప్పగలను. అయితే మహిళ అని కాకుండా... వారి పనితీరు, అర్హతల ఆధారంగానే నియమిస్తాం. శ్రద్ధ, అంకితభావం ఎవరికైనా ముఖ్యం. మన పనితీరే మన గురించి చెప్పే ప్రమాణం అవుతుంది. మహిళలకు కూడా ఇదే వర్తిస్తుంది.

ఆనందకరమైన బాధ్యత...

ఫైనాన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే బీడీపీవి స్కూల్ ఛైర్మన్‌గానూ వ్యవహరిస్తున్నాను. మిధానీ, బీడీఎల్ సంయుక్తంగా ఈ స్కూల్ నిర్వహిస్తున్నాయి. ఇది ప్రాజెక్ట్ స్కూల్. మిధానీలో అన్ని విభాగాలకు ఇది అదనపు బాధ్యత. అందరూ స్వచ్ఛందంగానే తోడ్పాటు అందిస్తారు. ఈ స్కూల్‌లో దాదాపు 2,100 మంది పిల్లలున్నారు. పాఠశాలకు సంబంధించి మౌలిక సదుపాయాలు, రోజువారీ సమస్యల గురించి సమావేశాలు జరుపుతాం. సమస్యలుంటే పరిష్కరిస్తుంటాం. మిధానీ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు ఛైర్మన్‌గా మూడున్నర సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నాను. సమాజానికి కొంత మేర సహాయం చేసేందుకు ఇది తోడ్పడుతుంది. ఇక్కడ 10 రూపాయలతో రిజిస్టర్ చేసుకుంటే సరిపోతుంది. చికిత్స కార్పొరేట్ హాస్పిటల్ స్థాయిలో ఉంటుంది. సేవలు కూడా అతి తక్కువ ఖర్చుతో అందిస్తుంటాం. ఇది నాకు అదనపు బాధ్యతే కానీ... ఆనందకరమైన బాధ్యత. ఇవి కాకుండా పలు సీఎస్ఆర్ కార్యక్రమాలను పర్యవేక్షిస్తాను.

వారి తోడ్పాటు అపూర్వం...

నేను ఇక్కడివరకూ వచ్చానంటే మా అమ్మానాన్నలతోపాటుగా అత్తమామలు కల్లూరి సుబ్బారావు, సుశీల సహాయ సహకారాలే కారణం. నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో మా అబ్బాయి ఆలనాపాలనా మా అత్తగారు చూసుకునేవారు. ఆమె మరణించాక మా మామగారి బాధ్యతను చూసుకున్నాను. మావారు, రవికిశోర్ కూడా నా ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతున్నారు. ఆయనకు ఎంతో విశ్లేషణా శక్తి ఉంది. అందుకే ఆయన సూచనలను తప్పకుండా పాటిస్తాను. నాకు ఖాళీ సమయం దొరకడం అరుదే. కాస్త సమయం చిక్కితే చారిటీకి సమయం కేటాయిస్తుంటాను. ఆదివారాలు కచ్చితంగా గార్డెనింగ్‌లో కొంత సమయం గడపడానికి ప్రయత్నిస్తాను. మొక్కల్ని చూస్తే అన్నీ మరచిపోతాను. ఒత్తిడి తగ్గించుకొని, ఆనందం పొందుతాను."

• పులగం గిరి

న్యూస్‌మేకర్

ఉన్నత చదువు... ఐటీ కంపెనీలో అందుకు తగిన కొలువు...
చేతి నిండా సంపాదన కాదనుకొని... చిత్ర పరిశ్రమ వైపు అడుగులు వేశారు.
ఇంట్లోవాళ్లు వద్దన్నా... ఊరు కట్టుబాట్లు పేరు చెప్పినా... అవరోధాలను దాటి...
ప్రతిష్ఠాత్మక 'వెనిస్ చిత్రోత్సవం'లో ఉత్తమ దర్శకురాలిగా అవార్డు అందుకున్నారు.
పశ్చిమబెంగాల్‌లోని ఓ మారుమూల గ్రామం నుంచి వచ్చి... అభిరుచికి పట్టం కట్టి...
అంతర్జాతీయ వేదికపై మెరిసిన అనుపర్ణా రాయ్ అంతరంగం ఇది...

అంతర్జాతీయ వేదికపై మన అనుపర్ణ



"జీవితం ఎప్పుడూ మనకు సవాళ్లు విసురుతూనే ఉంటుంది. వాటిని అధిగమించి ముందుకు సాగితేనే అనుకున్నది దక్కుతుంది. ఇది అనుభవ పాఠం. పశ్చిమబెంగాల్ పురులియా జిల్లాలోని నారాయణపూర్ గ్రామం మాది. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం సాగింది. తరువాత అసన్‌సోల్‌లో ఇంగ్లీష్ లిటరేచర్ చేశాను. కాలేజీ రోజుల్లోనే నాకు సినిమాలపై ఆసక్తి కలిగింది. ఎప్పటికైనా సరే... దర్శకురాలినో, రచయితనో అవ్వాలని అనుకునేదాన్ని. కానీ ఎక్కడ మొదలుపెట్టాలి, పరిశ్రమలోకి ఎలా వెళ్లాలి అనేవాటిపై కనీస అవగాహన లేదు. అందరిలానే చదువు పూర్తవగానే ఉద్యోగంలో చేరాను. తొలుత ఢిల్లీలోని ఒక కాల్‌సెంటర్‌లో పని చేశాను. కొన్నాళ్ల తరువాత నా నివాసం ముంబయికి మార్చాను. సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం మొదలుపెట్టాను. మంచి జీతం. దేనికీ ఇబ్బందిలేదు. ముంబయి వెళ్లాలనుకోవడానికి మరో బలమైన కారణం కూడా ఉంది. అదే... సినిమా ప్రయత్నాలు. దాని కోసం అనుపమ్‌ఖేర్ ఫిలిమ్ ఇనిస్టిట్యూట్‌లో నటనలో శిక్షణ తీసుకున్నా. కొన్ని యాక్టింగ్ వర్క్‌షాపుల్లో కూడా పాల్గొన్నాను.

అవరోధాలు అధిగమించి...

సినిమాల మీద ఇష్టంతో ఉద్యోగం వదిలేద్దామని అనుకున్నాను. విషయం అమ్మానాన్నకు చెప్పాను. కానీ వాళ్లు వద్దంటే వద్దన్నారు. అంతేకాదు... నేను సినిమాల్లోకి వెళితే ఊరు ఊరంతా కోపగిస్తుందని అన్నారు. సంప్రదాయాలు, సామాజిక కట్టుబాట్ల పేరుతో నన్ను నియంత్రించాలని చూశారు. అయినా నేను నా అభిప్రాయం మార్చుకోలేదు. అవరోధాలు దాటి ఎంచుకున్న లక్ష్యం వైపు నడవాలని నిర్ణయించుకున్నాను. కాదనలేక చివరకు ఇంట్లోవాళ్లు కూడా సరేనన్నారు.

ఎన్నో సవాళ్లు...

2022లో ఉత్సాహంగా ముంబయి వెళ్లాను కానీ... ఎంతో కష్టపడాల్సివచ్చింది. కొత్త నగరం, కొత్త మనుషుల మధ్యలో కొత్త జీవితం. సరైన వనరులు లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. క్రమంగా అన్నిటినీ అర్థం చేసుకోవడం మొదలుపెట్టాను. అజాద్‌నగర్‌లోని ఒక అపార్టుమెంటులో అద్దెకు ఉండేదాన్ని. అక్కడే 'సాంగ్స్ ఆఫ్ ఫర్‌గాటెన్ ట్రీస్' చిత్రానికి సంబంధించి స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నాను. అదృష్టం ఏంటంటే... నాకు మంచి టీమ్ లభించింది. అందరం కలిసి వండుకోవడం, తినడం, షూటింగ్ చేయడం... ప్రతి క్షణం ఎంతో ఆస్వాదించాం. మధుర జ్ఞాపకాలు ఎన్నిటినో పదిలపరుచుకున్నాం. మా కష్టం ఫలించింది. ఇటీవల ముగిసిన 'వెనిస్ చిత్రోత్సవం' ఒరిజోన్టీ విభాగంలో ఉత్తమ దర్శకురాలిగా నాకు అవార్డు దక్కింది. తొలి సినిమాకే అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది.

భావోద్వేగ క్షణాలు...

ఇటలీలోని వెనిస్ నగరంలో అడుగుపెట్టగానే ఏదో తెలియని అనుభూతి కలిగింది. నేను రచించి, దర్శకత్వం వహించిన 'సాంగ్స్ ఆఫ్ ఫర్‌గాటెన్ ట్రీస్'ను థియేటర్‌లో ప్రదర్శించారు. మొదటిసారి వేదిక మీదకు వెళ్లాను. భావోద్వేగంతో నా కళ్లు చెమర్చాయి. ఆహూతులందరూ లేచి నిల్చుని, దాదాపు ఏడు నిమిషాలు చప్పట్లతో అభినందించారు. వేదికపైనున్న మా టీమ్ సభ్యులందరిపై మొబైల్ ఫ్లాష్‌లైట్స్ వేసి, వెలుగులు అద్దారు. నా జీవితంలోనే అత్యద్భుత సమయం అది. తీయని జ్ఞాపకంగా ఎప్పటికీ మిగిలిపోతుంది. మన సినిమా ఎప్పుడూ ఇలాగే ప్రకాశించాలని కోరుకొంటున్నాను.

ఇది ఒక గెలుపు మాత్రమే కాదు...

ఇప్పుడు నన్ను చూసి మా ఊరు గొప్పగా చెప్పుకొంటుందని ఆశిస్తున్నా. ఇది ఒక గెలుపు మాత్రమే కాదు... అనేక అడ్డంకులను అధిగమించి సాధించిన గొప్ప విజయం. పాయల్ కపాడియా, కిరణ్‌రావు, జోయా అక్తర్, రీమా దాస్, మీరా నాయర్ వంటి మహిళా దర్శకులు నాకు ఆదర్శం. వాళ్లే లేకపోతే ఇవాళ నేను ఇక్కడ ఉండేదాన్నికాదు. ఈ చిత్రానికి మద్దతుగా నిలిచిన దర్శకుడు అనురాగ్ కశ్యప్, ఇందులో నటించిన నాజ్ షేక్, సుమీ బఘేల్, ఇతర టీమ్ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను. అందుకే ఈ అవార్డును ఇద్దరు అద్భుతమైన నటులతో పాటు, ఇన్నాళ్లుగా నాతో కలిసి ప్రయాణించిన ప్రతిఒక్కరికీ అంకితం ఇస్తున్నా. ఇన్నేళ్ల కష్టాన్ని ఈ అవార్డు మరిపించింది. ఈ అద్భుతమైన సందర్భాన్ని ఎంతో ఆస్వాదిస్తున్నా.

మిక్సీ గిన్నెలు శుభ్రం ఇలా...

మిక్సీ గిన్నెలకు ఉండే బ్లేడ్స్ కింద రకరకాల ఆహారపదార్థాలు ఇరుక్కుంటూ ఉంటాయి. వీటిని సరిగా శుభ్రం చేయకుండా గిన్నెలను వాడుతూ ఉంటే పలు అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వాటిని సులభంగా ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం..

- మిక్సీ గిన్నెను ఉపయోగించిన తరువాత అందులో కొన్ని వేడి నీళ్లు, కొద్దిగా డిష్ వాష్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. పది నిమిషాల తరువాత చేత్తో రుద్ది కడగాలి. ఆపైన గిన్నెలోని బ్లేడ్స్‌ను జాగ్రత్తగా తీసి వాటితో పాటు గిన్నె మధ్య భాగాన్ని పాత టూత్‌బ్రష్ లేదా స్పాంజ్‌తో రుద్ది కడగాలి. తడి పూర్తిగా ఆరిన తరువాతే గిన్నెకు బ్లేడ్స్‌ను అమర్చాలి.



- మిక్సీ గిన్నె మూతకు ఉండే రబ్బర్ గ్యాస్కెట్‌ను బయటకు తీయాలి. బ్రష్ లేదా స్పాంజ్‌ను డిష్ వాషింగ్ లిక్విడ్‌లో ముంచి దానితో గ్యాస్కెట్‌ను, మూత అంచులను రుద్ది కడగాలి. గ్యాస్కెట్ పూర్తిగా ఆరిన తరువాతే మూతకు పెట్టాలి.

పిల్లలకు మాటలు త్వరగా రావాలంటే...

సాధారణంగా ఏడాది వయసు రాగానే పిల్లలు ఏదో ఒకటి మాట్లాడడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. కానీ కొంతమంది పిల్లలు మాత్రం రెండేళ్లు నిండినా మాట్లాడలేకపోవడం మనం చూస్తూ ఉంటాం. అలాకాకుండా పిల్లలు త్వరగా మాట్లాడాలంటే తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

- చిన్న పిల్లలతో తరచూ మాట్లాడుతూ ఉండాలి. చిన్న చిన్న మాటలతో ముఖంలో హావ భావాలు పలికిస్తుంటే పిల్లలు అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తారు. పిల్లలకు ఏ అంశాన్నైనా సులభంగా గ్రహించే శక్తి ఉంటుంది. కాబట్టి ప్రతి సందర్భాన్ని తమదైన శైలిలో వివరిస్తుంటే పిల్లలు మాట్లాడడం నేర్చుకుంటారు.
- నెలల పిల్లలకు ఆటబొమ్మలు ఇచ్చి ఆడిస్తూ ఉండాలి. ఆ బొమ్మల గురించి పలు అంశాలు చెబుతూ ఉంటే పిల్లలు కన్నార్పకుండా చూస్తూ వింటూ ఉంటారు. బొమ్మల మీద కంటే ఏం మాట్లాడుతున్నారు? అనే దాని మీద పిల్లలు ఎక్కువగా దృష్టి పెడతారు. అలా పిల్లల్లో వినికిడి శక్తి, గ్రహించే సామర్థ్యం పెరుగుతాయి. క్రమంగా వచ్చీరాని మాటలు మాట్లాడడం ప్రారంభిస్తారు.



- చాలామంది పిల్లలు పాటలు లేదా కథలు వింటూ నిద్రపోతుంటారు. అలా రోజూ ఎన్నో మాటలు వింటూ ఉండడం వల్ల వారిలో ఆలోచన శక్తి పెరుగుతుంది. విన్న మాటలను తిరిగి పలికే ప్రయత్నం చేస్తారు. పిల్లలతో ఎంత ఎక్కువగా మాట్లాడితే అంత త్వరగా వాళ్లకి మాట్లాడడం వస్తుంది.
- ఇంట్లో కుటుంబ సభ్యులంతా ఒకరినొకరు పిలుచుకుంటూ అనేక రకాల భావాలు ప్రదర్శిస్తూ మాట్లాడుకుంటూ ఉంటే పిల్లలు గమనిస్తుంటారు. పెద్దల భావాలు అర్థమయినప్పుడల్లా మాట్లాడేందుకు ప్రయత్నిస్తుంటారు.
- పిల్లలు పెద్దవుతున్న కొద్దీ వచ్చీరాని పదాలు పలుకుతుంటారు. అలాంటప్పుడు స్పష్టంగా ఉచ్చరించే విధానాన్ని చెబుతూ ఉండాలి. అప్పుడే పిల్లలకు సరిగా మాట్లాడడం అలవడుతుంది.
- పిల్లలకు ఇష్టమైన ఆట బొమ్మలు, ఆహార పదార్థాలను వాళ్లకి అందకుండా పెడుతూ ఉండాలి. అప్పుడు పిల్లలు అవి కావాలని అడగడానికి ప్రయత్నిస్తూ సైగలు చేస్తూ ఉంటారు. ఈ సందర్భాలను ఉపయోగించుకుంటూ పిల్లలకు కావాల్సిన దాన్ని అడగడం నేర్పిస్తే మంచి ప్రయోజనం కనిపిస్తుంది.

డ్రాగన్ ఫ్రూట్ ఉపయోగాలెన్నో!

గులాబీ రంగులో ఆకర్షణీయంగా, చూడగానే తినేయాలనిపించేలా ఉంటుంది డ్రాగన్ ఫ్రూట్. ఈ పండులో అనేక పోషకాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. ఆ వివరాల గురించి తెలుసుకుందాం...



- డ్రాగన్ ఫ్రూట్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీని వలన జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. గ్యాస్, అసిడిటీ, కడుపుబ్బరం వంటివి తగ్గుతాయి.
- ఈ పండులో ఐరన్ కూడా ఎక్కువ మొత్తంలో ఉంటుంది. అది ఎర్రరక్తకణాల ఉత్పత్తిని పెంచి రక్తహీనతను దూరం చేస్తుంది.
- ఇందులోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అలాగే కొల్లాజన్ ఉత్పత్తిని పెంచి అందాన్ని కాపాడుతుంది.
- దీనిలోని మెగ్నీషియం, క్యాల్షియంలు ఎముకల దృఢత్వానికి దోహదం చేస్తాయి.
- డ్రాగన్ ఫ్రూట్‌లోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి.
- ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. .
- ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్, ఆస్కార్బిక్ యాసిడ్‌లు రక్తంలో చక్కెరస్థాయులను నియంత్రించడంలో సహాయపడతాయి.

ఎన్డీయేది నైతికంగా పరాజయమే

» ఉప రాష్ట్రపతి ఎన్నిక ఫలితంపై ఖర్గే



న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్‌డీఏ సంఖ్యాపరంగా గెలిచినా నైతికంగా, రాజకీయంగా మాత్రం ఓటమి పాలైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఇది కేవలం ఎన్నిక మాత్రమే కాదని, అంతకుమించిన సైద్ధాంతిక యుద్ధమని పేర్కొన్నారు. ఈ ఎన్నికలో ప్రతి పక్ష పార్టీలు ఐక్యంగా నిలబడ్డాయన్నారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అత్యున్నత పార్లమెంటరీ సంప్రదాయాలు పాటిస్తారని, ప్రతిపక్షానికి సమాన గౌరవం, అవకాశం ఇస్తారని, అధికార పక్షం ఒత్తిళ్లకు తలొగ్గరని ఆశిస్తున్నట్లు తెలిపారు.

గొప్ప ఉప రాష్ట్రపతిగా నిలుస్తారు: మోదీ

న్యూఢిల్లీ/హైదరాబాద్/అమరావతి, సెప్టెంబరు 9: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్‌కు ప్రధాని మోదీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సమాజసేవకు, పేదలు, అణగారినవర్గాల వారి సాధికారతకు రాధాకృష్ణన్ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఆయన ఒక గొప్ప ఉపరాష్ట్రపతిగా నిలిచి.. రాజ్యాంగవిలువలను మరింత బలోపేతం చేస్తారన్న నమ్మకం తనకుందని మోదీ పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా శుభాకాంక్షలు తెలిపారు. రాధాకృష్ణన్ గెలుపు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో మరో చరిత్రాత్మక విజయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. సిద్ధాంతం కోసం అహర్నిశలు శ్రమించిన రాధాకృష్ణన్ ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడం స్ఫూర్తిదాయకమని, ఆయన నిబద్ధతకు సరైన గుర్తింపు అని కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. సీపీ రాధాకృష్ణన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'ఎక్స్' వేదికగా, మంత్రి లోకేశ్ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు

హిమాచల్‌కు రూ.1500 కోట్ల తక్షణ సాయం

» పంజాబ్‌కు రూ.1600 కోట్లు..ప్రకటించిన ప్రధాని మోదీ

సిమ్లా, ధర్మశాల, చండీగఢ్, న్యూఢిల్లీ, సెప్టెంబరు 9 : భారీవర్షాలు, వరదలతో అతలాకుతలమైన హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో ప్రధాని మోదీ మంగళవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. హిమాచల్‌కు రూ.1,500 కోట్ల తక్షణ సాయం, పంజాబ్‌కు రూ.1,600 కోట్ల ఆర్థిక సాయం ప్రకటించారు. ఇప్పటికే పంజాబ్ విపత్తు సహాయ నిధిలో రూ.12,000 కోట్లు ఉండగా వాటికి అదనంగా ఈ సహాయాన్ని ప్రకటించారు. రెండు రాష్ట్రాల్లో వరదల్లో మరణించిన వారికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేల సాయం ప్రకటించారు. కాగా హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రాలో సహాయ, పునరావాస చర్యలపై ప్రధాని సమీక్షించారు. పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. అనంతరం ప్రధాని వరద బాధితులను పరామర్శించారు. అలాగే వరదలతో సతమతమవుతోన్న పంజాబ్ రాష్ట్రంలో తీవ్రంగా ప్రభావితమైన గురుదాస్‌పూర్ జిల్లాలో పర్యటించారు. దశాబ్దాలుగా ఎన్నడూ లేని స్థాయిలో వచ్చిన వరదలను పంజాబ్ ఎదుర్కొంటోంది. ఈ కారణంగా 52 మంది మరణించారు. 1.91 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. కాగా ప్రధాని వరద సహాయ నిధికి సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, ఇతర జడ్జిలు రూ.25,000 చొప్పున విరాళం ఇవ్వనున్నారు.

ఆడుకుంటున్న రుతుపవనాలు!

» దేశంలో కొన్ని ప్రాంతాల్లో భారీవర్షాలు

» ఇంకొన్ని చోట్ల వర్షాభావం.. కరువు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: దేశవ్యాప్తంగా రుతుపవనాలు ఏకరూపంగా ప్రభావం చూపించడం లేదు. కనీవినీ ఎరుగని భారీవర్షాలు, మెరుపు వరదలు, కొండచరియలు, మట్టిచరియలు విరిగిపడుతుండడంతో కొన్ని ప్రాంతాలు అతలాకుతలమవుతుండగా.. ఇంకొన్ని ప్రాంతాలు తీవ్ర వర్షాభావం, కరువుతో అల్లాడుతున్నాయి. వాతావరణ మార్పు దీనికి ప్రధాన కారణమని పలువురు అంటున్నా.. అదొక్కటే కారణం కాదని ఐఐటీ భువనేశ్వర్‌లోని స్కూల్ ఆఫ్ ఎర్త్, ఓషన్-క్లైమేట్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ సందీప్ పట్నాయక్ చెబుతున్నారు. పట్టణ ప్రణాళికలు, డ్రైనేజీ వ్యవస్థలు సరిగా లేకపోవడం.. మితిమీరిన కాంక్రీటు వినియోగం కారణంగా వర్షపు నీరు భూమిలో ఇంకకపోవడం.. ఇవన్నీ విపత్తులకు కారణాలేనని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది రుతుపవన కాలంలో వర్షపాతంలో నాటకీయ మార్పులు కనిపించాయి. వాతావరణ మార్పుల్లో పాశ్చాత్య అవాంతరాల కారణంగా జమ్మూకశ్మీరు, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్రల్లో మెరుపు వరదలు సంభవించాయి. మట్టి, కొండచరియలు విరిగిపడ్డాయి. ఉత్తరాఖండ్, బిహార్‌లలో భారీవరదలకు చాలా గ్రామాలు కొట్టుకుపోయాయి. వందల మంది గల్లంతయ్యారు. మరోవైపు, గంగా మైదాన ప్రాంతాల్లో జూన్‌లో చుక్క వర్షం పడడం లేదని.. అవి ఎండిపోతున్నాయని.. ఇంకోవైపు.. మధ్యభారతం తడిసిముద్దవుతోందని పట్నాయక్ తెలిపారు. ఆగస్టు నెలలో పలు హిమాలయ రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు, క్లౌడ్ బరస్టులు సంభవించాయి. ఉత్తరాఖండ్‌లోని ధారలి, జమ్మూకశ్మీరులోని కథువా, హిమాచల్‌లో వ్యవసాయం సర్వనాశనమైంది. ఈ ప్రాంతంలో భారీ ఉష్ణోగ్రతల కారణంగానే వరదలు సంభవించాయని అంటున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా నీరు ఆవిరవడం అధికమవుతోంది. ఇది వాతావరణంలో తేమను పెంచుతోంది. మేఘాలు దట్టమై బరువెక్కడంతో ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీవర్షాలు.. కొండచరియలు విరిగిపడేందుకు కారణమవుతున్నాయి. వీటి బంగాళాఖాతంలో అల్పపీడన వ్యవస్థ, రుతుపవన వర్షాలు కలిసి.. పర్వతాలపై గాలి వ్యతిరేక దిశలో అపరిమిత వర్షాలకు కారణమవుతున్నాయని.. ఈ కారణంగా కేరళలో కొండచరియలు, మట్టిచరియలు విరిగిపడి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని పట్నాయక్ వివరించారు. ఇందులో వాతావరణ మార్పు అనేది ఒక కోణం మాత్రమేనన్నారు.

పాత స్టాకుపై కొత్త ధరలతో స్టిక్కర్లు

» జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం ప్రజలకు అందేలా కేంద్రం వెసులుబాటు..మారిన పన్ను మేరకే కొత్త ఎమ్మార్పీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం ప్రజలకు పక్కాగా అందించే దిశగా కేంద్రం చర్యలు చేపట్టింది. పాత స్టాకు మీద ముద్రించి ఉన్న గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ)ను మార్చుకునేందుకు కంపెనీలకు వెసులుబాటు కల్పిస్తూ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. సాధారణంగా కంపెనీలు ఏవైనా వస్తువులను ఉత్పత్తి చేసి మార్కెట్‌లోకి విడుదల చేశాక.. వాటిపై ఉన్న ఎమ్మార్పీని మార్చేందుకు అవకాశం ఉండదు. కానీ ఈ నెల 22 తర్వాత జీఎస్టీ శ్లాబుల మార్పు, పన్ను తగ్గింపు అమల్లోకి వస్తుండటంతో.. ఆ రోజు నాటికి ఇంకా నిల్వ ఉన్న పాత స్టాకుపై కొత్త ధరలతో స్టిక్కర్లు వేయడానికి ప్రభుత్వం అనుమతించింది. కేవలం పన్నుల్లో మార్పుల మేరకు మాత్రమే ధరల సవరణ ఉండాలని, ఇతర మార్పులేమీ ఉండొద్దని పేర్కొంది. అంతేగాక ఉత్పత్తులపై పాత ఎమ్మార్పీ కూడా కనిపించేలా ఉండాలని స్పష్టం చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ వరకు, లేదా పాత స్టాక్ అయిపోయే వరకు మాత్రమే ఇలా ధరల మార్పు స్టిక్కర్లను వేసే వెసులుబాటు ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు, జీఎస్టీ పన్ను తగ్గింపు అమలులో పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి 'ఎక్స్'లో తెలిపారు.

మరిన్ని వాహన కంపెనీల ధరల తగ్గింపు ప్రకటన

జీఎస్టీ తగ్గింపు నేపథ్యంలో.. తమ వాహనాల ధరలు ఎంతవరకు తగ్గుతాయన్న దానిపై మరిన్న వాహన తయారీ కంపెనీలు ప్రకటనలు జారీ చేశాయి. ద్విచక్ర వాహనాల సంస్థలు యమహా తమ వాహనాలపై రూ.17,581 వరకు.. బజాజ్ రూ.20 వేలవరకు తగ్గింపు ఉంటుందని తెలిపాయి. మోడళ్లు, వేరియంట్లను బట్టి తమ కార్ల ధరలు రూ.57 వేల నుంచి రూ.95వేల వరకు తగ్గుతున్నట్టు హోండా కార్ల కంపెనీ వెల్లడించింది. ఇక టాటా అనుబంధ సంస్థ జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) తమ వాహనాల ధరలు రూ.4.5 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు.. వోల్వో సంస్థ తమ కార్ల ధరలు రూ.6.9 లక్షల వరకు తగ్గుతున్నట్టు ప్రకటించాయి.

ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

(మొదటిపేజీ తరువాయి)

ఓటు వేయగా.. విపక్షాలకు చెందిన సభ్యుల్లో 15 మందికి పైగా క్రాస్ ఓటింగ్ చేసి ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు పలికారని స్పష్టమైంది. తెలుగు ఆత్మ గౌరవం పేరుతో ఇండియా కూటమి పక్షాలు తెలుగు ఎంపీల ఓట్లను చీల్చేందుకు చేసిన ప్రయత్నాలు దాదాపు విఫలం కాగా, డీఎంకేకు చెందిన పలువురు సభ్యులు తమిళ ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిచ్చి రాధాకృష్ణన్‌కు ఓటు వేయడం గమనార్హం. ఇక.. ఎన్డీఏ అభ్యర్థికే తమ మద్దతు అని వైసీపీ ప్రకటించినప్పటికీ.. కనీసం ముగ్గురు వైసీపీ ఎంపీలు జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటు వేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

98 శాతం పోలింగ్..

పార్లమెంట్ కొత్త భవనంలోని 'ఎఫ్-101 వసుధ'లో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. ఏడున్నర తర్వాత... 152 ఓట్ల ఆధిక్యంతో రాధాకృష్ణన్ గెలుపొందినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ ప్రమోద్‌చంద్ర మోదీ ప్రకటించారు. ఎన్నికల్లో సుమారు 98% పోలింగ్ జరిగింది.

క్రాస్ ఓటింగ్..

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరుగుతుందని ఎన్డీయే, ఇండియా.. రెండు పక్షాలూ మొదటి నుంచి చెబుతున్నాయి. తమకు 315 మంది సభ్యుల మద్దతు ఉందని ఇండియా కూటమి చెబుతుండగా.. ఎన్డీయే కూటమికి 427 ఓట్లు ఉన్నాయి. ఏపీకి చెందిన వైసీపీ సైతం ఎన్డీయేకి మద్దతు ప్రకటించింది. ఆ పార్టీకి ఉభయసభల్లోనూ కలిపి 11 మంది ఎంపీలు ఉన్నారు. వారిని కూడా కలుపుకొంటే ఎన్డీయే కూటమికి 438 ఓట్లు రావాలి. కానీ, ఆ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు అనూహ్యంగా 452 ఓట్లు వచ్చాయి. అంటే.. ఇండియా కూటమి నుంచి సుమారు 14 మంది ఎన్డీఏకు క్రాస్ ఓటింగ్ చేసినట్టు. రాధాకృష్ణన్ తమిళుడు కాబట్టి..



కొందరు డీఎంకే ఎంపీలు ఆయనకు ఓటేసినట్టు తెలుస్తోంది. అదే సమయంలో.. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన వైసీపీ ఎంపీల్లోనూ ఇద్దరు.. ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటు వేసినట్టు తెలిసింది. వారితోపాటు సుదర్శన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే మరో వైసీపీ ఎంపీ సైతం ఆయనకే ఓటేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక.. పోలైన ఓట్లలో 15 ఓట్లు చెల్లనివిగా అధికారులు ప్రకటించారు. ఆ 15 మంది ఏ కూటమికి చెందిన వారన్నదానిపై రెండు కూటములు విశ్లేషిస్తున్నాయి. ఇండియా కూటమికి చెందిన మొత్తం 315ఓట్లు పూర్తిగా పోలయ్యాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రకటించిన కొద్దిసేపటికే, ఆ కూటమి అభ్యర్థికి సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు మాత్రమే వచ్చినట్టు ఎన్నికల అధికారి ప్రకటించడం గమనార్హం. నిజానికి ఉభయసభల్లోనూ ఆమ్ ఆద్మీ పార్టీకి ఉన్న 12 మంది ఎంపీలు కూడా ఇండియా కూటమికి వేస్తే 327 ఓట్లు రావాలి. కానీ.. 300 ఓట్లు మాత్రమే రావడం ఇండియా కూటమి పార్టీల అనైక్యతను సూచిస్తోందని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాగా, చెల్లని ఓట్లలో ఎన్డీఏ సభ్యులవే 10 ఓట్లు ఉన్నట్టు, మిగతా ఐదు ఓట్లూ ఇండియా కూటమికి చెందిన వారివని తెలుస్తోంది.

ఓటింగ్‌కు దూరంగా...

ఎన్డీయే కూటమి.. ఇండియా కూటమి.. రెండింటికీ తాము సమానదూరం పాటిస్తామంటూ నవీన్‌పట్నాయక్ నేతృత్వంలోని బిజు జనతాదళ్ (బీజేడీ) ఈ ఎన్నికకు దూరంగా ఉంది. ఆ పార్టీకి లోక్‌సభలో ఒక్క ఎంపీ కూడా లేరు. రాజ్యసభలో ఏడుగురు సభ్యులున్నారు. ఇక.. రైతులకు యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయంటూ తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ ఈ ఎన్నికకు దూరంగా ఉంది. ఆ పార్టీకి కూడా లోక్‌సభలో ఎంపీలు లేరు. రాజ్యసభలో నలుగురు ఎంపీలున్నారు. ఇక.. దేశానికి ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి ముందుండే పంజాబ్‌కే ఇప్పుడు వరదలతో తీవ్ర కష్టం వస్తే అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ఆదుకోలేదంటూ శిరోమణి అకాలీదళ్ ఈ ఎన్నికకు దూరంగా ఉంది. ఆ పార్టీకి ఉన్న ఒకే ఒక ఎంపీ.. కేంద్ర మాజీ మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్. వీరు కాక మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు.

సైద్ధాంతిక పోరు సాగుతుంది: జస్టిస్ సుదర్శన్ రెడ్డి

ఉపరాష్ట్రపతి ఎన్నిక ఫలితాలు తనకు అనుకూలంగా లేనప్పటికీ.. తమ లక్ష్యం విలువ తగ్గిపోలేదని ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తన ప్రకటనలో తెలిపారు. ఇకపై మరింత తీవ్రంగా తమ సైద్ధాంతిక యుద్ధం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై పూర్తి విశ్వాసంతో తాను ఈ ఫలితాలను వినయంగా ఆమోదిస్తున్నానని చెప్పారు. తనకు లభించిన ఈ అవకాశమే ఎంతో గొప్పదని, ఎంతో గౌరవం కల్పించిందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యం విజయాల ద్వారానే పటిష్ఠం కాలేదని.. చర్చలు, నిరసన, భాగస్వామ్యం ద్వారా పరిపక్వం అవుతుందని తెలిపారు. ఉప రాష్ట్రపతి పదవికి ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు ఆయన అభినందనలు తెలియజేశారు.

లోకం తీరు



పేద దేశాలకు సవాల్‌గా మధుమేహం

» పరీక్షించుకోని 44 శాతం మంది

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద ఆరోగ్య సమస్యల్లో మధుమేహం ఒకటి. మధుమేహంతో బాధపడుతున్న చాలామందిలో అసలు తమకు ఈ సమస్య ఉన్నట్టే తెలియడం లేదు. 2023లో ప్రపంచంలోని మధుమేహ రోగుల్లో దాదాపు 44 శాతం మంది పరీక్షలకు దూరంగా ఉంటున్నారని తాజా అధ్యయనంలో గుర్తించారు. పేద, మధ్య ఆదాయ దేశాలకు ఈ పరిస్థితి ఒక సవాల్‌గా మారిందని ఈ అధ్యయనం పేర్కొంది. లాన్సెట్ డయాబెటిస్, ఎండోక్రినాలజీ జర్నల్‌లో ప్రచురించిన వివరాల ప్రకారం.. 2023లో భారత్‌లోని మధుమేహ జనాభాలో 43.6 శాతం మందికి వ్యాధి ఉన్నట్టు తెలీదు. అయితే వ్యాధి నిర్ధారణ అయిన వారిలో 97 శాతం మంది చికిత్స పొందుతున్నారని 'గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ (జీబీడీ)' పేరిట అధ్యయనం చేపట్టిన అంతర్జాతీయ పరిశోధకుల బృందం గుర్తించింది. 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా మధుమేహ రోగుల సంఖ్య 130 కోట్లకు చేరుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

'కోయంబత్తూరు వాజపేయి' సీపీఆర్

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తమిళనాడులో రథయాత్ర

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారత 15వ ఉపరాష్ట్రపతిగా తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్(సీపీఆర్) ఎన్నికవడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తిరుప్పూర్‌కు చెందిన వ్యాపార, వ్యవసాయ కుటుంబంలో సీకే పొన్నుస్వామి-కె.జానకి దంపతులకు 1957 అక్టోబరు 20వ తేదీన ఆయన జన్మించారు. సీపీఆర్‌కు భార్య సుమతి, ఇద్దరు పిల్లలున్నారు. తొలి నుంచి సౌమ్యుడిగా పేరున్న సీపీఆర్‌ను అందరూ ముద్దుగా 'కోయంబత్తూర్ వాజ్‌పేయి'గా పిలుచుకుంటారు. తూత్తుకుడిలోని వీవోసీ కాలేజీలో బీబీఏ చదివిన రాధాకృష్ణన్.. టేబుల్ టెన్నిస్‌లో కాలేజీ చాంపియన్. చిన్నతనం నుంచే ఆయన ఆర్ఎస్ఎస్, భారతీయ జనసంఘ్‌లతో మమేకమయ్యారు. 1974లో జనసంఘ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. అనంతరం 1980లో బీజేపీలో చేరారు. 1998 ఫిబ్రవరిలో కోయంబత్తూరులో వరుస బాంబు పేలుళ్లు జరిగాయి. అనంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి 1.50 లక్షల పైచిలుకు మెజారిటీతో విజయం సాధించారు. అనంతరం మళ్లీ 1999లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అదే స్థానం నుంచి 55 వేల వేట్ల మెజారిటీతో గెలిచి సత్తా చాటారు. 2004లో సీపీఐ నేత కె.సుబ్బరాయన్ చేతిలో పరాజయం పాలయ్యారు. 2014, 2019లలో కూడా ఆయన కోయంబత్తూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసినా విజయం సాధించలేకపోయారు. 2004 నుంచి రెండేళ్లపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించిన సీపీఆర్.. దేశవ్యాప్తంగా నదులను అనుసంధానించాలని, అంటరానితనాన్ని నిర్మూలించాలని, ఉగ్రవాదాన్ని తుదముట్టించాలని కోరుతూ 93 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా రథయాత్ర చేపట్టారు. తరువాత బీజేపీ జాతీయ కార్యవర్గంలోనూ పని చేశారు. 2016 నుంచి నాలుగేళ్లపాటు ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ పరిధిలోకి వచ్చే కొబ్బరి పీచు బోర్డుకు చైర్మన్‌గా వ్యవహరించారు.

నాలుగు రాష్ట్రాలకు గవర్నర్

సీపీఆర్‌కు పార్టీ పట్ల ఎనలేని విధేయత, భవిష్యత్ ప్రణాళికల వ్యూహరచన వంటి వాటిని గమనించిన ప్రధాని మోదీ.. ఆయనను గవర్నర్‌గా నియమించారు. అనతికాలంలోనే సీపీఆర్ నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా వ్యవహరించడం విశేషం. 2023 ఫిబ్రవరి 18వ తేదీన జార్ఖండ్ గవర్నర్‌గా పదవీప్రమాణం చేసిన సీపీఆర్.. తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఇన్‌చార్జ్ గవర్నర్‌గా కొంతకాలం అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2024 జూలై 27లో మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. దక్షిణ భారత వ్యక్తికి ఉపరాష్ట్రపతి పదవి ఇవ్వాలని నిర్ణయించిన ప్రధాని.. సీపీ రాధాకృష్ణన్‌ను ఎన్‌డీఏ అభ్యర్థిగా ఎంపిక చేశారు.

తమిళనాట నుంచి మూడో ఉపరాష్ట్రపతి

తమిళనాడు నుంచి ఇప్పటి వరకు ఇద్దరు ఉపరాష్ట్రపతి పదవిని అధిరోహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదట 1952 మే 13 నుంచి 1957 మే 13 వరకు ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ చైర్మన్‌గా వ్యవహరించారు.



చెన్నైలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంబరాలు చేసుకుంటున్న పార్టీ నేతలు, శ్రేణులు

ఆ తర్వాత ఐదేళ్లు కూడా ఆయన ఆ పదవిలో కొనసాగారు. అనంతరం ఆయన రాష్ట్రపతిగానూ వ్యవహరించారు. ఆయన తర్వాత కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్.వెంకట్రామన్ ఉపరాష్ట్రపతిగా (1984-1987) వ్యవహరించడంతో పాటు ఆ తరువాత రాష్ట్రపతి పదవిని కూడా అధిరోహించారు. నాలుగు దశాబ్దాల తరువాత మళ్లీ రాష్ట్రాన్ని ఉపరాష్ట్రపతి పదవి వరించింది. తమిళ ప్రాంతం నుంచి ఆ పదవికి ఎన్నికైన మూడో వ్యక్తిగా సీపీఆర్ రికార్డులకెక్కారు.

కొత్త దళపతి.. తిరుపతి!

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామకం!

చింతూరు, హైదరాబాద్, కోరుట్ల, కోరుట్ల రూరల్, చర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి (58) అలియాస్ దేవ్‌జీ నియమితులైనట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మావోయిస్టు పార్టీ అధికారికంగా ప్రకటించనప్పటికి, పోలీసు నిఘా వర్గాలు అవుననే అంటున్నాయి. సీపీఐ (మావోయిస్టు) పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఈ ఏడాది మే 21న ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన విషయం తెలిసిందే. నక్సలైట్ ఉద్యమం చరిత్రలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోవటం ఇదే ప్రథమం. తదుపరి ప్రధాన కార్యదర్శిగా పార్టీ ఎవరిని ఎంపిక చేస్తుందనే విషయమై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో మావోయిస్టు పార్టీలో నెంబర్ టూ స్థానంలో ఉన్న తిరుపతి పేరు బలంగా విన్పించింది. ఈ నేపథ్యంలోనే, ఆయన పార్టీ అధిపతిగా నియమితులయ్యారని, ఈ మేరకు మావోయిస్టు పార్టీ ఒక లేఖను విడుదల చేసినట్లు తాజాగా ప్రచారం జరుగుతోంది. తిరుపతి ప్రస్తుతం సెంట్రల్ మిలిటరీ కమిషన్ చీఫ్‌గా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్నారు. 2003లో తిరుపతిలోని అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన దాడిలో నంబాల కేశవరావుతో పాటు తిరుపతి పాత్ర ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. 2010లో దంతెవాడ సమీపంలో 74 మంది సెంట్రల్ రిజర్వ్ జవాన్లను పొట్టన పెట్టుకున్న నక్సల్స్ దాడికి తిరుపతి సారథ్యం వహించినట్లు ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. తిరుపతిపై ఎన్ఐఏ రూ.కోటి రివార్డు ప్రకటించినట్లు సమాచారం. మరోవైపు, దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన మాద్వి హిడ్మా అలియాస్ సంతోష్‌ని మావోయిస్టు పార్టీ నియమించిటనట్లు తెలుస్తోంది. గతంలో దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ అనేది లేనప్పటికీ పార్టీకి కొత్త రూపం తీసుకొచ్చేందుకు ఈ పోస్టుని పార్టీ కేటాయించినట్లు సమాచారం. బస్తర్ అడవుల్లోని దండకారణ్యంలో మాద్వి హిడ్మాకు మంచి పట్టుంది. దాడులు చేసి తప్పించుకోవటంలో ఆరితేరిన వ్యక్తిగా చెబుతుంటారు. హిడ్మా చేసిన పలు దాడుల్లో దాదాపు 200 మందికి పైగా పోలీసులు, జవాన్లు మృతి చెందినట్లు సమాచారం. అడవుల్లోని గిరిజనులతో మాద్వి హిడ్మా మమేకమై ఉంటాడని, పేదలకు సాయం చేస్తాడని.. అందువల్లే ఇంతకాలం పోలీసులకు దొరకలేదని ప్రచారం.

కోరుట్ల నుంచి అజ్ఞాతంలోకి..

తిరుపతి కరీంనగర్ జిల్లా కోరుట్లకు చెందినవారు. ఆయన తల్లిదండ్రులు గంగుబాయి, వెంకట నర్సయ్య. వారికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉండగా తిరుపతి పెద్ద కుమారుడు. పాఠశాల, ఇంటర్ విద్యను



జగిత్యాల జిల్లా కోరుట్లలోని తిరుపతి ఇల్లు; మాద్విహిడ్మా

తిరుపతి కోరుట్లలో పూర్తి చేశారు. 1978 సెప్టెంబరు 9న జగిత్యాలలో కొండపల్లి సీతారామయ్య వర్గం 'జగిత్యాల జైత్రయాత్ర' పేరుతో నిర్వహించిన భారీ బహిరంగ సభ తిరుపతిని విప్లవ రాజకీయాలవైపు మళ్లించినట్లు చెబుతారు. ఈ సభకు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన రైతులు, కూలీలు, ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. గణపతి, కిషన్‌జీ, శీలం నరేశ్, ఖైరి గంగారాం, గజ్జెల గంగారాం, ఓదెలు, గద్దర్ తదితరులు పాల్గొని ప్రజలను ఉత్తేజ పరిచారు. ఈ సభకు హాజరైన తిరుపతి అనంతరకాలంలో, 1983లో రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ)లో చేరారు. కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో నిర్బంధం పెరగడంతో 1984లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పెద్దపల్లి, గోదావరిఖని, జగిత్యాల, వరంగల్, హన్మకొండ తదితర ప్రాంతాల్లో దళ నాయకుడిగా, కార్యదర్శిగా, కమిటీ సభ్యుడిగా పని చేశారు. బీదర్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీ ఆయుధ కర్మాగార బాధ్యుడిగా ఆయన విధులు నిర్వహించినట్లు సమాచారం. ఆయుధాలు తయారు చేయడంలో తిరుపతికి ప్రావీణ్యం ఉందని చెబుతారు. పార్టీకి కార్యకర్తలను సమీకరించటం, వారికి శిక్షణ ఇవ్వటంలోనూ ఆయనది కీలకపాత్ర. మావోయిస్టు పార్టీలో తిరుపతి అంచెలంచెలుగా ఎదిగారు. ఆయనను ఆంధ్ర, తెలంగాణలో తిరుపతి అని పిలుస్తుండగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో దేవ్‌జీగా పిలుస్తారు. నల్లగొండకు చెందిన సృజనను తిరుపతి వివాహం చేసుకున్నారన్న ప్రచారం ఉంది. ఆపరేషన్ కగార్, వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో తిరుపతి పశ్చిమ బెంగాల్ వైపు వెళ్లి ఉంటారని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి.

లొంగిపో! పెదనాన్నా!..

ఈ ఏడాది మే 29న తిరుపతి తమ్ముడు గంగాధర్ కూతురు సుమ.. 'పెదనాన్నా! మావోయిస్టు ఉద్యమాన్ని వదిలిపెట్టి ప్రభుత్వానికి లొంగిపో!' అని కోరుతూ రాసిన లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తిరుపతి ప్రస్తుతం మావోయిస్టు పార్టీ సారథిగా బాధ్యతలు చేపట్టినట్లు వార్తలు వెలువడటంతో కోరుట్ల తదితర ప్రాంతాల్లో స్థానికంగా చర్చనీయాంశమైంది.

తెలుగు వ్యక్తులే సారథులు

నాటి పీపుల్స్‌వార్ నుంచి నేటి మావోయిస్టు పార్టీ వరకు సాయుధ పోరాటానికి తెలుగువారే సారథ్యం వహించే పరంపర కొనసాగుతోంది. తొలుత కొండపల్లి సీతారామయ్య, తరువాత ముప్పాళ్ల లక్ష్మణరావు, నంబాల కేశవరావు, నేడు తిరుపతి అలియాస్ దేవ్‌జీ పార్టీ చీఫ్‌లుగా బాధ్యతలు చేపట్టారు. వీరందరూ తెలుగు వారే కావడం విశేషం.

పెన్షన్ కోసం లైన్‌లో ఉన్న వృద్ధులపై రష్యా గ్లైడ్ బాంబు

» 21మంది మృతి.. 30మందికి గాయాలు

కీవ్, సెప్టెంబరు 9: ఉక్రెయిన్‌లో ఘోరం జరిగింది. మంగళవారం రష్యా ప్రయోగించిన గ్లైడ్ బాంబ్ ఒకటి డోనెస్క్ ప్రాంతంలోని యరోవా గ్రామంలో పెన్షన్ కోసం లైన్‌లో నిల్చున్న వృద్ధులపై పడింది. ఈ ఘటనలో 21మంది చనిపోయారు. దాదాపు 30మంది గాయపడ్డారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ విషయాన్ని వెల్లడించారు. రష్యా చర్యను తీవ్రంగా ఖండించారు. రష్యా దారుణాలపై ప్రపంచం మౌనంగా ఉండొద్దని కోరారు. మరిన్ని ఆంక్షలు విధించాలని విజ్ఞప్తి చేశారు. రష్యా దాడుల్లో ఉక్రెయిన్‌లో ఇప్పటివరకు 12వేల కంటే ఎక్కువ మంది సాధారణ పౌరులు మరణించినట్లు ఆయన వెల్లడించారు.

దోహాపై ఇజ్రాయెల్ బాంబులు

» ఇద్దరు హమాస్ నేతలు ముగ్గురు అంగరక్షకుల మృతి

టెల్‌అవీవ్, సెప్టెంబరు 9: ఖతార్ రాజధాని దోహాలో ఉన్న హమాస్ తిరుగుబాటుదారులే లక్ష్యంగా ఇజ్రాయెల్ మంగళవారం "ఆపరేషన్ జడ్జిమెంట్ అసెంబ్లీ" పేరుతో బాంబు దాడులు చేసింది. నగరంలోని ఖతారా జిల్లా పరిధిలో పలు చోట్ల పేలుళ్లు సంభవించాయని, ఆకాశంలో దట్టమైన పొగలు అలుముకున్నాయని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. హమాస్ సీనియర్ నాయకులను గురిపెట్టి, ఈ దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) తెలిపింది. ఈ దాడుల్లో హమాస్ నేతలు ఖలీల్-అల్-ఖాయా, ఖాలెద్ మషాల్‌తో పాటు.. వారి అంగరక్షకులు ముగ్గురు చనిపోయారని భావిస్తున్నట్లు పేర్కొంది. గాజాలోనూ మంగళవారం ఏడు టవర్లను లక్ష్యంగా చేసుకుని, జరిపిన దాడుల్లో హమాస్ నేతలు చనిపోయినట్లు తెలిపింది. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సైతం దోహా దాడులకు తమదే బాధ్యత అని ప్రకటించారు. ఈ దాడులను ఫ్రాన్స్, సౌదీ అరేబియా ఖండించాయి. సౌదీ యువరాజు సల్మాన్ ఇజ్రాయెల్ చర్యను అంతర్జాతీయ నేరంగా పేర్కొంటూ.. ఖతార్‌కు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

నోయిడా 'బిట్స్'లో ఏపీ విద్యార్థి కాల్చివేత!

చిలకలూరిపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా 'బిట్' క్యాంపస్‌లో ఎంబీఏ చదువుకుంటున్న తెలుగు విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన దివ్వెల దీపక్(23) నోయిడాలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బిట్)లో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హాస్టల్‌లో ఆగ్రాకు చెందిన దేవాన్ష్ చౌహాన్ అతనికి రూమ్‌మేట్. వీరిద్దరూ మంచి స్నేహితులని తెలుస్తోంది. ఏమైందో ఏమో కానీ... బుధవారం మధ్యాహ్నం వీరి మధ్య గొడవ మొదలైంది. రూంలో నుంచి కాల్పుల శబ్దం వినిపించడంతో సెక్యూరిటీ గార్డు హాస్టల్ వార్డెన్‌కు తెలియజేశారు. దీంతో సిబ్బంది బాల్కనీ గుండా పైకి ఎక్కి కిటికీ అద్దాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి తలుపు తీశారు. అప్పటికే దీపక్, దేవాన్ష్ రక్తపు మడుగులో పడి ఉన్నారు. తలలోకి బుల్లెట్ దిగడంతో దీపక్ అక్కడిక్కడే మరణించాడు. దీపక్‌ను కాల్చిన అనంతరం దేవాన్ష్ తనను తాను కాల్చుకుని ఉండొచ్చని పోలీసు అధికారులు అనుమానిస్తున్నారు. దీపక్ చిలకలూరిపేట మునిసిపల్ మాజీ కౌన్సిలర్ దివ్వెల రత్తయ్య కుమారుడు. కాల్పుల ఘటన గురించి తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు నోయిడాకు బయలుదేరి వెళ్లారు.

అగ్నిగుండం నేపాల్



అగ్ని కీలల్లో నేపాల్ పార్లమెంటు



పోలీసు జాకెట్ వేసుకొని నినాదం చేస్తున్న ఆందోళనకారుడు



పార్లమెంటు భవనంపై ఆందోళనకారులు



ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్‌ను తంతున్న ఆందోళనకారుడు

(మొదటిపేజీ తరువాయి)

విచక్షణారహితంగా పిడిగుద్దుల వర్షం కురిపించగా.. ఆర్థిక మంత్రిని నడిరోడ్డుపై తన్నుతూ.. తరిమి కొట్టారు. ఈ పరిణామాల మధ్య ప్రధాని కేపీ ఓలి రాజీనామా చేయగా.. దాన్ని ఆమోదించిన దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ కూడా తన పదవిని త్యజించారు. మాజీ ప్రధాని ప్రచండ పిలుపుతో యువత ఆందోళన పగ్గాలను అందుకునేందుకు కఠ్మాండూ మేయర్ బాలేంద్ర షా(బాలెన్) సిద్ధమయ్యారు. తాజా పరిణామాల నేపథ్యంలో నేపాల్‌లో పాలన పగ్గాలను ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ చేపట్టే అవకాశాలున్నాయి.

అర్ధరాత్రి నుంచి హింసాత్మక ఘటనలు

నేపాల్ పార్లమెంట్ వద్ద పోలీసులు సోమవారం రబ్బర్ బుల్లెట్లతో జరిపిన కాల్పుల్లో 20 మంది మరణించడంతో.. సోషల్ మీడియాను పునరుద్ధరించిన ప్రభుత్వం.. రాత్రి 10 గంటల సమయంలో మాటమార్చింది. ప్రభుత్వాదేశాలతో సైన్యం, పోలీసులు ప్రజల ఇళ్లలోకి వెళ్లి, వందల సంఖ్యలో యువతను అరెస్టు చేశారు. దీంతో.. అర్ధరాత్రి నుంచి నేపాల్ భగ్గుమంది. ప్రధాని ఓలి ఇంటిపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. వేర్వేరు సంఘటనల్లో మరో ఇద్దరు ఆందోళనకారులు మృతిచెందారు. దీంతో.. మంగళవారం ఉదయం నుంచి హింస ఉధృత రూపు దాల్చింది. సోషల్ మీడియాపై నిషేధం విధించాలని ఆదేశించిన సుప్రీంకోర్టు భవనాన్ని ఆందోళనకారులు టార్గెట్‌గా చేసుకున్నారు. సుప్రీంకోర్టుతోపాటు.. పలు న్యాయస్థానాలకు నిప్పుపెట్టారు. ప్రధాని ఓలి ప్రైవేటు ఇంటిని తగులబెట్టారు. దేశాధ్యక్షుడి నివాసం 'శీతల్ నివాస్', కార్యాలయాన్ని దహనం చేశారు. సోమవారం నాటి హింసకు సాక్షిగా ఉన్న పార్లమెంట్ భవనం అగ్నికీలల్లో మండిపోతున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. మాజీ ప్రధానులు– డాక్టర్ బాబూరాం భట్టరాయ్(నేపాల్ సోషలిస్ట్ పార్టీ చీఫ్), పుష్పకమల్ దహాల్(ప్రచండ), షేర్ బహదూర్ దేవుబా(నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు), జలనాథ్ ఖనాల్ ఇళ్లకు నిరసనకారులు నిప్పంటించారు. జలనాథ్ ఖనాల్ భార్య రాజ్యలక్ష్మి చిత్రాకర్ సజీవదహనమైనట్లు నేపాలీ పత్రికలు పేర్కొన్నాయి. అయితే.. కొన ఊపిరితో ఉన్న ఆమె ఆస్పత్రిలో చనిపోయినట్లు ఇండియాటుడే ప్రచురించింది. దేవుబా ఇంటిని తగులబెట్టడానికి ముందు ఆందోళనకారులు అక్కడున్న వారిపై భీకర దాడులు చేశారు. దేవుబా, ఆయన భార్య, నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి అర్జూరాణా దేవుబాపై విచక్షణారహితంగా దాడులు చేసిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. ఇక ఆర్థిక శాఖ మంత్రి, 65 ఏళ్ల వయసున్న బిష్ణు ప్రసాద్ పౌడెల్‌ను ఆందోళనకారులు వీధుల్లో తరిమికొట్టారు. ప్రభుత్వ ఆఫీసులకు నిప్పుపెట్టారు.

ఆర్మీ బ్యారెక్‌లకు ప్రముఖులు

నేపాల్‌లో హింస నేపథ్యంలో అధికారులు త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం సహా.. అన్ని ఎయిర్‌పోర్టులను మూసివేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద 300 మంది సైనికులు పహారాకాస్తున్నారు. ప్రముఖులు దేశం విడిచి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో.. సైన్యం తమ హెలికాప్టర్లలో వారిని ఆర్మీ బ్యారెక్‌లకు తరలించింది. కఠ్మాండూలోని ఆర్మీ బేస్‌లలో ప్రధాని ఓలి సహా.. పలువురు మంత్రులు, అధికారులు, వీఐపీలు ఉన్నట్లు తెలుస్తోంది.

రంగంలోకి ఆర్మీ..

'ఓలీ రాజీనామా చేయాలి..'.. 'కేపీ చోర్.. నేపాల్ చోడ్(కేపీ శర్మ ఓ దొంగ.. ఆయన నేపాల్‌ను వీడాలి)..'.. అంటూ యువత ఉద్యమం ఊపందుకోవడంతో.. మంగళవారం ఉదయం ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ సిగ్డెల్ ప్రధాని ఓలిని కలిశారు. "మీరు రాజీనామా చేస్తే తప్ప పరిస్థితి సద్దుమణిగేలా లేదు. మీరు రాజీనామా చేస్తే.. ఆందోళనల విరమణకు యువతను ఒప్పిస్తాం" అని ఆయన కోరినట్లు తెలిసింది. దాంతో ఓలి రాజీనామా చేశారు. ఆయన భరోసా ఇవ్వడంతోనే.. ఓలి దేశాన్ని వీడకుండా కఠ్మాండూలోనే ఉండిపోయినట్లు సమాచారం. ఆ వెంటనే "యువత సంయమనం పాటించాలి.. ఓలి రాజీనామా చేశారు" అంటూ ఓ ప్రకటన చేశారు. చర్చలకు రావాలంటూ యువతను ఆహ్వానించారు. ఈ పరిణామాలను బట్టి.. పాలనపగ్గాలను ఆర్మీ చీఫ్ తాత్కాలికంగా చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి. మంగళవారం రాత్రి 10 గంటల సమయం నుంచి కఠ్మాండూ సహా.. సమస్యాత్మకంగా మారిన జిల్లాల్లో ఆర్మీ మోహరించింది. యువత ఆందోళనలను వీడకుంటే.. కఠిన చర్యలు తీసుకునే అవకాశాలుంటాయంటూ మైకుల్లో హెచ్చరికలు జారీ చేసింది.

ప్రధాని పదవిపై బాలెన్, రవి ఫోకస్

తదుపరి నేపాల్ ప్రధానిగా కఠ్మాండూ మేయర్ బాలేంద్ర షా(బాలెన్) పేరు వినిపిస్తోంది. సోమవారం రాత్రే మాజీ ప్రధాని ప్రచండ యువత ఉద్యమానికి నాయకత్వం వహించాలని బాలెన్‌ను కోరడం గమనార్హం..! ప్రధాని రాజీనామా తర్వాత బాలెన్ యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఆందోళనలను విరమించుకోవాలని కోరారు. అయితే.. ఆందోళనకారులు మాత్రం.. రాజీనామాలు సరిపోవని, అవినీతి నాయకులను జైళ్లకు పంపాలని డిమాండ్ చేస్తున్నారు. బాలెన్ తర్వాత.. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ(ఆర్ఎస్‌పీ) అధ్యక్షుడు రవి లామిచానే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఓలి ప్రభుత్వం రవిని జైలులో పెట్టగా.. ఆయనను అధికారులు మంగళవారమే విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

జైళ్ల ధ్వంసం.. ఖైదీల పరారీ

నేపాల్ ఆందోళనలను పలు జైళ్లలోని ఖైదీలు అవకాశంగా మలచుకున్నారు. జలేశ్వర్ జైలులో 576 మంది ఖైదీలుండగా.. 575 మంది గేట్లను బద్దలుకొట్టి పారిపోయారు. కాస్కీ జైలులో 981 మంది ఖైదీల్లో 900 మంది, తులసీపూర్‌లో 179 మంది ఖైదీలకు గాను 124 మంది, నక్కీ జైలులో 90 మంది పరారయ్యారు. దీంతో.. పలు జైళ్లలో ఖైదీలు ఆందోళనలు చేశారు. ఆందోళనలు ఉధృతమవుతుండడంతో.. ఆయా జైళ్ల అధికారులు ఖైదీలను స్వచ్ఛందంగా విడుదల చేశారు. దేశవ్యాప్తంగా వివిధ జైళ్లనుంచి విడుదలైన/పారిపోయిన ఖైదీల సంఖ్య 6,500గా ఉన్నట్లు నేపాల్ పత్రికలు పేర్కొన్నాయి. కాగా, ఆందోళనకారులు పార్లమెంటు భవనంలో వస్తువులను, తుపాకులను ఎత్తుకెళ్లారు.

అగ్నికి 'టిక్ టాక్' ఆజ్యం

కఠ్మాండూ, సెప్టెంబరు 9 : నేపాల్‌ను కుదిపేస్తున్న డిజిటల్ యువ ఆందోళనలకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'టిక్‌టాక్' మరింత ఆజ్యం పోసింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, టిక్‌టాక్‌లోని 'న్యూ నేపాల్' అనే ఖాతాలో పోస్టు అయిన పలు ఫొటోలు, వ్యాఖ్యానాలు సోమవారం జరిగిన పార్లమెంటు ముట్టడిని ప్రేరేపించాయి. నేపాల్‌లో నిషేధం నుంచి తప్పించుకున్న ఒకే ఒక్క సామాజిక మాధ్యమం 'టిక్ టాక్'. ఇందులో 'సెప్టెంబరు 8' అనే శీర్షికతో పార్లమెంటు ఫొటోను 'న్యూ నేపాల్' పోస్టు చేసింది. అలాగే, తగలబడిపోతున్న పార్లమెంటు.. మంటలు ఆర్పుతున్న సిబ్బందికి చెందిన మరో ఫొటోను కూడా పోస్టు చేసింది.

ఎవరీ సుదన్ గురుంగ్?



సోషల్ మీడియాపై నిషేధాన్ని వ్యతిరేకిస్తూ నేపాల్‌లో బద్దలైన ఆందోళనల నేపథ్యంలో తెరపైకి వచ్చిన పేరు సుదన్ గురుంగ్ (36). ఈయన నడుపుతున్న ఎన్‌జీవో సంస్థ 'హమీ నేపాల్'... నేపాల్ ఆందోళనలకు నాయకత్వం వహిస్తోంది. డిజిటల్ కట్టడితో మొదలైన ఉద్యమం గురుంగ్ చొరవతో ఇప్పుడు పౌర ఉద్యమంగా రూపుదాల్చింది. నేపాల్‌లో శాంతియుత ఆందోళనలకు పిలుపునిస్తూ ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో మొదటినుంచీ పోస్టులు పెడుతూ వచ్చారు. అంతేకాదు, ఆందోళనలు మొదలయితే.. ఏఏ మార్గాలు పోరాటాలకు అనుకూలం, ఎక్కడెక్కడ అప్రమత్తంగా ఉండాలనేది ముందస్తుగానే గురుంగ్ సూచించేవారు. గురుంగ్ పేరు నేపాల్‌లో తొలిసారి 2015 భూకంపం సమయంలో వినిపించింది. ఆ భూకంపంలో సొంత కుమారుడిని ఆయన కోల్పోయారు. ఆ ఘటన తర్వాత ఎన్‌జీవోను పెట్టారు. ఈవెంట్ మేనేజర్‌గా చేస్తున్న పనిని మానివేసి పూర్తి కాలం పౌర ఉద్యమకారుడిగా మారారు.

ఏపీ భవన్‌లో ప్రత్యేక సెల్

న్యూఢిల్లీ/శ్రీకాకుళం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో.. ఆ దేశంలో చిక్కుకున్న తెలుగు వారి తక్షణ సహాయార్థం ఏపీ ప్రభుత్వం న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో అత్యవసర సెల్‌ను ఏర్పాటు చేసింది. పర్యాటకం నిమిత్తం నేపాల్‌కు వెళ్లి అక్కడి హోటళ్లలో చిక్కుకుపోయిన తెలుగు పౌరుల సహాయార్థం ఈ సెల్ పనిచేస్తుంది. సహాయం కోసం +91 9818395787 నంబరులో సంప్రదించవచ్చని తెలిపింది. మానస సరోవర్ యాత్రకు వెళ్లి నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగువారు ఆందోళన చెందవద్దని, తాము అండగా ఉంటామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ భరోసా ఇచ్చారు. మరోవైపు, నేపాల్ పరిణామాలపై భారత్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. హింస నేపథ్యంలో నేపాల్‌లో ఉన్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని కోరింది.



నేపాల్ అధ్యక్ష నివాసం



నేపాల్ సుప్రీంకోర్టు

ఆపరేషన్ సిందూర్ వేళ ప్రధాని మోదీ, ఆర్మీ చీఫ్ మధ్య విభేదాలు

» దాయాది దేశం పాకిస్థాన్ దుష్ప్రచారం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: భారత్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ వేదికలపైనే అబద్ధాలు ప్రచారం చేసే అలవాటున్న పాకిస్థాన్.. ఇప్పుడు 'ఆపరేషన్ సిందూర్'పై ఇంటర్‌నెట్ వేదికగా ఫేక్ ప్రచారం చేస్తోంది. ఆ ఆపరేషన్ చేపట్టినప్పుడు భారత ప్రధాని మోదీకి- ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీకి మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నాయని.. మనవద్ద ఉన్న ఆయుధ వ్యవస్థలను పెద్ద ఎత్తున ఆధునికీకరించనిదే సైన్యం యుద్ధం చేయబోదంటూ ద్వివేదీ మోదీకి చెప్పారని.. సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తోంది. ఈ ఫేక్ ప్రచారాన్ని 'ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో నిజనిర్ధారణ విభాగం' తీవ్రంగా ఖండించింది. "భారత ప్రధాని మోదీకి- ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీకి మధ్య విభేదాలు నెలకొన్నట్లు పాకిస్థాన్‌కు చెందిన కొన్ని (ఎక్స్) ఖాతాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మకండి. ఆ ఆరోపణలు అసత్యం" అని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ యూనిట్ పేర్కొంది.

'సిందూర్'లో 400 మంది ఇస్రో శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: ఆపరేషన్ సిందూర్ సమయంలో 400 మందికిపైగా ఇస్రో శాస్త్రవేత్తలు 24 గంటలూ పనిచేశారని, ఎర్త్ అబ్జర్వేషన్, కమ్యూనికేషన్ ఉపగ్రహాల ద్వారా మన సైన్యానికి తగిన సహకారం అందించారని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. జాతీయ భద్రత అవసరాల మేరకు తమ సంస్థ ఉపగ్రహ సమాచారాన్ని అందించిందన్నారు. మంగళవారం ఢిల్లీలో ఓ సదస్సులో ఆయన మాట్లాడుతూ 'ఆపరేషన్ సిందూర్ సమయంలో అన్ని అవసరాలూ తీరుస్తూ ఉపగ్రహాలన్నీ 24/7 పర్ఫెక్ట్‌గా పనిచేశాయి. 400 మందికి పైగా శాస్త్రవేత్తలు 24/7 పనిచేస్తూ.. ఎర్త్ అబ్జర్వేషన్, కమ్యూనికేషన్ కోసం అన్ని ఉపగ్రహాలనూ పూర్తి సమయం వినియోగించారు' అని తెలిపారు.

నిరుడు బంగ్లా.. నేడు నేపాల్

ఉద్యమాల ఉధృతికి 'పొరుగు' నేతలు పతనం!



అవినీతి, నిరుద్యోగం, ఆర్థిక అవకతవకలు, అసమర్థ పాలన భారత ఉపఖండంలోని కొన్ని దేశాలకు శాపంగా మారుతున్నాయి. వీటిని సహించలేని యువత ఉద్యమోన్ముఖులై.. ప్రత్యక్ష కార్యాచరణకు దిగడంతో రెండు దేశాల ప్రధానులు పదవీచ్యుతులయ్యారు. గత ఏడాది బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ఈ ఉద్యమానికి బలి కాగా.. ఈసారి వంతు నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలిది. హసీనా భారత్‌లో ఆశ్రయం సంపాదించగా.. ఓలి దుబాయ్ వెళ్తున్నట్లు సమాచారం. 2022లో శ్రీలంకలో అధ్యక్షుడు గొటబయ రాజపక్ష, ఆయన అన్న-ప్రధాని మహీంద రాజపక్షను ఆందోళనకారులు తరిమికొట్టిన సంగతి తెలిసిందే. నేపాల్, బంగ్లాల్లో సంభవించిన ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల్లో సారూప్యతలు కనిపిస్తున్నాయి. బంగ్లాదేశ్ ఆవిర్భావానికి మూలకారణం.. తూర్పు పాకిస్థాన్‌లోని బెంగాలీలపై.. పాక్ పంజాబీల ఆధిపత్యం. రాజకీయంగా, ఉద్యోగపరంగానే గాక భాష, సాంస్కృతికపరంగానూ బెంగాలీలను అణచివేసేందుకు పాక్ పాలకులు చేసిన ప్రయత్నాలతో.. బెంగాలీల ఉద్యమం పతాక స్థాయికి చేరి.. బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసింది. ఈ ఉద్యమానికి అవామీలీగ్ పార్టీ నాయకత్వం వహించింది. 50 ఏళ్ల తర్వాత సీన్ రివర్స్ అయింది. అదే అవామీలీగ్ ప్రభుత్వాన్ని నడుపుతున్న షేక్ హసీనాను ఉద్యమకారులు పదవీచ్యుతురాలిని చేశారు. ఆమె సర్కారు నిరంకుశంగా వ్యవహరిస్తోందని.. ఆమెను తొలగించాలంటూ విద్యార్థులు రోడ్లెక్కారు. ఒకప్పుడు విప్లవాన్ని ముందుండి నడిపిన పార్టీ.. మరో విప్లవం కారణంగా రాజకీయంగా తెరమరుగైంది.

ఓలీ గతంలో సఫలం.. ఇప్పుడు విఫలం

నేపాల్లో రాడికల్ వామపక్షవాదులు రాచరిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశారు. 2008 మేలో రాచరిక పాలనను రద్దుచేశారు కూడా. ఆ రద్దు చేసిన సంకీర్ణ ప్రభుత్వంలో కేపీ శర్మ ఓలికి చెందిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యునిఫైడ్ మార్క్సిస్ట్-లెనినిస్ట్) కూడా భాగస్వామి. ప్రజాస్వామ్య విధానానికి మారినా పరిస్థితుల్లో మార్పు రాకపోవడంతో ఇటీవలి కాలంలో తిరిగి రాచరిక పాలన రావాలని నేపాల్ సమాజంలోని ఓ వర్గం కోరుతోంది. ఆ మధ్య రోడ్డెక్కి భారీఎత్తున ఉద్యమించింది కూడా. దానిని అణచివేయడంలో ఓలి సఫలమయ్యారు. కానీ ఇప్పుడు తన ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా 'జెన్-జడ్' చేపట్టిన ఉద్యమ ధాటికి ఓలి రాజీనామా చేయాల్సి వచ్చింది.

బంగ్లాదేశ్‌లో అణచివేతపై ప్రతిఘటన

బంగ్లా స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న సమరయోధుల సంతానానికి ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించడంపై బంగ్లాదేశ్‌లో యువత తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీనివల్ల తమకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయన్న ఆందోళన వారిలో ఉంది. ఈ రిజర్వేషన్లను వాస్తవానికి హసీనా ప్రభుత్వం 2018లోనే తొలగించింది. కానీ గత ఏడాది జూన్‌లో దిగువ కోర్టు ఆ కోటాలను పునరుద్ధరించింది. దానిని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అన్ని రకాల రిజర్వేషన్‌ను 93 శాతానికే పరిమితం చేసింది. అయితే దిగువ కోర్టు నిర్ణయంతో అప్పటికే యువత ఉద్యమబాట పట్టారు. రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా బంగ్లా సుప్రీంకోర్టు నిర్ణయం వెలువరించినా.. ఉద్యమం ఉధృత రూపం దాల్చింది, హసీనా ప్రభుత్వం ఉక్కుపాదంతో వారిని అణచివేయాలని చూసింది. 1,500 మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. అయినా యువత వెనుదీయలేదు.

నేపాల్‌లో అవినీతి, బంధుప్రీతి ..

నేపాల్లో రాజకీయ నేతలు, అధికారుల సంతానం, బంధుమిత్రులకే ప్రభుత్వ ఉద్యోగాలు దక్కుతుండగా.. మిగతా సాధారణ యువత మాత్రం నిరుద్యోగంలో మగ్గుతోంది. దీనిపై 'నెపోకిడ్స్' హ్యాష్‌టాగ్‌తో ఆందోళనకారులు నిరసనలు మొదలుపెట్టారు. ఈ సమయంలోనే ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై ఓలి ప్రభుత్వం నిషేధం విధించింది. దీనిపై యువత రోడ్డెక్కారు. వారిని అణచివేసేందుకు భద్రతాబలగాలు కాల్పులు, బాష్పవాయు ప్రయోగం చేశాయి. 20 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత ఆయా ప్లాట్‌ఫామ్స్‌పై నిషేధం ఎత్తివేసినా.. ప్రాణనష్టం చూసిన యువత 'జెన్-జడ్' పేరిట ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేశారు. నేతల అవినీతి, బంధుప్రీతికి వ్యతిరేకంగా పోరాటం పెంచారు. ఫలితంగా ఓలీ రాజీనామా చేశారు. - సెంట్రల్ డెస్క్

ఈవీఎంలతోనే స్థానిక ఎన్నికలు!

» అందుబాటులో 10,670 ఈవీఎంలు

» రాష్ట్రానికి మరిన్ని అవసరమని అంచనా

» పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల కమిషనర్లతో ఎస్ఈసీ సాహ్నీ భేటీ

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల(ఈవీఎం) ద్వారా చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖ కమిషనర్లు.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ) నీలం సాహ్నితో మంగళవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో 1.36 లక్షల వార్డుల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున ప్రతి వార్డ్‌కు ఒక ఈవీఎంను వాడాల్సి ఉంటుంది. విడతల వారీగా నిర్వహించే ఈ ఎన్నికలకు ఎన్ని ఈవీఎంలు అవసరమవుతాయన్న అంశంపై చర్చించారు. ఇతర రాష్ట్రాల నుంచి అద్దె ప్రాతిపదికన తీసుకునేందుకు ఎంత మేరకు అవకాశముంది?. తదితర విషయాలపై చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు 41,301 కంట్రోల్ యూనిట్లు, 82,602 బ్యాలెట్ యూనిట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇప్పటి వరకు స్థానిక సంస్థల్లో బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించారు. అయితే, కేంద్ర ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థల్లో కూడా ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించేలా ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈవీఎలంకు సంబంధించి సమాచారం సేకరిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో 10,670 ఎం-2 మోడల్ ఈవీఎంలు అందుబాటులో ఉన్నాయి. కేంద్రం స్థానిక ఎన్నికల కోసం ఎస్-3 మోడల్‌ను ప్రతిపాదిస్తోంది. ఈ నేపథ్యంలో మిగిలిన ఈవీఎంలను కొనుగోలు చేయడమా? లేక ఇతర రాష్ట్రాల నుంచి అద్దె ప్రాతిపదికన తీసుకుని వాడుకోవడమా? ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని అధికారులు తెలిపారు. మధ్యప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇప్పటికే ఈవీఎంలు వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో మన రాష్ట్రంలో కూడా ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్నారు.

మన కంటే ప్రధానికే బాగా తెలుసు!

మద్యం స్కాంలో వైసీపీ అడ్డంగా దొరికింది: లోకేశ్

» ఇక ప్రతి ఏటా డీఎస్సీ నోటిఫికేషన్

» మీడియాతో ఇష్టాగోష్ఠిలో విద్యామంత్రి

> 2009, 14, 19 ఎన్నికలను తీసుకుంటే 14 వేల పోలింగ్ బూత్‌ల పరిధిలో టీడీపీకి మెజారిటీ రాలేదు. గత ఏడాది ఎన్నికల్లో 90 శాతం బూత్‌లలో కూటమికి అనుకూలంగా ఓట్లు పడ్డాయి. ఈ ఎన్నికలు 'జగన్ వర్సెస్ జనం'గా జరిగాయి. - మంత్రి లోకేశ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో ఏం జరిగిందో మనందరి కంటే ప్రధాని మోదీకి బాగా తెలుసని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ అన్నారు. ప్రధానితో ఇటీవలి భేటీలో తానేమీ ప్రత్యేకంగా వైసీపీ గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లలేదని చెప్పారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాజకీయంగా, అభివృద్ధిపరంగా ప్రధాని తనకు సలహాలిచ్చారని చెప్పారు. యోగాంధ్రను నెల రోజులు ఎలా నిర్వహించామో.. జీఎస్టీ సంస్కరణలను కూడా అదేవిధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, మేకిన్ ఇండియాను ప్రమోట్ చేయాలని సూచించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఫీడ్‌బ్యాక్ తీసుకున్నానని, ప్రధాని రాజకీయ ఇన్‌పుట్స్ ఇచ్చారని చెప్పారు. రాష్ట్రంలో కూటమి పాలనలో గంజాయి సాగు భారీగా తగ్గిందని చెప్పారు. 100 శాతం నిర్మూలించేందుకు మరికొంత సమయం పడుతుందన్నారు. నక్సలిజం దాదాపు అంతిమ దశకు చేరుకుందన్నారు. లోకేశ్ ఇంకా ఏం చెప్పారంటే..

అవినీతి జరగలేదని ఎవరూ అనడం లేదు..

లిక్కర్ స్కాంకు సంబంధించి వైసీపీలో ఏ ఒక్కరూ కూడా అవినీతి జరగలేదని చెప్పడం లేదు. ఆ పార్టీ ఈ కుంభకోణంలో అడ్డంగా దొరికింది. వైసీపీ హయాంలో జరిగిన కుంభకోణాలు వాటంతట అవే బయటకు వస్తాయి. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉంది. సీబీఐ దర్యాప్తు చేస్తోంది. ఆ విషయంలో నేనెలా జోక్యం చేసుకుంటాను? న్యాయ ప్రక్రియను అడ్డుకోవడంలో జగనే నిష్ణాతుడు. జగన్ హయాంలో ఒక్క మెడికల్ కాలేజీని కూడా కట్టలేదు. పులివెందుల మెడికల్ కాలేజీ బిల్డింగ్ మాత్రమే కట్టారు. ఆస్పత్రి నిర్మాణం పూర్తికాలేదు. మిగతా మెడికల్ కాలేజీలకు పునాదులు మాత్రమే వేశారు. కొత్త కాలేజీలన్నీ 2028 వరకు నిర్వహణలోకి వస్తాయి. పాఠశాల విద్య ప్రణాళికను ఒకేసారి మార్చడం కుదరదు. ఏటా ఒక్కో తరగతికి మార్చాల్సి ఉంటుంది. మెగా డీఎస్సీ నోటిఫికేషన్, పరీక్ష నిర్వహణ, ఫలితాల వెల్లడి, నియామకాల భర్తీని ఒకే క్యాలెండర్ ఇయర్‌లో చేపట్టాం. ఇక నుంచి ప్రతి ఏటా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం. విశాఖలో టీసీఎస్ ఈ నెల లేదా అక్టోబరులో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత కాగ్నిజెంట్ కూడా మొదలవుతుది. గత ఎన్నికల్లో టీడీపీకి సీమ ప్రజలిచ్చిన మద్దతును నిలబెట్టుకుంటాం. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో టీడీపీ పోటీ చేయదు. అక్కడ ఏ పార్టీకి మద్దతిచ్చేదీ చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారు.

మూడేళ్లలో అమరావతి

రాజధాని అమరావతి నిర్మాణం మూడేళ్లలో తుది దశకు చేరుకుంటుంది. ఉండవల్లిలో ఇప్పుడు మేమున్న ఇంట్లో ఇటీవల చిన్న మార్పులు చేశాం. ఇందుకు ప్రభుత్వ నిధులు ఖర్చు చేయలేదు. అమరావతిలో కడుతున్న సొంత ఇంటికి కూడా మా సొంత నిధులు ఖర్చుచేస్తున్నాం. వచ్చే జనవరి, ఫిబ్రవరికల్లా ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1, ఇతర ఉన్నతాధికారులు రాజధానిలో నిర్మించిన భవనాల్లోకి వెళ్తారు. అమరావతిలో దేశంలోకెల్లా అతిపెద్ద స్టేడియాన్ని నిర్మిస్తాం.



కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో లోకేశ్

మీ విజయ రహస్యమేంటి?

» జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో లోకేశ్

కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను రాష్ట్ర మంత్రి లోకేశ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పోటీ చేసిన తొలి ఎన్నిక నుంచి గత నాలుగు విడతలుగా మెజారిటీ పెంచుకుంటూ గెలిచిన పాటిల్‌ను లోకేశ్ అభినందించారు. ఇంతలా ప్రజల అభిమానాన్ని చూరగొనడం వెనుక రహస్యం ఏమిటని వాకబు చేశారు. ఏపీలో గత 15నెలలుగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కేంద్ర మంత్రికి వివరించారు. గుజరాత్‌లోని నవసారి లోక్‌సభ స్థానం నుంచి సీఆర్ పాటిల్ వరుసగా నాలుగుసార్లు ఎన్నికయ్యారు.

మూడు రోజులు భారీ వర్షాలు!

» దక్షిణ కోస్తాలో కొనసాగనున్న ఎండ తీవ్రత

అమరావతి/విశాఖపట్నం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో మంగళవారం కోస్తాలో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు పడ్డాయి. గుంటూరు జిల్లా నల్లపాడులో 7.1, కాకుమానులో 5.2 సెంటీమీటర్ల వాన పడింది. దక్షిణ కోస్తాలో ఎండ తీవ్రంగా ఉంది. కావలిలో 39.2, నెల్లూరులో 39.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం నుంచి రెండు, మూడు రోజులపాటు కోస్తాలో ఎక్కువచోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 3 రోజులు అక్కడక్కడా పిడుగులతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవొచ్చని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

సీఎం వ్యాఖ్యల మార్ఫింగ్‌పై కేసు

» తప్పుడు ప్రచారాలపై చర్యలు: సైబర్ క్రైమ్స్ ఐజీ రవికృష్ణ

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఫేక్ వీడియోలు ప్రచారం చేస్తున్నవారిపై రాష్ట్ర పోలీసు యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. కృత్రిమ మేధ సహకారంతో డీప్‌ఫేక్ టెక్నాలజీని ఉపయోగించి సీఎంపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కేసు నమోదు చేసింది. చంద్రబాబు రైతులను ఉద్దేశించి "అధిక మొత్తంలో యూరియా వాడటం, పురుగుమందులను పిచికారీ చేయడం రైతుల ఆరోగ్యానికి హానికరం కాబట్టి, ఈ పనుల కోసం డ్రోన్లను ఉపయోగించడం, వాటిని సబ్సిడీ మీద రైతులకు అందించడం గురించి ఆలోచిస్తున్నాం" అని తెలిపారు. ఈ వ్యాఖ్యలను సామాజిక మాధ్యమాల్లో వక్రీకరించారు. 'సీబీఎన్ వార్నింగ్ టు ఏపీ ఫార్మర్స్ .. జైల్లో వేస్తాం' అన్న శీర్షికతో ఫేక్ వీడియో ఫేస్‌బుక్, ఎక్స్ ఇన్‌స్టాగ్రామ్‌లలో చక్కర్లు కొడుతోంది. ఆ వీడియోలో చూపిన సమాచారం వాస్తవానికి విరుద్ధంగా ఏఐ సహకారంతో డీప్ ఫేక్ టెక్నాలజీతో సృష్టించినట్లు తేలడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్స్ విభాగం ఐజీ రవికృష్ణ తెలిపారు.

తెలంగాణలో గ్రూప్-1 ఫలితాల రద్దు

హైదరాబాద్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గ్రూప్-1 మెయిన్ పరీక్షల్లో మెరిట్ సాధించి.. ఉద్యోగాలకు ఎంపికై.. నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఆ రాష్ట్ర హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గ్రూప్-1 మెయిన్ పరీక్షల అనంతరం టీజీపీఎస్సీ ప్రకటించిన తుది మార్కుల జాబితాను, సాధారణ ర్యాంకుల జాబితాను హైకోర్టు మంగళవారం రద్దు చేసింది. మెయిన్స్‌కు హాజరైన మొత్తం అభ్యర్థుల సమాధాన పత్రాలను పునర్ మూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీకి ఆదేశించింది. పునర్ మూల్యాంకనంలో మోడరేషన్ పద్ధతిని అవలంబించాలని, మాన్యువల్‌గా పేపర్లు దిద్దాలని పేర్కొంది. పునర్ మూల్యాంకనం చేపట్టకపోతే మెయిన్ పరీక్షలను మొత్తం రద్దు చేస్తామని జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు ధర్మాసనం స్పష్టం చేసింది.

ఫార్ములా ఈ రేసులో క్విడ్ ప్రో కో!

» హెచ్ఎండీఏ 45 కోట్లు చెల్లించగానే బీఆర్ఎస్‌కు 44 కోట్ల విరాళం

హైదరాబాద్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ నిందితుడిగా ఉన్న ఫార్ములా-ఈ కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగిందని ఏసీబీ తేల్చిందని సమాచారం. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హెచ్ఎండీఏ ఖాతా నుంచి రూ.45 కోట్ల మేర నిధులు ఫార్ములా ఈ కారు రేస్‌లో భాగస్వాములైన కంపెనీకి బదిలీ చేయడం.... ఆ కంపెనీల నుంచి ఎన్నికల బాండ్ల రూపంలో తిరిగి 44 కోట్ల నిధులు బీఆర్ఎస్‌కు రావడం స్పష్టంగా కనిపిస్తోందని ఏసీబీ అంచనాకు వచ్చింది. దీనికి సంబంధించి పలు ఆధారాలను ఏసీబీ సేకరించిందని తెలిసింది. క్విడ్ ప్రో కో ఫలితంగానే ఫార్ములా రేసింగ్‌లో ఏ మాత్రం అనుభవం లేని ఏస్ నెక్స్ట్‌జెన్ భాగస్వామి అయ్యిందని ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆ వివరాలను తాజాగా ప్రభుత్వానికి పంపించిన నివేదికలో పొందుపరిచారు.

పంచాయతీరాజ్‌లో

పదోన్నతుల జాతర

అన్ని కేడర్లలో కలిపి 10 వేల మందికి ప్రమోషన్లు

» ఇప్పటికే 6 వేల మందికి పదోన్నతి

» గ్రామ సచివాలయాల్లోకి వెళ్లే ఇంకో 4 వేల మందికి కూడా

» పాలనా సంస్కరణలు చేపట్టడం వల్లే!

» సిబ్బందిపై అభియోగాల పరిష్కారానికి వినూత్నంగా అదాలత్‌లు

» అక్కడికక్కడే జరిమానాలు..

» వెంటనే పదోన్నతులకు లైన్ క్లియర్

» సీఎం, డిప్యూటీ సీఎంకు ఉద్యోగుల కృతజ్ఞతలు



అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతుల జాతర నడుస్తోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా వేల సంఖ్యలో ఉద్యోగులు ప్రమోషన్లు పొందుతున్నారు. అధికారులు, ఉద్యోగులపై ఏళ్ల తరబడి చిన్నపాటి ఆరోపణలు కొనసాగుతుండడం.. ఎన్నో ఏళ్లుగా డిపార్ట్‌మెంటల్ ప్రమోషనల్ కమిటీ (డీపీసీ) భేటీలు నిర్వహించకపోవడం, ఎంపీడీవోలకు గతంలో ప్రమోషన్ చానల్ లేకపోవడంతో పదోన్నతులు లేక ఉద్యోగులు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. ఇప్పుడు వారిలో ఒకేసారి 6 వేల మందికి పైగా పదోన్నతులు లభించాయి. గ్రామ/వార్డు సచివాలయ శాఖ సిబ్బందిని కూడా ఈ శాఖ నుంచే తీసుకుంటుండడంతో సుమారు మరో 4 వేల మంది పంచాయతీరాజ్ సిబ్బందికి పదోన్నతులు దక్కనున్నాయి. అంటే 10 వేల మందికి పంచాయతీరాజ్‌లో పదోన్నతులు రావడంతో ఉద్యోగులు సంబరాలు చేసుకుంటున్నారు. పంచాయతీరాజ్, గ్రామ సచివాలయాల్లో చేపట్టిన పరిపాలనా సంస్కరణల వల్లే ఇది సాధ్యపడింది.

పంచాయతీరాజ్ సంస్కరణలతో పెరిగిన పోస్టులు...

రాష్ట్ర పంచాయతీరాజ్‌లో స్వాతంత్ర్యానంతరం ఎప్పుడు చేపట్టని సంస్కరణలను కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికారులు రాత్రింబవళ్లు కృషి చేసి వీటికి రూపకల్పన చేశారు. ఈ శాఖలో డీపీవో, జడ్పీ, గ్రామ పంచాయతీలు.. ఇలా మూడు రకాలుగా ఉన్న వ్యవస్థలను ఏకం చేయడం ద్వారా పాలనను సులువు చేశారు. దీంతో పాటు గ్రామ సచివాలయాల్లో పంచాయతీరాజ్ సిబ్బంది కీలకం కావడంతో మరిన్ని అవకాశాలు ఈ శాఖ ఉద్యోగులకు దక్కాయి. ఎంపీడీవోలు పదోన్నతులు పొంది డీఎల్‌డీవోలుగా మారినప్పటికీ గత ప్రభుత్వం వారి సేవలు వినియోగించుకోవడంలో విఫలమైంది. తాజాగా కూటమి ప్రభుత్వం వారి సేవలను విస్తృతంగా ఉపయోగించుకునేందుకు చర్యలు తీసుకుంది. పంచాయతీరాజ్ కమిషనర్‌గా కృష్ణతేజ, ఉపముఖ్యమంత్రి ఓఎస్‌డీగా ఉన్న అదనపు కార్యదర్శి వెంకటకృష్ణ, ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఈ శాఖలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. సుమారు లక్ష మందికి పైగా పనిచేసే పంచాయతీరాజ్ శాఖలో ఇప్పటికే 6 వేల మందికి పదోన్నతులు దక్కాయి. 53 మంది ఎంపీడీవోలకు పదోన్నతులు కల్పించి డీఎల్‌డీవోలుగా నియమించారు. వీరికి ఆర్‌డీవో తరహాలో విశేష అధికారాలు కల్పించారు. సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లకు పదోన్నతులు కల్పించి సుమారు 300 మందిని ఎంపీడీవోలుగా నియమించారు. గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులు సుమారు 3 వేల మందికి పదోన్నతులు లభించాయి. అదే విధంగా సచివాలయాల్లో పనిచేసే 2 వేల మందికిపైగా గ్రేడ్-5, గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు దక్కాయి. ఇలా పంచాయతీరాజ్‌లో అన్నీ కేటగిరీలకు సంబంధించి సుమారు 6 వేల మంది దాకా పదోన్నతులు పొందారు. గ్రామ సచివాలయాల్లో సంస్కరణలు ప్రారంభించడంతో అక్కడ కూడా పంచాయతీరాజ్ సిబ్బందికి పోస్టులు దక్కనున్నాయి. గ్రామీణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్‌శాఖ, గ్రామ సచివాలయాల్లో భారీ సంఖ్యలో సిబ్బందిని నియమించడంతో భారీగా పదోన్నతులకు అవకాశమేర్పడింది.

ఓఎస్‌డీ చొరవ, కమిషనర్ కృషితో..

ఉపముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ పంచాయతీరాజ్‌శాఖలో సుదీర్ఘ అనుభవం ఉన్న అధికారి. శాఖలో ఏళ్ల తరబడి పదోన్నతులు లేక.. వీడీవోలుగా చేరిన వారు వీడీవోలుగానే రిటైరవుతుండడం చూసిన ఆయన.. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడం ద్వారా గ్రామీణాభివృద్ధిని పరిగెత్తించాలని భావించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు చెప్పి ఒప్పించారు. పంచాయతీరాజ్ శాఖలో ఉన్న చట్టాలు, ఉత్తర్వులను అధ్యయనం చేసిన ఆయన పకడ్బందీ ప్రణాళికతో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అందుకోసం ఉద్యోగు సంఘాలతో, అధికారులతో పలు సమావేశాలు నిర్వహించారు. కేరళ నుంచి రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ ఆయనకు చేదోడు వాదోడుగా నిలిచారు. ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ వారి వెన్నుతట్టి ప్రోత్సహించడంతో ప్రతి రోజూ ఏదో ఒక కేడర్ ఉద్యోగులకు పదోన్నతుల డీపీసీ సమావేశం జరుగుతోంది. ఒక్క పైసా చేతులు మారకుండా 10 వేల మంది పదోన్నతులివ్వడంతో హర్షం వ్యక్తమవుతోంది.

ఆ ఉద్యోగులకు ఊరట...

పంచాయతీరాజ్‌శాఖలో ఎన్నో దశాబ్దాలుగా చిన్నపాటి ఆరోపణలతో అభియోగాలు నమోదై పదోన్నతులకు నోచుకోని ఉద్యోగులు చాలా మందే ఉన్నారు. వారు పంచాయతీరాజ్ కమిషనరేట్ చుట్టూ, రాష్ట్ర సచివాయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నెలల తరబడి తిరిగినా ఆరోపణలు క్లియర్ కావడం లేదు. ఇవి పెద్ద తప్పులు కాకపోయినా ఈ అభియోగాలు వారి ఉద్యోగోన్నతికి ఆటంకంగా ఉన్నాయి. ఇలాంటి ఉద్యోగులకు ఊరట కలిగించేందుకు కృష్ణతేజ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాల్లోనే పంచాయతీరాజ్ ఉద్యోగులకు అదాలత్‌లు నిర్వహించాలని నిర్ణయించారు. పంచాయతీరాజ్ కమిషనరేట్ అధికారులు జిల్లాలకు వెళ్లి ఈ అదాలత్ నిర్వహిస్తారు. ఆయా సిబ్బందిపై ఉన్న అభియోగాలను అక్కడికక్కడే పరిష్కరించి వారికి జరిమానాలు విధిస్తారు. వెంటనే వారి పదోన్నతులకు లైన్ క్లియర్ చేస్తారు. ఇందులో భాగంగా ఈ నెల 19న గుంటూరు జిల్లాలో అదాలత్ నిర్వహించాలని కమిషనర్ నిర్ణయించారు. ఈ నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీరాజ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొట్టమొదటగా కమిషనరేట్‌ను జిల్లాలకు తరలించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తుండడంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల సంక్షేమ సంఘం నేతలు కేఎస్ వరప్రసాద్, కేఎన్‌వీ ప్రసాద్, డి.వెంకట్రావు హర్షం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు మంత్రి కావడం ఉద్యోగులకు స్వర్ణయుగంగా మారిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రికి, ఓఎస్‌డీ వెంకటకృష్ణ, ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్, కమిషనర్ కృష్ణతేజలకు ధన్యవాదాలు తెలియజేశారు. శాఖ అధికారులందరూ కృషి చేయడం వల్లే తమకు పదోన్నతులు దక్కాయన్నారు.

'ఆరోగ్య బీమా'లో

మరో అడుగు

» ఆర్‌ఎఫ్‌పీ, డీసీఏలకు ఆమోదం.. టెండర్లకు సర్కారు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అందరికీ ఆరోగ్య బీమా అమలు ప్రక్రియలో ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలుకు ఇప్పటికే మంత్రివర్గం ఆమోదించగా, ఇప్పుడు టెండర్ విధానం ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీని ఎంపిక చేసేందుకు డ్రాఫ్ట్ ఆర్‌ఎఫ్‌పీ(రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్-ఆరోగ్య బీమా కోసం ప్రతిపాదన అభ్యర్థన), డీసీఏ(డ్రాఫ్ట్ కాంట్రాక్ట్ అగ్రిమెంట్)లకు ఆమోదం తెలిపింది. టెండర్లు పిలిచేందుకు ఏపీఎంఎంఎస్ఐడీసీకి అనుమతులిచ్చింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పీఎం జేఏవై-డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ పథకం కింద హైబ్రిడ్ విధానంలో రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో రూ.5లక్షల లోపు ఆదాయం ఉన్న వారిని బీపీఎల్ కింద పరిగణిస్తారు. వీరికి రూ.2.50 లక్షల వరకూ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా వైద్యం అందిస్తారు. వైద్యం ఖర్చు రూ.2.50 లక్షలు దాటి రూ.25 లక్షల వరకూ అయితే ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ పరిధిలోకి తీసుకువచ్చి వైద్యం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దారిద్ర్యరేఖకు పైన ఉన్న (ఏపీఎల్) కుటుంబాలకు మాత్రం రూ.2.50 లక్షల వరకు ఉచితంగా వైద్యం పొందే వెసులుబాటు కల్పించనుంది.

తొలి విడత పీపీపీకి

4 వైద్య కళాశాలలు

» ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల..

» మిగిలిన ఆరు కాలేజీలకూ ఆర్‌ఎఫ్‌పీ సిద్ధమయ్యాక టెండర్లు

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొత్త వైద్య కళాశాలలను దశల వారీగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో (పీపీపీ) చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కొత్త మెడికల్ కాలేజీల్లో 10 కాలేజీలను పీపీపీ ద్వారా అభివృద్ధి చేయాలని ఇప్పటికే మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందుల, పెనుకొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో అందుబాటులోకి తీసుకురానుంది. ఈ మేరకు సిద్ధం చేసిన ఆర్‌ఎఫ్‌పీకి ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ ఎం.టి.కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలివిడతలో ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల కాలేజీలను పీపీపీకి ఇవ్వనున్నారు. మిగిలిన ఆరు కాలేజీలు వీజీబులిటీ రిపోర్టు, డ్రాఫ్ట్ ఆర్‌ఎఫ్‌పీ సిద్ధమైన తర్వాత పీపీపీ విధానంలోకి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. పీపీపీ విధానం కోసం కంపెనీలను ఎంపిక చేసేందుకు టెండర్లు ఆహ్వానించనున్నట్లు తెలిపారు. టెండర్ కమిటీ ప్రీ బిడ్ మీటింగ్ అనంతరం ఆర్‌ఎఫ్‌పీలో చిన్న చిన్న మార్పులకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.




మూడు పార్టీల జెండాలు, ఫ్లెక్సీలతో నిండిన అనంతపురం నగరం, సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు పయ్యావుల, సవిత, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

నేడే సూపర్ సిక్స్ జయభేరి!

(మొదటి పేజీ తరువాయి)

నగదు జమ చేశారు. మరో రూ.2 వేలను పాఠశాలల అభివృద్ధికి వెచ్చిస్తున్నారు.

అన్నదాత సుఖీభవ: ఈ పథకం కింద 44 లక్షల మంది చిన్న, సన్నకారు రైతులకు ఏడాదికి రూ.20వేలను మూడు విడతలుగా అందిస్తారు. తొలి విడతగా.. రూ.7 వేలను ఇప్పటికే అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.

స్త్రీ శక్తి: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే ఈ పథకాన్ని గతనెల 15నుంచి అమలు చేస్తున్నారు. తద్వారా ఉద్యోగాలు, వ్యాపారాలు చేసే మహిళల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారి వరకు కూడా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు. దీంతో వారికి ప్రయాణ ఖర్చుల రూపంలో నెలకు సుమారు రూ.3-4 వేల వరకు మిగులుతున్నాయి.

మరెన్నో..

సూపర్ సిక్స్ పథకాలతోపాటు.. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పెంపుతో లబ్ధిదారుల కుటుంబాల్లో ప్రభుత్వం సంతోషం నింపుతోంది. రాష్ట్రంలో 200 పైచిలుకు 'అన్న క్యాంటీన్'లను ఏర్పాటు చేసి.. పేదలకు రూ.5కే ప్రభుత్వం కడుపు నిండా అన్నం పెడుతోంది. మెగా డీఎస్సీ నిర్వహణతో 16 వేలకు పైగా కొలువులు కల్పించింది. 15నెలల కాలంలో సుమారు రూ.10 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులకు ఒప్పందాలను కుదుర్చుకుని యువతకు ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు రాయలసీమపై మరింత పట్టు బిగించేందుకు 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభకు శ్రీకారం చుట్టారు.

50 ఎకరాలు.. అదిరేలా ఏర్పాట్లు!

ఈ సభకు 50 ఎకరాల విస్తీర్ణంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి 3.50 లక్షల మంది ప్రజలు, ఆయా పార్టీల అభిమానులు సభకు వస్తారని అంచనాతో ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పది మందికి పైగా మంత్రులు, 80 మంది ఎమ్మెల్యేలు అనంతపురం చేరుకున్నారు. వేలాది మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. సభ ఏర్పాట్లను టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, నారాయణ పర్యవేక్షిస్తున్నారు. అనంతపురం నగర శివారులో బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన, శ్రీనగర్ కాలనీలో ఉన్న జీఎంఆర్ ఇంద్రప్రస్థ గ్రౌండ్స్‌లో 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభ జరగనుంది. సుమారు 50 ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ స్థలంలో 3.50 లక్షల మంది కూర్చునేలా గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. వాటర్ బాటిళ్లను అందుబాటులో ఉంచారు. శ్రీనగర్ కాలనీ, నేషనల్ హైవే-44కు ఇరువైపులా వందలాది ఖాళీ స్థలాలు, ప్రసన్నాయపల్లి రైల్వే గేట్ సమీపంలోని ఖాళీ స్థలాలు, రాప్తాడు మండలంలోని పలు ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

షెడ్యూల్ ఇదీ..

- 'సూపర్ సిక్స్' సభ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు జరగనుంది.
- సీఎం చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు అనంతపురం నగరంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడే 1.40 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. 2 గంటలకు సభా వేదిక వద్దకు చేరుకుని 4.30 గంటల వరకు సభలో పాల్గొంటారు.
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 10.30 గంటలకు హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఉన్న ఇంటి నుంచి బయలుదేరి 12.30కు పుట్టపర్తి ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలిక్యాప్టర్‌లో 1 గంటకు అనంతపురంలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అనంతరం సభావేదిక వద్దకు చేరుకుని కొద్ది సేపు విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత 2 గంటల నుంచి సభలో పాల్గొంటారు.

సీమలోనే ఎందుకంటే?

సూపర్ సిక్స్ సభను రాయలసీమలో నిర్వహించడానికి ప్రత్యేక కారణం ఉంది. 2024 ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు 49 స్థానాల్లో విజయం సాధించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రాయలసీమపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తోంది. ఫ్యాక్షన్ కట్టడితోపాటు ఈ జిల్లాలను సస్యశ్యామలం చేసేందుకు గత, ప్రస్తుత టీడీపీ నేతృత్వంలోని ప్రభుత్వం హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ, ముచ్చుమర్రి లిఫ్ట్ వంటి ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసింది. అనంతపురం జిల్లాకు సాగు, తాగునీరిచ్చింది. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా కరువు నివారణకు కృషి చేస్తోంది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పారిశ్రామికీకరణకు పెద్దపీట వేసింది. కడప జిల్లా కొప్పర్తిలో పారిశ్రామిక హబ్, కర్నూలులో ఓర్వకల్లు హబ్, అనంతపురం జిల్లాలో కియా, విండ్, సోలార్ పవర్ యూనిట్ల ద్వారా లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తోంది. రాయలసీమలో హార్టీకల్చర్, పరిశ్రమలు, డెయిరీలు అభివృద్ధి చేసి సీమలో మరింత పట్టు బిగించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ ఏడాది మేలో కడప జిల్లాలో టీడీపీ 'మహానాడు'ను నిర్వహించడం ఈ వ్యూహంలో భాగమేనని చెబుతున్నారు. ఇటీవల జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఘనవిజయం సాధించడంతో సీమలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఇప్పుడు అదే ఊపుతో 'సూపర్ సిక్స్' సభను అనంతపురంలో నిర్వహిస్తున్నారు.



సభాప్రాంగణంలో ఎన్టీఆర్, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఎమ్మెల్యే బాలకృష్ణ కటౌట్లు

ఆడిట్ కోసం వచ్చి

బంగారం చోరీ!

» ఫైనాన్స్ కంపెనీ ఆడిటర్ చేతివాటం

» 2.5కోట్ల విలువైన తాకట్టు బంగారంతో పరార్



ఆడిటర్ మహేశ్

ఏలూరు క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చింతలపూడిలోని ఒక ఫైనాన్స్ కంపెనీ బ్రాంచ్‌కు ప్రధాన కార్యాలయం నుంచి ఆడిటర్‌గా వచ్చిన వ్యక్తి.. బ్యాంకు అధికారులను ఏమార్చి.. రూ.2.50 కోట్ల విలువైన బంగారు ఆభరణాలతో పరారయ్యాడు. వివరాలివీ.. ఏలూరు జిల్లా చింతలపూడిలోని కనకదుర్గ గోల్డ్ ఫైనాన్స్ బ్రాంచ్‌కు విజయవాడ హెడ్ ఆఫీస్ నుంచి మంగళవారం ఉదయం 11 గంటలకు ఆకస్మిక ఆడిటర్‌గా వడ్లమూడి ఉమామహేశ్ వచ్చాడు. బ్రాంచ్ మేనేజర్ యాదాల ప్రవీణ్ కుమార్, క్యాషియర్ అమృతాల ఆశను వివరాలు అడిగి.. ఖాతాదారులకు చెందిన తాకట్టులో ఉన్న బంగారం ప్యాకెట్లను చూపించాలని ఆదేశించాడు. దీంతో వారు స్ట్రాంగ్ రూమ్‌లోని 380 ప్యాకెట్లను ఆయన ముందుంచగా, ఒక్కొక్కటీ పరిశీలిస్తూ తూకం వేశాడు. సాయంత్రం 5 గంటల సమయంలో కొబ్బరినీళ్లు తీసుకురావాలని మేనేజర్, క్యాషియర్‌ను పంపించాడు. వారు తిరిగొచ్చేసరికి ఉమామహేశ్ కనిపించలేదు. అనుమానం వచ్చి సీసీ టీవీ ఫుటేజ్ పరిశీలించగా, ఆడిటర్ ఆ ఆభరణాన్నింటినీ బ్యాగ్‌లో పెట్టుకుని తేలింది. దీంతో బ్రాంచి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. చింతలపూడి బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కిన అతడు మధ్యలో ఎక్కడో దిగి వేరే వాహనంలో తెలంగాణవైపు పరారై ఉండొచ్చని భావిస్తున్నారు. ఉమామహేశ్ మొత్తం రూ.2.50కోట్ల విలువైన తాకట్టులోని బంగారు ఆభరణాలను అపహరించుకుపోయినట్లు చెబుతున్నారు.

19న మెగా డీఎస్సీ సభ!

(మొదటి పేజీ తరువాయి)

సమీపంలోనే సభ నిర్వహణకు కసరత్తు చేస్తున్నారు. ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన డీఎస్సీ జాబితాలు 15న విడుదల చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలన పూర్తికాగా 18 మంది అభ్యర్థుల పరిశీలన మంగళవారం చేపట్టారు. ఉద్యోగాలకు అర్హులుగా భావిస్తున్న వారి జాబితాలను మరోసారి పరిశీలిస్తున్నారు. అన్ని జిల్లాల డీఈవోలు, ఆర్జేడీలను మంగళగిరిలోని విద్యాభవన్‌కు తీసుకొచ్చి సోమవారం ఈ ప్రక్రియ ప్రారంభించారు. రెండు రోజుల్లో ఈ పరిశీలన పూర్తయిన తర్వాత జాబితాలను జిల్లాలకు పంపి డీఎస్సీ కమిటీలతో సంతకాలు చేయిస్తారు. అనంతరం 15న తుది జాబితాలు ప్రకటిస్తారు. అమరావతిలో నిర్వహించే సభలో అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తారు. దసరా సెలవుల్లో కొత్త టీచర్లకు శిక్షణ కార్యక్రమాలతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇస్తారు. సెలవుల అనంతరం బడుల పునఃప్రారంభం రోజున కొత్త టీచర్లు పాఠశాలల్లో ఉండాలని పాఠశాల విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది.



ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ నజీర్

వైద్యుల చేతుల్లోనే ప్రజల ఆరోగ్యం

» ఎన్టీఆర్ వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ నజీర్

విజయవాడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం వైద్యుల చేతుల్లోనే ఉందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. వర్తమాన వైద్యులు నూతన మెలకువలను నేర్చుకుంటూ ఈ రంగాన్ని అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. ఎన్టీఆర్ వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 27, 28వ స్నాతకోత్సవాన్ని విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించారు. వైద్య విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు పతకాలు, ధ్రువీకరణ పత్రాలను ప్రదానం చేశారు. ఢిల్లీకి చెందిన నేషనల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో డాక్టర్ ఓపీ యాదవ్‌కు ఎన్టీఆర్ వర్సిటీ డాక్టరేట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ వైద్య విజ్ఞానంలో పెరుగుతున్న సాంకేతికతకు అనుగుణంగా మెలకువలను పెంచుకోవాలని సూచించారు. వైద్యరంగంలో రాష్ట్రం మంచి పురోగతిని సాధించిందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12న బీసీ ప్రజాప్రతినిధులతో భేటీ: మంత్రి సుభాష్

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలతో విజయవాడలో 12న సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కులాల మధ్య అల్లర్లు సృష్టించి, విష ప్రచారం చేస్తూ రాష్ట్రంలోకి పెట్టుబడులు రాకుండా చేయాలని వైసీపీ చూస్తోందని మండిపడ్డారు. వైసీపీ గాలి మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని కోరారు. శెట్టిబలిజ సామాజిక వర్గాన్ని ఓసీల్లో చేరుస్తున్నారంటూ కోనసీమ వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రతిపక్షం కాదు, విషవృక్షం అని మంత్రి విమర్శించారు.

యూరియాపై వైసీపీ తప్పుడు ప్రచారం

» రైతుల అవసరం మేరకు సరఫరా చేస్తాం : మంత్రి అచ్చెన్న

అనంతపురం క్రైం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'యూరియాపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది. రైతులు ఆందోళన చెందవద్దు. అవసరాల మేరకు యూరియా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయి' అని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. బుధవారం ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ పాలనలో యూరియా ఇవ్వకుండా రైతులకు నరకం చూపించారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 81వేల హెక్టార్లలో అధికంగా పంటలు వేశారు. వ్యవసాయంలో యూరియా వాడకాన్ని తగ్గించాలని, దానివల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని కేంద్రం తెలిపింది. వైసీపీ నాయకులు చేస్తున్న అవాస్తవ ప్రచారంతో భయపడిన రైతాంగం భవిష్యత్తులో యూరియా దొరకదన్న భయంతో ఖరీఫ్‌తోపాటు, రబీకి కూడా యూరియా తీసుకునేందుకు ఎగబడుతున్నారు. రైతుల అవసరాల మేరకు ప్రభుత్వం యూరియాను సిద్ధంగా ఉంచుతోంది. ఎప్పటికప్పుడు సరఫరా చేస్తాం. కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే మాట్లాడింది. త్వరలో 50 వేల టన్నులు యూరియా వస్తుంది. రబీకి సైతం మరో లక్ష టన్నుల యూరియా వస్తుంది. పంజాబ్‌లో యూరియా ఎక్కువగా వాడటం వల్ల చాలామంది క్యాన్సర్ బారిన పడ్డారు. అందుకే శాస్త్రవేత్తలు కూడా యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచిస్తున్నారు' అని మంత్రి విజ్ఞప్తి చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.